నారాయణ విద్యార్థుల్లో 33% మంది డాక్టర్లని దేశానికి అందిస్తున్న నారాయణ !
NEET - 2026
AIR 1 ARYAN GUPTA
AIR 9 GAURAV SINGH
నారాయణ విద్యాసంస్థలు
www.narayanagroup.com

www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం ★★

NEET - 2026
అన్ని కేటగిరీలలో 10 లోపు 7 ర్యాంకులు
100 లోపు 45 ర్యాంకులు | 1000 లోపు 163 ర్యాంకులు
నారాయణ విద్యాసంస్థలు
www.narayanagroup.com

సంపుటి 09, సంచిక: 229 | ఆదివారం | 19-07-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

47 YEARS OF EXCELLENCE
SRAMAYEVA JAYATHE
NARAYANA®
EDUCATIONAL INSTITUTIONS
nLearn® Online learning app

## NEET 2026లో తెలుగు రాష్ట్రాల నుండి 2135 వరకు డాక్టర్లను సృష్టించి

## నారాయణ విద్యార్థులలో ప్రతి ముగ్గురిలో ఒకరిని డాక్టర్‌ని చేసి 33% మంది డాక్టర్లని దేశానికి అందిస్తున్న నారాయణ

ఆల్ ఇండియా అన్ని కేటగిరీలలో




ARYAN GUPTA
App. No. 260410023990
(CIP)

RANVEER KUMAR
App. No. 260410035204
nPrep (Gen EWS)

ADITYA SHARMA
App. No. 260410342685
nPrep (Gen EWS)

GAURAV SINGH
App. No. 260410079810
nPrep

ANUSHKA CHOUDHARY
App. No. 260410021314
nPrep (OBC-NCL)

ఓపెన్ కేటగిరీలో

ఆల్ ఇండియా టాప్ 10లో 2 ర్యాంకులు

ఆల్ ఇండియా టాప్ 50లో 10 ర్యాంకులు

ఆల్ ఇండియా టాప్ 100లో 18 ర్యాంకులు

nPrep : Narayana Digital Learning Programme
CIP : Coaching Integration Programme

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

## NEET 2026 ఓపెన్ కేటగిరీలో 500 లోపు టాప్ ర్యాంకులు

AIR 15 Krish Gupta, App. No. 260411104787, nPrep
AIR 16 Kartik Chaudhary, App. No. 260410189559, nPrep
AIR 22 Harshil Gupta, App.No. 260410024522, nPrep
AIR 30 Akshit K. Gaur, App.No. 260410850821, nPrep
AIR 31 Prakhar Bansal, App.No. 260410156444, nPrep
AIR 35 Sabyasachi Laskar, App.No. 260410945197, nPrep
AIR 39 Ranveer Kumar, App.No. 260410035204, nPrep
AIR 50 Arnav Jindal, App.No. 260410211081, nPrep
AIR 56 Bhavika Gupta, App.No. 260410343476, nPrep
AIR 58 Anushka Choudhary, App.No. 260410021314, nPrep
AIR 71 Bhavyaa Gunwal, App.No. 260410001881, Classroom
AIR 72 Krish Chauhan, App.No. 260410298589, nPrep
AIR 76 Aditya Sharma, App.No. 260410342685, nPrep
AIR 78 Thanth K Vijaybhai, App.No. 260410543156, nPrep
AIR 79 Divit Jain, App.No. 260410146253, nPrep
AIR 97 Vinayak Garg, App.No. 260410140823, nPrep
AIR 125 Srinivasa Reddy. V, App.No. 260410246065, Classroom
AIR 142 Chaithra Y, App.No. 260410013102, Classroom
AIR 145 Nidhi Yadav., App.No. 260410255961, Classroom
AIR 150 N Sai Shravya, App.No. 260411027019, Classroom
AIR 188 R Jaswanth Ram., App.No. 260410271452, Classroom
AIR 194 Lohith Kumar. Y, App.No. 260410511141, Classroom
AIR 199 M B Vardhan Reddy., App.No. 260410262142, Classroom
AIR 219 Shreya Kale., App.No. 260410028123, Classroom
AIR 237 Tanush V, App.No. 260410280979, Classroom
AIR 238 Eashan Jagdeep D, App.No. 260410100984, Classroom
AIR 258 Nishita, App.No. 260410340507, Classroom
AIR 316 S Rohith Raju. D, App.No. 260410723484, Classroom
AIR 347 Vaibhav Jindal, App.No. 260411216433, nPrep
AIR 357 Saisha Jain., App.No. 260410096340, Classroom
AIR 371 Prashil Makwana., App.No. 260410346182, Classroom
AIR 434 Guru Bala Akhil. A, App.No. 260411007179, Classroom
AIR 486 M Yashika., App.No. 260410226839, Classroom

Disclaimer: Some students are featured more than once for securing both Open Category and Category ranks.

NEET 2026 ఆల్ ఇండియా అన్ని కేటగిరీలో టాప్ 10లో 7 ర్యాంకులు

NEET 2026 ఆల్ ఇండియా అన్ని కేటగిరీలో టాప్ 100లో 45 ర్యాంకులు

NEET 2026 ఆల్ ఇండియా అన్ని కేటగిరీలో టాప్ 1000లో 163 ర్యాంకులు

### NEET LONG TERM 2026-27 MERIT CONCESSION

| MARKS IN NEET-2026 | % ON CONCESSIONS | MARKS IN NEET-2026 | % ON CONCESSIONS |
|---|---|---|---|
| >370 | 90% | 330-339 | 40% |
| 360-369 | 75% | 320-329 | 30% |
| 350-359 | 60% | 300-319 | 20% |
| 340-349 | 50% | | |

nConnect Tech-enabled performance tracking

## NEET LONGTERM 1st BATCH STARTS FROM 20-07-2026

#YourDreamsAreOurDreams
Toll Free: 1800 102 3344
www.narayanagroup.com





## గొప్ప ప్రయత్నం..



మానవత్వం, ప్రేమ, సానుభూతి ఎంతటి ప్రాణరక్షక శక్తిగా మారగలవో తెలియజేసే హృదయాన్ని కదిలించే నిజజీవిత సంఘటన. మిక్ ర్యాన్ అనే వ్యక్తి తన 22 ఏళ్ల కుమారుడు సీన్ పాల్ ఆత్మహత్య చేసుకోవడంతో కుంగిపోయాడు. అయితే, ఆ విషాదం ఆయన జీవితాన్ని శాశ్వతంగా మార్చేసింది. అతను బాధలోనే కూరుకుపోకుండా, మరొక కుటుంబం ఇలాంటి దుఃఖాన్ని అనుభవించకూడదనే సంకల్పంతో ఆయన ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆత్మహత్యలు ఎక్కువగా జరిగే వంతెనలపై చిన్న టెడ్డీ బొమ్మలను ఉంచి, వాటితో పాటు 'మీ కుటుంబ సభ్యులు, మీ స్నేహితులు మిమ్మల్ని ప్రేమిస్తున్నారు' అనే సందేశాన్ని, ఆత్మహత్య నివారణ సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లను ఉంచడం ప్రారంభించారు. ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్న వ్యక్తి ఆ సందేశాన్ని ఒక్కసారి చదివినా, తన నిర్ణయాన్ని మార్చుకోవచ్చనే ఆశతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాడు. ఈ ప్రయత్నం ఫలించింది కూడా. ఒక యువకుడు ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో వంతెనపైకి వెళ్లినప్పుడు, అక్కడ ఉన్న టెడ్డీ బొమ్మను, దానిపై ఉన్న ప్రేమపూర్వక సందేశాన్ని చూసి మనసు మార్చుకున్నాడు. ఇంటికి తిరిగి వెళ్లి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి, అవసరమైన సహాయం పొందాడు. ఆ చిన్న సందేశం ఒక ప్రాణాన్ని కాపాడింది. ఈ సంఘటన మనకు ఒక గొప్ప సత్యాన్ని గుర్తు చేస్తుంది. తీవ్రమైన మానసిక వేదనలో ఉన్న వ్యక్తికి పెద్ద పెద్ద సలహాలు అవసరం కాకపోవచ్చు. కొన్నిసార్లు నువ్వు ఒంటరివి కాదు, నిన్ను ప్రేమించే వాళ్లు ఉన్నారు అనే చిన్న మాటలే జీవితం పట్ల కొత్త ఆశను కలిగిస్తాయి. బాధలో ఉన్న వ్యక్తిని విమర్శించడం కంటే, అతని మాటలను ఓపికగా వినడం, అతని భావాలను అర్థం చేసుకోవడం, అవసరమైతే నిపుణుల సహాయం తీసుకునేలా ప్రోత్సహించడం ఎంతో అవసరం. మిక్ ర్యాన్ తన కుమారుడిని తిరిగి పొందలేకపోయినా, తన వ్యక్తిగత విషాదాన్ని సమాజానికి మేలుచేసే సేవగా మార్చుకున్నారు. ఆయన చేసిన చిన్న ప్రయత్నం ఎంతోమంది జీవితాల్లో ఆశాకిరణంగా మారింది.

## గగనతనంలో అలల మేఘాలు!






ప్రపంచంలో అత్యంత అరుదుగా కనిపించే మేఘాల ఆకృతుల్లో ఒకటైన 'అస్పెరిటాస్' విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆకాశంలో సముద్రపు అలలు ఒక్కసారిగా గడ్డకట్టినట్లుగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఈ దృశ్యం చూసినప్పుడు తుఫాను వీచే సముద్రం మన తలపైకి వచ్చినట్లుగా అనిపిస్తుంది. అందుకే ప్రకృతి సృష్టించిన అత్యంత అద్భుతమైన, నాటకీయమైన మేఘాల రూపాల్లో ఇవి ప్రత్యేక స్థానం పొందాయి. 'అస్పెరిటాస్' అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. దీనికి 'ఎగుడుదిగుడుగా ఉండే ఉపరితలం' లేదా 'అలలతో కూడిన ఆకృతి' అనే అర్థం ఉంది. సాధారణ మేఘాల మాదిరిగా కాకుండా వీటి అడుగు భాగం భారీ అలల మాదిరిగా మెలికలు తిరుగుతూ కనిపిస్తుంది. 'అస్పెరిటాస్' మేఘాలు సాధారణంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసిన తర్వాత లేదా తీవ్రమైన వాతావరణ బీభత్సం తగ్గుముఖం పట్టే సమయంలో ఏర్పడతాయి. వాతావరణంలోని వివిధ పొరల్లో గాలి వేర్వేరు వేగాలతో, వేర్వేరు దిశల్లో కదలడం వల్ల ఈ అలల ఆకృతులు ఏర్పడతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఇవి ఎలా ఏర్పడతాయనే విషయంపై ఇప్పటికీ పూర్తిస్థాయి శాస్త్రీయ వివరణ లేదు. అందువల్ల ఇవి వాతావరణ శాస్త్రంలో ఆసక్తికరమైన రహస్యంగా కొనసాగుతున్నాయి. ఈ మేఘాలు భయానకంగా కనిపించినప్పటికీ, అవి తప్పనిసరిగా తుఫాను లేదా ప్రకృతి విపత్తుకు సంకేతం కావు. చాలా సందర్భాల్లో తుఫాను ముగిసిన తర్వాత కూడా ఇవి కనిపిస్తాయి. 2017లో ప్రపంచ వాతావరణ సంస్థ అంతర్జాతీయ క్లౌడ్ అట్లాస్‌లో 'అస్పెరిటాస్'ను ప్రత్యేక మేఘాల ఆకృతిగా అధికారికంగా గుర్తించింది. ఈ మేఘాలు ప్రకృతిలో ఇంకా ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయనే విషయాన్ని కూడా గుర్తుచేస్తాయి.

## చారిత్రక గ్రంథాలయం 'జొయనినా'



పోర్చుగల్‌లోని 'జొయనినా' గ్రంథాలయం ప్రపంచంలోని అత్యంత అందమైన చారిత్రక గ్రంథాలయాలలో ఒకటి. 18వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ గ్రంథాలయం బరోక్ శిల్పకళకు అద్భుతమైన నిదర్శనం. బంగారు అలంకరణలు, అద్భుతమైన చెక్క నగిషీలు, కళాత్మక చిత్రాలతో అలరారే ఈ భవనం పుస్తకాల భాండాగారంగా విరాజిల్లుతున్నది. అంతేగాక, పోర్చుగల్ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచింది. ఈ గ్రంథాలయాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెట్టే అంశం ఇక్కడ నివసించే గబ్బిలాల చిన్న కాలనీ. పగటిపూట ఇవి పుస్తకాల అలమరల వెనుక దాక్కుని విశ్రాంతి తీసుకుంటాయి. రాత్రి సమయంలో బయటకు వచ్చి పుస్తకాలను దెబ్బతీసే చిమ్మటలు, మిడతలు, ఇతర కీటకాలను వేటాడి తింటాయి. దీంతో అరుదైన పాత పుస్తకాలు, విలువైన హస్తప్రతులు కీటకాల బారిన పడకుండా సహజసిద్ధంగా రక్షించబడతాయి. రసాయనిక పురుగుమందులు ఉపయోగించకుండా ప్రకృతినే సంరక్షకుడిగా మార్చుకున్న ఈ విధానం విశేషమైనది. అయితే గబ్బిలాల నివాసం వల్ల కొంత అసౌకర్యం కూడా ఉంటుంది. అవి విసర్జించే మలంతో బల్లలు, ఫర్నిచర్ మురికిగా మారకుండా ఉండేందుకు ప్రతి సాయంత్రం గ్రంథాలయ సిబ్బంది పతన బల్లలపై ప్రత్యేక తోలు కవర్లు పరుస్తారు. ఉదయం వాటిని తొలగించి బల్లలను శుభ్రం చేస్తారు. ఈ విధంగా గబ్బిలాల వల్ల కలిగే ఇబ్బందిని తగ్గిస్తూ, వాటి సహజ సేవలను కొనసాగిస్తున్నారు. ప్రపంచంలో గబ్బిలాలు శాశ్వతంగా నివసిస్తూ పుస్తకాలను సంరక్షించే గ్రంథాలయాలు చాలా అరుదు. అందువల్ల జొయనినా గ్రంథాలయం చరిత్రకారులు, పరిశోధకులు, పుస్తకప్రియులు, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రకృతితో సహజీవనం చేస్తూ అమూల్యమైన వారసత్వ సంపదను కాపాడవచ్చని, పర్యావరణహిత పరిష్కారాలు శతాబ్దాల పాటు ఫలితాలను అందించగలవని ఈ గ్రంథాలయం ప్రపంచానికి చక్కని సందేశాన్ని అందిస్తోంది.

## మొహెంజొదారో అద్భుత దృశ్యం



సూర్యాస్తమయ సమయంలో మొహెంజొదారోలోని 'స్తూప దిబ్బ' బంగారు కాంతిలో మెరిసిపోతూ అద్భుతమైన దృశ్యాన్ని సృష్టిస్తుంది. మొహెంజొదారోలో అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఒకటైన ఈ దిబ్బ, సింధు నాగరికత కాలానికి చెందినది కాదు. సింధు నాగరికత పతనమైన అనేక శతాబ్దాల తరువాత బౌద్ధమతం వ్యాప్తిచెందిన కాలంలో ఈ స్తూపాన్ని నిర్మించారు. ప్రారంభ పురావస్తు శాస్త్రవేత్తలు స్తూపదిబ్బను గ్రేట్ బాత్, కాలేజ్‌గా పిలువబడే భవనం వంటి నిర్మాణాల నుంచి వేరుచేసే వీధికి 'డివినిటీ లేన్' అనే పేరు పెట్టారు. ఈ ప్రాంతం మతపరమైన కార్యకలాపాలకు కేంద్రంగా ఉండి ఉండవచ్చని వారు భావించారు. సింధు నాగరికత ప్రజలు ఈ వీధిని ఏమని పిలిచేవారో, దానికి ప్రత్యేక పేరు ఉండేదో కూడా ఇప్పటికీ తెలియదు. కాబట్టి 'డివినిటీ లేన్' అనేది చారిత్రకంగా నిర్ధారిత పేరు కాకుండా, ఆధునిక పురావస్తు శాస్త్రవేత్తలు ఉపయోగించిన పేరు మాత్రమే. మొహెంజొదారోలోని డిజికెఐ హెచ్‌ఆర్ ప్రాంతాల పురాతన వీధులు సాయంత్రపు సూర్యకాంతిలో మరింత మనోహరంగా కనిపిస్తాయి. అస్తమించే సూర్యుడి బంగారు కిరణాలు వేల సంవత్సరాల నాటి ఇటుకలపై ప్రసరించినప్పుడు, ఆ ప్రాచీన నగరం మళ్లీ జీవం పొందినట్లుగా అనిపిస్తుంది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# దీక్షపై దౌర్జన్యం

ఊహించిందే జరిగింది. ప్రజాస్వామిక ఉద్యమాలను అణిచివేసేందుకు గతం నుంచి అనుసరిస్తోన్న పద్ధతినే మోదీ ప్రభుత్వం మరోసారి ప్రయోగించింది. నీట్ పరీక్షాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న శాంతియుత నిరశనపై దౌర్జన్య అస్త్రాన్నే ప్రయోగించింది. ఇరవై ఒక్కరోజులుగా ఆయన నిరవధిక నిరాహార దీక్షకు వేదికగా నిలిచిన జంతర్‌మంతర్ శిబిరంపై మఫ్టీలో ఉన్న పోలీసులు ఒక్కసారిగా విరుచుకపడ్డారు. ఇందుకు శిబిరం పలుచగా ఉండే ఉదయం ఏడు గంటల సమయాన్ని ఎంపిక చేసుకొన్నారు. శరవేగంగా వాంగ్‌చుక్ శయనించిన వేదిక పైకి దూసుకపోయి, పైన జరిగేదేమి కనపడకుండా తెల్ల దుప్పట్ల తెరను అడ్డుగా ఉంచారు. ఆయనను దౌర్జన్యంగా ఎత్తుకెళ్ళే దృశ్యాలు కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకే సర్కారు పన్నిన పన్నాగాన్ని పక్కాగా అమలు చేసేందుకే ఈ తాపత్రయమంతా. ఆ సమయంలో సోనమ్ వాంగ్‌చుక్‌ను ఎత్తుకెళ్ళకుండా అడ్డుపడిన వారిపై పోలీసుల దండప్రయోగం జరిగింది. వారందరినీ తప్పించి ఆయనను భారీ పోలీసు బందోబస్తు మధ్య సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు.

హైకోర్టు ఆదేశాల మేరకే తామీ పనిచేసినట్లుగా ఢిల్లీ పోలీసు డిప్యూటీ కమిషనర్ తమ చర్యను సమర్థించుకున్నారు. అయితే, ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం ఏమి చెప్పింది? దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగానైనా ఆసుపత్రిలో చేర్చి ద్రవరూపంలో పోషకాలను అందించాలని కోరుతూ మూడు రోజుల క్రితం ఒక వ్యక్తి కోర్టు తలుపు తట్టాడు. దీనిపై ప్రభుత్వ వాదనలు విన్న తరువాత హైకోర్టు – ఆయన(వాంగ్‌చుక్)కు నిరంతరం, ప్రతిరోజూ ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరగాలని, నివేదికల ఆధారంగా అవసరమైతే చికిత్స అందించాలని, ప్రతి ప్రాణం అమూల్యమైనదని ఆదేశాలు జారీ చేసింది. తాను బలహీనంగా ఉన్నప్పటికీ, కండరాలు సడలినప్పటికీ, చురుకుగానే ఉన్నానని, దీక్షను కొనసాగిస్తానని, ప్రభుత్వ నిస్పందనకు నిరసనగా జులై 20న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని వాంగ్ చుక్ దీక్ష 18వ రోజున వీడియో సందేశమిచ్చారు. శుక్రవారం ఆయనను పరీక్షించిన వైద్యుడు సైతం ఒంట్లో నీరు తగ్గినప్పటికీ, ఆరోగ్యం నిలకడగానే ఉందని వెల్లడించారు.

మరుసటి రోజే కేంద్రం కనుసన్నల్లో పనిచేసే ఢిల్లీ పోలీసులు దీక్షా శిబిరంపై దాడి జరిపారు. దుప్పట్లో చుట్టేసి ఆయనను ఆసుపత్రికి తరలించారు. నిజంగానే వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ప్రభుత్వానికి శ్రద్ధే కనుక ఉంటే, ఆయనను వాకబు చేసి, ఆసుపత్రికి తీసుకెళ్తామని మర్యాదగా కోరాల్సింది. అలా కాకుండా, శిబిరంపై విరుచుకుపడి, కనీసం స్ట్రెచర్ కూడా తీసుకురాకుండా, దుప్పట్లోనే చుట్టి బలవంతంగా ఆయనను ఆసుపత్రికి తరలించటంలోనే ఆంతర్యం స్పష్టం. ఆసుపత్రికి వెళ్ళిన వాంగ్‌చుక్ జీవిత సహచరి గీతాంజలి ఆంగ్మో ఆయనను కలిసిన తరువాత దీక్ష కొనసాగుతోందని ప్రకటించారు. ముందురోజు వరకూ రక్తంలో వాంగ్‌చుక్ 4.8శాతం ఉన్న పొటాషియం స్థాయి సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో చేరిన వెంటనే 2.9 శాతానికి పడిపోయినట్లు ఆసుపత్రి వర్గాలు చెప్పడంపై ఆమె వ్యక్తం చేసిన సందేహాలలో కూడా వాస్తవం లేకపోలేదు. ఇప్పటికే 21 రోజులుగా దీక్షలో ఉన్న అఖిల భారత విద్యార్థి సంఘం (ఐసా) నాయకులు నేహా, ఆమీన్, మనీశ్ లతో పాటు మరో విద్యార్థి హమద్‌లను కూడా ఎత్తుకెళ్ళేందుకు ఉదయం వచ్చిన పోలీసులకు విద్యార్థులు అడ్డుగోడగా నిలిచారు. ఆ నలుగురు కూడా దీక్షను కొనసాగిస్తున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కూడా జంతర్ మంతర్ దీక్షా శిబిరంలో తక్షణమే నిరవధిక దీక్షకు దిగడమే కాకుండా, 20న చలో పార్లమెంట్ యథావిధిగా కొనసాగుతుందనడం ద్వారా పాలకుల ఆశలను నీరుగార్చారు. ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో ప్రభుత్వ తీరును ఖండించటమే కాకుండా, వాంగ్ చుక్‌కు అండగా నిలిచాయి.

ఈ సందర్భంగా గతంలో అన్నా హజారే ఇదే జంతర్‌మంతర్‌లో దీక్ష చేసిన ఘట్టాన్ని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం నిరంతరం ఆయనతో చర్చలు జరిపి, ఆయన కోరినట్లుగా చట్టాన్ని తీసుకువస్తామనే హామీతో దీక్ష విరమింపజేసింది. నేడు అందుకు పూర్తిగా విరుద్ధంగా, 21 రోజులుగా వాంగ్‌చుక్ దీక్షను మోదీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే పట్టించుకోవడం లేదు. ఇతరుల తప్పులనే ఎన్నడం నేర్చుకొని, తమ తప్పులను కప్పిపుచ్చటమే కాకుండా, ఎత్తిచూపిన వారిని నిరంకుశంగా అణిచివేయటం ఈ ప్రభుత్వానికి అలవాటే.

గతంలో ఢిల్లీ సరిహద్దులోని రైతుల నిరసన, జంతర్‌మంతర్ వద్ద 'ఒకే ర్యాంక్– ఒకే పెన్షన్' కావాలంటూ మాజీ సైనికాధికారుల నిరసన, తమపై అధికార పార్టీ ఎంపి ఆగడాలపై మహిళా రెజ్లర్ల నిరసన, షాహీన్‌బాగ్‌లో సిఎఎ నిరసనలపై ఇదే రీతిలో ఉక్కుపాదం మోపడాన్ని చూశాం. ఇప్పుడూ అదే జరుగుతోంది. అయితే, ఈ సారి ప్రభుత్వ నియంతృత్వ సెగలను నవతరం (జెన్‌జీ), గతంలో బిజెపికి అండగా నిలిచిన పట్టణ మధ్యతరగతి వర్గం చవిచూస్తుండడం కొత్త పరిణామం. తమ మొరను ప్రభుత్వం పట్టించుకోకపోయినా, నిర్బంధాలను, ఆటంకాలను దాటుకొని ప్రజలు కట్టు దప్పక శాంతిపథంలోనే తమ నిరసనను దేశ రాజధాని గడపకు చేర్చుతుండడం విశేషమే. ఇది భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల వారి అమోఘమైన విధేయతకు నిదర్శనమంటే అతిశయోక్తి కాదేమో.

ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేయక ఇప్పటికైనా ప్రభుత్వం మొండితనాన్ని వీడి, తమ సొంత ప్రజల మాటను ఆలకించటం పాలకులకు, దేశానికి శ్రేయస్కరం. నియంతృత్వం హద్దులు దాటితే ప్రజలు సహించబోరనేది చరిత్ర చెప్పిన సత్యం. ●

# వాస్తు, జ్యోతిష్యాలను నిరసించిన ఖగోళ శాస్త్రవేత్త... నార్లేకర్




డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త,
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

వైజ్ఞానిక ప్రపంచంలో మన దేశం తలెత్తుకుని చెప్పుకోగల ఓ పది మంది శాస్త్రవేత్తలలో డాక్టర్ జయంత్ విష్ణు నార్లేకర్ ఒకరు, (19 జులై 1938 – 20 మే 2025) పాప్యులర్ సైన్స్ రచయితగా ప్రసిద్ధుడు. అంతే కాదు, సాహిత్యరంగంలో కూడా తనదైన ముద్ర వేసుకున్నవాడు. బహు గ్రంథకర్త. పూనాలో నెలకొల్పిన ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమి – (ఖగోళ శాస్త్ర అంతర్ విశ్వవిద్యాలయం కేంద్రానికి ప్రారంభదశలోనే డైరెక్టర్‌గా ఉన్నవాడు. జీవిత చరమాంకంలో కూడా జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో, సింపోజియాలలో చురుకుగా పాల్గొనేవాడు. దేశంలో దూరదర్శన్ ఒక్కటే ఉన్న రోజుల్లో అది ప్రసారం చేసే వైజ్ఞానిక కార్యక్రమాలలో తరచూ కనిపిస్తుండేవాడు.ఆ రోజుల్లో దూరదర్శన్ కార్యక్రమాలలో 'సురభి' అనే ప్రోగ్రాం ప్రత్యేకంగా ఉండేది. అందులో జయంత్ నార్లేకర్ శ్రోతలు/ప్రేక్షకులు అడిగిన వైజ్ఞానిక సంబంధమైన ప్రశ్నలకు జవాబులిస్తుండేవాడు. వారి సందేహాలు తీరుస్తూ ఉండేవాడు. వయసు మీద పడిన సమయంలో కూడా ఆయన తన పరిశోధనలు కొనసాగిస్తూనే వచ్చాడు. ముఖ్యం గా 'బ్లాక్ హోల్స్'మీద టఖియాన్స్ (Tachyons) మీద ఆయన పరిశోధనలు చెప్పుకోదగ్గవి. భూమ్యాకర్షణ శక్తి మీద ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, 1964లో అంటే, తన ఇరవై ఆరవ యేటనే విజ్ఞాన జగత్తును ఆశ్చర్యపరిచాడు – విశేషంగా ఆకర్షించాడు! ఫలితంగానే, 'భారతదేశపు ఐన్‌స్టీయిన్'గా ప్రశంసలందుకున్నాడు. ఇంతటి ప్రతిభావంతుడైన మన భారతీయ శాస్త్రవేత్త ఇటీవల రెండు నెలల కింద కన్నుమూస్తే, మన దేశంలో పత్రికలూ, మీడియా సంస్థ లు తమకేమీ పట్టనట్టు మిన్నకున్నాయి. ఎంత విషాదం? అదే రాజకీయ నాయకుల తిట్ల పురాణాలు, సినిమా, క్రికెట్ వార్తలు ఢంకా బజాయిస్తూ వెలుగులోకి తెస్తాయి. సమాజంలో వివేకం పెంచడానికి జీవితాలు ధారపోసిన వారిని పట్టించుకోవు.

జయంత్ నార్లేకర్ చిన్నతనం నుండే చురుకైన విద్యార్థిగా ఉండడానికి కారణం, వారిది విద్యావంతుల కుటుంబం. ఇంట్లో అందరికందరూ హేమాహేమీలు. తండ్రి విష్ణు వాసుదేవ్ నార్లేకర్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్. తల్లి సుమతి నార్లేకర్ సంస్కృత పండితురాలు. తల్లి సోదరుడు – మామ, గణాంక శాస్త్ర నిపుణుడు. ఆయన దగ్గరైతే పిల్లవాడు వృద్ధిలోకి వస్తాడని తల్లిదండ్రులు జయంత్‌ను వారణాసిలోని మామగారింట్లో ఉంచారు. పుట్టిందైతే మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో – ఆ మామగారు చదువు విషయంలో చాలా కఠినంగా ఉండేవాడు. పొద్దున్నే లేచి నల్లబల్లమీద ఒక లెక్కరాసి ఉంచేవాడు. ఇక బాల జయంత్ నానా తంటాలు పడి ఆ లెక్క సాయంత్రంలోగా పూర్తి చేయాల్సిందే! లెక్కలు, భౌతికశాస్త్రం, ఖగోళశాస్త్రం ఇంట్లో ఎప్పుడూ చర్చనీయాంశాలవుతూ ఉండేవి. బాల్యంలో లభించిన ఆ వాతావరణం జయంత్ నార్లేకర్‌పై ఎంతో ప్రభావం చూపింది. బాల్యంలో అతను వారణాసిలోని హిందూ బోయ్స్ స్కూల్లో చదువుకున్నాడు. తర్వాత బెనారస్ విశ్వవిద్యాలయంలో 1957లో బిఎస్‌సిలో చేరాడు. తర్వాత లండన్ వెళ్ళి, అక్కడి కేంబ్రిడ్జి యూనివర్శిటీకి అనుబంధంగా ఉన్న ఫిడ్జి విలియం కాలేజిలో చేరాడు. అది ఒకప్పుడు తన తండ్రి విష్ణు వాసుదేవ్ నార్లేకర్ చదువుకున్న కళాశాలే. అక్కడి నుంచి జయంత్ గణిత శాస్త్రంలో బిఎ డిగ్రీ తీసుకున్నాడు. అయితే ఆయన సీనియారిటీని, సిన్సియారిటీని, ప్రతిభను గుర్తించి, చదవకుండానే వారు ఈయనకు ఎంఎ డిగ్రీ ప్రదానం చేశారు. ఇలాంటి సంఘటనలు సామాన్యంగా జరగవు కదా?

ఆ తర్వాత జయంత్ నార్లేకర్ ఫ్రెడ్ హాయిలీ దగ్గర పరిశోధన కోసం చేరాడు. ఆయన పర్యవేక్షణలో నార్లేకర్, పిహెచ్‌డి సాధించాడు. ఆ రోజుల్లోనే ఈయనకు రీసర్చ్ గైడ్‌గా ఉన్న ఫ్రెడ్ హాయిలీ కేంబ్రిడ్జిలో 'థియరిటికల్ ఆస్ట్రానమీ'– అనే సంస్థను ప్రారంభించాడు. అందులో నార్లేకర్ సీనియర్ ఫెలోగా ఉంటూ, తన గైడ్ హాయిలీకి పూర్తి సహాయ సహకారాలు అందించాడు. ఏవో ఇతర కారణాల వల్ల ఫ్రెడ్ హాయిలీ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అందువల్ల జయంత్ నార్లేకర్ కూడా ఇక అక్కడ కొనసాగలేక భారతదేశానికి తిరిగి వచ్చాడు. అన్ని అర్హతలున్నాయి కాబట్టి, రావడం రావడంతోనే ముంబాయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చిలో ప్రొఫెసర్‌గా చేరాడు. అక్కడ చాలాకాలం పనిచేశాడు. అక్కడ థియెరిటికల్ ఆస్ట్రోఫిజిక్స్ గ్రూపును తయారు చేసుకున్నాడు. అనతికాలంలో ప్రపంచ వైజ్ఞానికుల దృష్టిని ఆకట్టుకున్నాడు. అందుకు కొన్ని కారణాలున్నాయి.

పరమాణువంతటి వస్తువు పెద్ద శబ్దం చేస్తూ విచ్ఛిన్నమవడంవల్ల ఈ నక్షత్రాలు, గేలక్సీలు, న్యుబులేల వంటివి ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల నమ్మకం. కానీ, అందుకు వ్యతిరేకంగా నార్లేకర్ స్టెడీ స్టేట్ థియరీ ని ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం పదార్థం నక్షత్రాలుగా, గెలాక్సీలుగా,



ఇతర ఆకారాలుగా విశ్వమంతా సమానంగా వ్యాపించి ఉంది. ఒకవేళ గెలక్సీల కదలికవల్ల, తీవ్రమైన వేగంవల్ల ఎక్కడైనా ఖాళీలు ఏర్పడితే వాటిని కొత్తగా ఏర్పడ్డ పదార్థం పూరిస్తూ ఉంటుంది. 'స్టెడీ స్టేట్ థియరీ'తో పాటు, తన పరిశోధక గురువు ఫ్రెడ్ హాయిలీతో పనిచేస్తున్నప్పుడు నార్లేకర్, గురుత్వాకర్షణపై కూడా కృషి చేశాడు. చిన్న వయసులోనే తన అసమాన ప్రజ్ఞ ప్రదర్శించి, వైజ్ఞానిక ప్రపంచాన్ని అబ్బురపరిచి, తన స్థానం సుస్థిర పరుచుకున్నాడు. ఇక భారతదేశానికి తిరిగి వచ్చి, ఇక్కడి టాటా ఇన్‌స్టిట్యూట్‌లో తన విద్యార్థులతో అనేక పరిశోధనలు చేయించాడు. బ్లాక్ హోల్స్ కంటే, వెలుతురు కణాల కంటె వేగంగా ప్రయాణించగల టఖియాన్స్ మీద జరిపించిన పరిశోధనలు విలువైనవి. ఒక చెంచా వెడల్పుగల బ్లాక్ హోల్ బరువు కొన్ని టన్నులుంటుంది. దాని ఉపరితలం నుంచి కనీసం వెలుగు రేఖల్ని కూడా అది పోనీయదు. నార్లేకర్ ప్రతిపాదించిన దాన్ని బట్టి బ్లాక్ హోల్ టఖియాన్స్‌ని తనలో ఇముడ్చుకుని (పీల్చుకుని) తన ఉపరితల వైశాల్యాన్ని తగ్గించుకోగలుగుతుంది. అందువల్ల టఖియాన్స్‌ని వెతకడం అంటే తగ్గిపోతున్న బ్లాక్ హోల్స్‌ని వెతకడమే!

జయంత్ నార్లేకర్ నిర్వహించిన ఉన్నత పదవులు, స్వీరించిన అత్యున్నత పురస్కారాలు ఎన్నో ఉన్నాయి. 1981లో వరల్డ్ కల్చరల్ కౌన్సిల్‌కు ఈయనే సంస్థాపక సభ్యుడు. 1988లో పూణేలోని ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమి అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ కు తొలి డైరెక్టరయ్యాడు. ఆ కాలంలోనే అంతర్జాతీయ ఆస్ట్రానమికల్ యూనియన్‌కు అధ్యక్షుడయ్యాడు. బోధన, పరిశోధనలకు మాత్రమే కాకుండా, ఈయనకు రచనలో కూడా ప్రవేశముంది గనుక, భారతప్రభుత్వం నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సిఇఆర్‌టి) కి చైర్మన్‌గా నియమించింది. ఆ కాలంలోనే నార్లేకర్ వాస్తు శాస్త్రం, జ్యోతిష్యాలను తీవ్రంగా దుయ్యబట్టారు. నిరూపణ లేని వాటిని శాస్త్రం – సైన్సు అని అనగూడదనీ, అలాంటివన్నీ – "సూడో సైన్స్" అని ప్రకటించాడు. భారతప్రభుత్వం నుండి 1965లో పద్మభూషణ్, 2004లో పద్మవిభూషణ్ వంటి పౌర సన్మానాలు స్వీకరించాడు. ఆయన చేసిన సరళ విజ్ఞాన శాస్త్ర ప్రచారాన్ని గుర్తించి యునెస్కో 1996లో కళింగ ప్రైజ్ ప్రకటించింది. ఇంకా లెక్కలేనన్ని అంతర్జాతీయ మెడల్స్, బహుమతులు స్వీకరించాడు. ఆ లిస్టు చాలా పెద్దది.

వైజ్ఞానిక పరిశోధనా రంగంలోనే కాకుండా జయంత్ నార్లేకర్ సాహిత్యరంగంలో కూడా విశేషమైన కృషి చేశాడు. మరాఠీ భాషలో తొమ్మిది; ఇంగ్లీషులో మూడు; హిందీలో ఒకటి – ఇలా పలు సృజనాత్మ క రచనలు ప్రకటించాడు. అందులో 'చార్ నగరాంతలే మాజే విశ్వ' – అని, ఆయన మరాఠీలో రాసుకున్న ఆత్మకథకు 2014లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. 2021 నాసిక్‌లో జరిగిన 94వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించాడు. పాపులర్ సైన్స్ రచయితగా నార్లేకర్ రాసిన పుస్తకాలలో ఒకటి తెలుగులో కూడా "ఆలోకం" పేరుతో అనువదించబడింది. ఈయన 'యూనివర్స్' అనే టి.వి. సీరియల్‌ను 1995లో దూరదర్శన్ ప్రసారం చేసింది. ఆ సంవత్సరమే ఇందిరా గాంధీ సైన్స్ పాపులరైజేషన్ అవార్డు స్వీకరించాడు. మరీ ముఖ్యంగా 1986–90 మధ్యకాలంలో నాలుగేళ్లపాటు భారత ప్రధానికి సైన్సు సలహాదారుగా ఉన్నాడు.

జయంత్ నార్లేకర్ భార్య మంగళ నార్లేకర్ కూడా గణితశాస్త్ర పరిశోధకురాలే. ఆమె కూడా ప్రొఫెసర్‌గా పనిచేసింది. ఈ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వారంతా ఉన్నత విద్యావంతులు. పెద్దమ్మాయి గీత కాలిఫోర్నియా యూనివర్శిటీలో బయో మెడికల్ రీసెర్చ్ చేసింది. తరువాత వాళ్ళు – గిరిజ, లీలావతి కంప్యూటర్ సైన్స్ రంగాన్ని ఎంచుకున్నారు. భార్య మంగళ – జయంత్ నార్లేకర్ కన్నా రెండేళ్ళ ముందే చనిపోయింది. ఇక జయంత్ నార్లేకర్ ఎనభై ఆరేళ్ళ వయసులో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ, 2025, మే 20న మహారాష్ట్ర – పూణేలో స్వంత ఇంట్లో నిద్రలోనే ప్రశాంతంగా కన్నుమూశారు. ఎన్ని గౌరవాలు లభించినా, ఆయన తన కృషిని చివరి క్షణం వరకు ఆపలేదు.

నిత్య శోధకుడిలా, నూతన విద్యార్థిలా, కొత్త కొత్త పథకాలతో కొత్త దిశలు వెతుకుతూనే వచ్చాడు. మృదుభాషి, వినయ సంపన్నుడు, స్నేహశీలి అయిన జయంత్ నార్లేకర్ వ్యక్తిత్వం, వైజ్ఞానిక – సాహిత్య కృషి నేటి యువతరానికి ఆదర్శప్రాయం కావాలి!

శాస్త్రవేత్తల పరిశోధనలన్నీ, పరిశోధనల ఫలితాలన్నీ సమాజానికి లభిస్తున్నందువల్లనే – సమాజం త్వరితగతిన ప్రగతి పథాన పయనిస్తోంది. అలాంటప్పుడు వారిని ఆయా రంగాలకు మాత్రమే పరిమితం చేయకుండా, తెరవెనుక ఉండి కృషి చేస్తున్న 'సంఘ సంస్కర్తలు'గా గుర్తుంచుకోవాలి. వివేకవంతమైన సమాజం ఎప్పుడూ సమాజ నిర్మాణంలో భాగస్వాములయ్యే వారిని–అందరినీ గుర్తించుకుంటూ ఉండాలి!గౌరవించుకుంటూ ఉండాలి!! అప్పుడే అది ఆరోగ్యకరమైన సమాజం అవుతుంది.

*(19 జులై జయంత్ విష్ణు నార్లేకర్ జయంతి )*

# మహిళల రాజకీయ ప్రాతినిధ్యం.. నెరవేరని వాగ్దానం

భారత స్వాతంత్ర్యోద్యమం నుంచి మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నప్పటికీ, శాసనసభలు, పార్లమెంట్ వంటి నిర్ణయాత్మక వేదికల్లో వారి ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం సుమారు 14 శాతం మాత్రమే కాగా, రాష్ట్ర శాసనసభల్లో అది సగటున 9 శాతానికి పరిమితమైంది. రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపికలో మహిళలకు సమాన అవకాశాలు లభించకపోవడం దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చాలనే లక్ష్యంతో దాదాపు ఐదు దశాబ్దాలుగా మహిళా సంఘాలు, మహిళా నాయకులు శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. 2023లో పార్లమెంట్ 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను ఆమోదించి లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలని నిర్ణయించినప్పటికీ, జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయ్యాకే అది అమల్లోకి వస్తుందని నిబంధన విధించడంతో ఈ చట్టం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.

**పునర్విభజన రాజకీయాలు..**

కేంద్ర ప్రభుత్వం 2026లో మహిళల రిజర్వేషన్ అమలును వేగవంతం చేస్తామని ప్రకటిస్తూ మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. వాటిలో రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఉన్నాయి. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచాలని భావించారు. అయితే ఈ విస్తరణకు స్పష్టమైన రాజ్యాంగ హామీలు లేకపోవడం, రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గదనే హామీని చట్టంలో పొందుపరచకపోవడం, అలాగే ఎన్నికల సమయంలోనే ఈ బిల్లులను ప్రవేశపెట్టడం తీవ్ర విమర్శలకు దారితీసింది.


చివరకు రాజ్యాంగ సవరణ బిల్లు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోవడంతో విఫలమైంది. దాంతో మిగిలిన బిల్లులను కూడా ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, మహిళల రిజర్వేషన్ అసలు లక్ష్యం కాకుండా నియోజకవర్గాల పునర్విభజనకు రాజకీయంగా మార్గం సుగమం చేయడమే ఈ ప్రయత్నం వెనుక ప్రధాన ఉద్దేశం. మహిళల రిజర్వేషన్‌ను లోక్‌సభ విస్తరణకు ముడిపెట్టాల్సిన రాజ్యాంగపరమైన అవసరం లేదని వారు వాదిస్తున్నారు.

**నియోజకవర్గాల పునర్విభజనపై సమాఖ్య ఆందోళనలు**

నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తుతం అత్యంత వివాదాస్పద అంశంగా మారింది. రాజ్యాంగం ప్రకారం జనాభా ఆధారంగా రాష్ట్రాలకు లోక్‌సభ స్థానాలు కేటాయించాలి. అయితే కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు ప్రాతినిధ్యం కోల్పోకుండా ఉండేందుకు 1971 జనాభా లెక్కల ఆధారంగా స్థానాల పంపిణీని 2026 వరకు నిలిపివేశారు. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చి తాజా జనాభా ఆధారంగా స్థానాలను పునర్విభజిస్తే, జనాభా వేగంగా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. ఫలితంగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రభావం తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా నియోజకవర్గాల సరిహద్దుల నిర్ణయంలో పారదర్శకత లేకపోతే రాజకీయ ప్రయోజనాల కోసం సరిహద్దులను మార్చే 'జెరిమాండరింగ్' ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నా రు.

**ప్రజాస్వామ్య సమతుల్యతకు సవాళ్లు**

మహిళల రిజర్వేషన్ భారత ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన సంస్కరణ అనే విషయంలో పెద్దగా విభేదాలు లేవు. అయితే దానిని లోక్‌సభ విస్తరణ, నియోజకవర్గాల పునర్విభజన వంటి విస్తృత రాజ్యాంగ మార్పులతో ముడిపెట్టడం కొత్త రాజకీయ వివాదాలకు దారితీస్తోంది. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరగడం వల్ల హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాల రాజకీయ బలం మరింత పెరిగి, జాతీయ రాజకీయ సమీకరణాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ పరిణామం భవిష్యత్తులో అధికార పార్టీకి దీర్ఘకాలిక ఎన్నికల ఆధిక్యాన్ని కల్పించే విధంగా రాజకీయ వ్యవస్థను పునర్నిర్మించవచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. అందువల్ల మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడం ఎంత అవసరమో, అదే సమయంలో సమాఖ్య వ్యవస్థ, ప్రాంతీయ సమతుల్యత, సమాన ప్రాతినిధ్యం వంటి రాజ్యాంగ సూత్రాలను కాపాడటం కూడా అంతే కీలకం. మహిళల రిజర్వేషన్‌ను మరింత ఆలస్యం చేయకుండా అమలు చేయడం ప్రజాస్వామ్య అవసరం. అయితే దానిని ఇతర వివాదాస్పద రాజ్యాంగ మార్పులతో అనవసరంగా అనుసంధానించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


టిఎంసి రెబల్స్‌కు ప్రత్యేక సీట్లు

పార్లమెంటులో 'తుఫాన్'కు అధికార, ప్రతిపక్షాలు సిద్ధం

విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలి 07


సంపుటి 09, సంచిక: 229 | ఆదివారం | 19-07-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# పోడు భూములపై నిర్బంధాలు ఆపాలి

## గిరిజన హక్కుల రక్షణకు పోరాడుదాం

- ఉపాధిహామీ పథకాన్ని రక్షించుకుందాం : సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా
- అణచివేతలపై ఉద్యమించక తప్పదు : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- ఘనంగా ప్రారంభమైన గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు
- కదం తొక్కిన గిరిజనం, భారీ ప్రదర్శన, హోరెత్తిన నినాదాలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ

గిరిజనుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇన్‌చార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా పిలుపునిచ్చారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య(టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలు ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ నుండి దమ్మపేట, అంబేద్కర్ సెంటర్ల మీదుగా భారీ ప్రదర్శన పాత ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గల అమర జీవి సిద్ధి వెంకటేశ్వర్లు స్మారక స్థూపం వరకు సాగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషాతో కలిసి ఆమె సిద్ధి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన రహదారిపై సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. అడుగడుగునా చేసిన నినాదాలతో పాల్వంచ మార్మోగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో అనీ రాజా మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. పోడు సాగుదారులపై జరుగుతున్న నిర్బంధాలను అణిచివేతలను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. అడవులను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. సహజ వనరులపై ఆదివాసీలకు ఉన్న తరువాయి 8లో

# బలవంతంగా ఆసుపత్రికి సోనమ్ తరలింపు

## జంతర్‌మంతర్ వద్ద కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తం

- పోలీసులు నాపై దాడి చేశారని అభిజీత్ దీప్కే ఆరోపణ
- నిరాహార దీక్ష ప్రారంభించిన సిజెపి వ్యవస్థాపకుడు
- సిరాతో మహిళ దాడి
- సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌కు చికిత్స
- పోలీసుల దురుసు ప్రవర్తనపై భగ్గుమన్న ప్రతిపక్ష నేతలు
- ముంబయిలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతల ఆందోళన, అరెస్టు




**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 21 రోజులుగా చేస్తున్న నిరవధిక నిరాహారదీక్షను శనివారం పోలీసులు అడ్డుకుని బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, వైద్యుల సలహా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు వాంగ్‌చుక్‌ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. వాంగ్‌చుక్‌ను తరలించే క్రమంలో జంతర్ మంతర్ వద్ద హైడ్రామా నెలకొంది. కొంతమంది నిరసనకారులు అడ్డుపడటానికి ప్రయత్నించడంతో స్వల్ప గందరగోళం నెలకొంది. నిరసనకారులు తమ ఆందోళనను విరమించుకోవాలని, నిరసన స్థలాన్ని వీలైనంత త్వరగా శాంతియుతంగా ఖాళీ చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. కొద్దిసేపటికే, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం నాడు నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. తమ ఉద్యమం ఆగదన్నారు. నిరవధిక తరువాయి 8లో




వాంగ్‌చుక్ తరలింపునకు నిరసనగా ముంబాయిలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతల ఆందోళన, అరెస్ట్


### వాంగ్‌చుక్ తరలింపుపై అనుమానాలు : సిపిఐ

శాంతియుత నిరాహార దీక్ష చేస్తున్న ప్రదేశం నుండి సోనమ్ వాంగ్‌చుక్‌ను తరలించడం అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో సంప్రదింపులు జరిపి, వారి న్యాయమైన డిమాండ్లకు స్పందించడానికి బదులుగా, ప్రభుత్వం మరోసారి బలప్రయోగ, నిర్బంధ మార్గాన్ని ఎంచుకుందని మండిపడ్డారు. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుల వెనుక ఢిల్లీ పోలీసులు దాక్కోలేరని, సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని కోర్టు ఆదేశించిందన్నారు. అతని ఇష్టానికి వ్యతిరేకంగా నిరసన తరువాయి 8లో

ఇస్రో వేదిక నుండి భారత తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం

# విక్రమ్–1 విజయవంతం

- దేశ అంతరిక్ష యాత్రలో కీలకఘట్టం : మోదీ
- హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ నిర్వాహకులకు ప్రశంసలు



**శ్రీహరికోట :** ప్రైవేటురంగంలో నూటికి నూరు శాతం పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందిన విక్రమ్–1 (టెస్ట్‌ఫ్లైట్–1) రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. 450 కి.మీ ఎత్తులోకి సమీక్ష భూకక్షలోకి దూసుకువెళ్ళిన ఈ సబ్–ఆర్బిటల్ రాకెట్(కృత్రిమ ఉపగ్రహం కాదు) విజయవంతంగా తన లక్ష్యమైన బాహ్య అంతరిక్షాన్ని చేరుకుంది. కేవలం 28 ఏళ్ళు వయసుగల హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే స్కైరూట్ ఏరోస్పేస్ నిర్వాహకులు పవన్‌కుమార్ చందన (వ్యవస్థాపకుడు), నాగ భరత్ డాకా(సహవ్యవస్థాపకుడు)ల నాయకత్వంలో ఈ ప్రైవేట్ రాకెట్ నిర్మించారు. ఈ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా వారిద్దరికీ ఫోన్‌చేసి తరువాయి 12లో

# ఏడాదిలో 70వేల ఉద్యోగాలు

- మేకతోలు కప్పుకున్న తోడేలులాగా నిస్సిగ్గుగా కెటిఆర్ ప్రేలాపనలు
- దోచుకునేందుకు కల్వకుంట్ల కుటుంబానికే ఉద్యోగాలు
- పదేళ్లలో ఉద్యోగాలివ్వకుండా పరీక్షా పత్రాలను అమ్ముకున్నారు
- గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపాటు
- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఘట్‌కేసర్

పదేళ్ల కాలంలో ఒక్క ఉద్యోగమైనా ఇవ్వకుండా పరీక్షా పత్రాలను పల్లీలు, బఠాణీల్లా అమ్మి కోట్లాది రూపాయలు వెనుకేసుకున్న బిఆర్ఎస్ పాలకులు నిరుద్యోగులను నిలువునా వంచించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కెటిఆర్ మాత్రం కెసిఆర్ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నియామకాలు చేస్తోందంటూ మేకతోలు కప్పుకున్న తోడేలులాగా నిస్సిగ్గుగా ప్రేలాపనలు చేస్తున్నారన్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలను కెసిఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో నిర్లక్ష్యంతో వదిలేయగా, 16 ఏళ్ల తర్వాత తమ ప్రభుత్వం 2026లో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించిందన్నారు. అధికారం చేపట్టిన తరువాయి 8లో

# నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల్లోంచి తప్పుకుంటా

- పోలీసు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటారా?'
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు మండిపాటు
- సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు



ప్రజాపక్షం/రంగారెడ్డి

'70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. రాహుల్‌గాంధీకి జై కొడతా. నోటిఫికేషన్లతో సహా నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. పోలీసు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటారా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విరుచుకుపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగ యువత సమస్యలు, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను ప్రధాన అజెండాగా తీసుకొని బిఆర్ఎస్ పార్టీ శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహించింది. సదస్సుకు శాసనసభ పక్ష ఉపనేత పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో కలిసి కెటిఆర్ ముఖ్యఅతిథిగా తరువాయి 8లో

## కల్తీల నిరోధానికి కఠిన చట్టం

సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి : సిఎం రేవంత్‌రెడ్డి

10

మహిళా సాధికారతే తెలంగాణ

## అభివృద్ధికి బలమైన పునాది

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్‌కు స్థలాల కేటాయింపు

# తెలుగులో ఉత్తమ చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'

- జాతీయ ఉత్తమ చిత్రం 'ఆర్టికల్ 370'
- ఉత్తమ నటులు మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్
- ఉత్తమ నటి యామి గౌతమి
- 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన







**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను శనివారం ప్రకటించింది. ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ జాతీయ చలనచిత్ర అవార్డుల విజేతల జాబితాను జ్యూరీ విడుదల చేసింది. 2024 డిసెంబర్ దాకా సెన్సార్ అయిన సినిమాలను ఈ అవార్డులకు పరిశీలించారు. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 ఎంపిక కాగా, తెలుగులో ఉత్తమ చిత్రంగా కొణిదెల నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రాళ్లు' ఎంపికైంది. అలాగే ఉత్తమ నటుడి అవార్డును మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి (భ్రమయుగం), కార్తిక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) సంయుక్తంగా దక్కించుకున్నారు. ఉత్తమ నటి అవార్డు యామి గౌతమి (ఆర్టికల్ 370)కి లభించింది. నిజానికి ఈనెల మొదటి వారంలోనే అవార్డులను ప్రకటించాల్సి ఉండింది. కానీ, జ్యూరీ సభ్యుల షెడ్యూల్ కారణంగా ఎంపిక ఆలస్యమైంది. భారత సినిమా రంగంలో ఈ అవార్డును అత్యున్నత పురస్కారంగా భావిస్తారు. ఇందులో ఫీచర్, నాన్ ఫీచర్ సినిమాల్లో నటన, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, సంగీతం, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ ఇతర టెక్నికల్ తరువాయి 8లో


# రాష్ట్రంలో ఎల్‌నినోపై అధ్యయనం

- డాక్టర్ జి. చిన్నారెడ్డి చైర్మన్‌గా 27 మంది సభ్యులతో నిపుణుల కమిటీ ఏర్పాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయం, అనుబంధ రంగాలపై చూపే ప్రభావాన్ని అధ్యయనం చేసి నివారణ చర్యలు సూచించేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఉన్నత స్థాయి వివిధ విభాగాల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు (ఆర్‌టిఈ నెం.427) శనివారం జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డిని కమిటీ చైర్మన్‌గా నియమించగా, తరువాయి 12లో

## నేడు కరీంనగర్‌లో మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘీక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు నేడు జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో నెలకొని ఉన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌పై ఎల్ నినో ప్రభావం, సాగు, తాగునీటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై కరీంనగర్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, సిరిసిల్లా, జగిత్యాల జిల్లాల అధికారులతో కరీంగనర్ జిల్లా కేంద్రంలో ఉదయం పదిన్నర గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతోపాటు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

## మృతదేహంతో పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన



**ప్రజాపక్షం / రామడుగు :** గత మూడు రోజుల క్రితం షానగర్ కోరుటపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ నెల్లి తిరుపతి (35) శనివారం మృతి చెందారు. దీంతో తిరుపతి కుటుంబ సభ్యులు పోస్టుమార్టం అనంతరం ప్రమాదానికి కారణమైన సర్పంచ్ భర్త మేకల ప్రభాకర్ యాదవ్ బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించేవరకు మృతదేహాన్ని తీసేది లేదంటూ పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. దీంతో స్థానిక పోలీసులు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు స్థానిక పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఆందోళన విరపింపచేశారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూ రీసర్వే

**ప్రజాపక్షం /పెగడపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి భూ రీసర్వే కార్యక్రమం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జగిత్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ బి.ఎస్. లత తెలిపారు.మండలంలోని నరసింహునిపేట గ్రామంలో శనివారం నిర్వహించిన భూభారతి భూ రీసర్వే గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం నరసింహునిపేట గ్రామాన్ని ఈ రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని వెల్లడించారు. ఈ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, భూముల హద్దులు స్పష్టంగా నమోదై వివాదాలు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు.

**రైతుల సమక్షంలోనే సర్వే :** రెవెన్యూ అధికారులు భూముల కొలతలు నిర్వహించే సమయంలో సంబంధిత రైతులతో పాటు పొరుగు భూముల యజమానులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నిజామొద్దీన్,ఎంపిడిఓ ప్రేమ్ సాగర్, ఎఎంసి చైర్మన్ బుర్ర రాములు గౌడ్,ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, జిపిఒ పద్మ,గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సంధి మల్లారెడ్డి,స్థానిక రైతులు,ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## విద్యుత్ రంగ పైవేటీకరణకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జెఎసి పిలుపునిచ్చింది.యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు చేపట్టిన న్యాయమైన ఆందోళనకు మద్దతుగా శనివారం విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జెఎసిమెట్‌పల్లి కార్యవర్గం విడుదల చేసిన ప్రకటనలో,ఇది ఉద్యోగుల భద్రతతో పాటు ప్రభుత్వ రంగ పరిరక్షణకు సంబంధించిన పోరాటమని పేర్కొంది. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ప్రతి ఉద్యోగి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిల్లుపునిచ్చింది.ప్రైవేటీకరణ వద్దు – ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో శాంతియుతంగా నిరసన తెలియజేయాలని జగిత్యాల జిల్లా విద్యుత్ జెఎసిచైర్మన్ ఎండి.అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జెఎసి చైర్మన్ మునుగురి లక్ష్మణ్,కార్యదర్శి జరుపుల హరిప్రసాద్,జెఎసి నాయకులు లక్కంపెల్లి సురేశ్, సామల్ల రవి,పిపోజి రవి, కొత్తూరి శంకర్, కరీం,రంజిత్,లక్ష్మి ,రమేష్,అరవింద,జిందం ప్రసాద్ పేర్కొన్నారు.విద్యుత్ రంగాన్ని పరిరక్షించేందుకు ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని జెఎసి నాయకులు పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు,సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హోటళ్లు, రెస్టారెంట్లు శుభ్రతను పాటించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** హోటల్లు, రెస్టారెంట్ల యజమానులు శుభ్రత పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి అంగిత రెడ్డి అన్నారు. శనివారం రోజున గోదావరిఖని పట్టణ పరిధిలోని పలు రెస్టారెంట్లు ,ఆహార తయారీ యూనిట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గోదావరిఖని రాజీవ్ నగర్‌లో ఉన్న ఒక ఆహార తయారీ యూనిట్‌ను తనిఖీ చేయగా సదరు యూనిట్‌లో ఆలుగడ్డ చిప్స్,ఇతర స్నాక్స్ పదార్థాల తయారీ జరుగుతున్నట్లు గుర్తించామని,తనిఖీ సందర్భంగా చిప్స్ తయారీకి ఉపయోగిస్తున్న వంటనూనెను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించామని,వంటనూనె నాణ్యతను అక్కడికక్కడే ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన టెస్టింగ్ మీటర్ ద్వారా పరీక్షించగా, దాని రీడింగ్ నిర్దేశిత ప్రమాణాలను మించినట్లు తేలిందనీ,దీంతో సుమారు 25 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడంతో పాటు,ఆ నూనెతో తయారు చేస్తున్న చిప్స్‌ను కూడా అక్కడికక్కడే ధ్వంసం చేశామని,వాడిన వంటనూనెను ఎటువంటి అనధికార సంస్థలు లేదా వ్యక్తులకు విక్రయించరాదని యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందనీ,ఈ తనిఖీల సందర్భంగా సంబంధిత ఆహార నమూనాలను సేకరించి,తదుపరి విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించడం జరిగిందనీ,ప్రయోగశాల నివేదికల ఆధారంగా అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు.

# విద్యాభివృద్ధికి తెలంగాణ సర్కార్ పెద్దపీట

### రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా..ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ అద్భుతమైన ఫలితాలు సాధిస్తూన్నారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల క్రమశిక్షణ, నిబద్ధత ఏంతో ఆకట్టుకున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిలా పరిషత్ హైస్కూల్‌లో 40 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్, మీటింగ్ హాల్, కిచెన్ షెడ్లను రాష్ట్ర కార్మిక,ఉపాధికల్పన శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్‌వెంకటస్వామి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిఒక్కరు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, గొప్ప లక్ష్య సాధనకు కష్టపడి కృషిచేయాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ ఈ మూడు కలిపినప్పుడే ఏ లక్ష్యమైన సాధించవచ్చునన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మంది ఉపాధ్యాయులను నియమించిందన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం గణనీయంగా పెరిగిందన్నారు. ఇప్పుడు అల్పాహార పథకం అమలుతో మరింతమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నార. యంగ్ ఇండియా పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేస్తుందన్నారు. అలాగే ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థులందరు ఈ అవకాశాలవను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపోదించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, జిల్లా ఇంచార్జి డిఈఓ, సిఈఓ రమేశ్, సర్పంచ్ భానుచందర్, డైనింగ్ హాల్ దాత సుధాకర్ ఇతర ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కిచెన్ షెడ్ నిర్మాణానికి దాత దొంతుల సుధాకర్ కుటుంబ సభ్యులను మంత్రి అభినందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరి కృష్ణ, మార్కెట్ కమిటి చైర్మన్ మీసం మహేందర్, ఆత్మ కమిటి చైర్మన్ గోపికృష్ణ, గంప మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

### ఆగష్టు 2న హైదరాబాద్‌లో భారీ ధర్నాకు పిలుపు..




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దుచేయాలని పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా చార్జీలను పెంచాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేటలో ఆందోళనకు దిగారు.గత ముప్పది సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనకార్మికులు పని చేస్తున్నామని ప్రభుత్వం చాలీచాలని జీతాలు ప్రభుత్వాలు మూడువేలతో సరిపెడుతున్నాయని పాతబస్టాండ్ నుండి ఎంఇఒ కార్యాలయం వద్దకు నడుచుకుంటు నినాదాలు చేసుకుంటూ ఎంఇఒకార్యాలయం వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నభోజన కార్మికులకు కోడిగుడ్లు,గ్యాస్,నిత్యావసర సరుకులతో పాటుగా పదివేల వేతనం అందించాలని ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి కార్యాలయాన్ని వీర్నపల్లి,గంభీరావుపేట,ఎల్లారెడ్డిపేట కార్మికులు అధికారుల కార్యాలయన్ని ముట్టడించారు.శనివారం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు.రాజన్నసిరిసిల్లా (ఎఐటియుసి) మిడ్‌డేమిల్స్ కార్యదర్శి మీసం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.కార్మిక సమస్యలను,గోడును చెప్పుకున్నారు..తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని మీసంలక్ష్మణ్ హెచ్చరించారు.అంగన్వాడిలతో సమానంగా పదివేల రూపాయల వేతనం అందించే విధంగా కృషిచేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకున్నారు.ఇకనైనా శ్రామికుల కష్టాన్ని గుర్తించాలని కోరారు.మరోమారు కార్మిక శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళతామని మిడ్‌డే మిల్స్ కార్మికులు అన్నారు.ఇటీవల తంగళ్ళపల్లి మండలంలోని మండెపల్లి గ్రామంలో ఉపాధ్యాయురాలును సస్పెన్షన్‌కు గురి చేశారని మండిపడ్డారు.అధిక ధరల వలన కోడిగుడ్డు వారానికి ఎప్పుడైన ఒకసారి పెట్టినందుకు ఉపాధ్యాయురాలిని తొలగించడం చేయడం సరికాదని వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకురావాలని అన్నారు.అది ప్రభుత్వ తప్పిదమేనని కరాఖండిగా చెప్పారు. అనంతరంవిద్యాధికారి జి.కృష్ణహరి వినతిపత్రాన్నితీసుకుని మిడ్‌డే కార్మికుల సమస్యను డిఇఒ,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.గోధావరి,లింబవ్వ,గంగవ్వ,లక్ష్మి దేవవ్వ,స్వరూప,లత,ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం

### అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లావ్యాప్తంగా నిర్మాణ పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడం, రెండో దశలో ఇండ్ల మంజూరుపై గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని మండలాలకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, వివిధ దశల్లో ప్రగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు వేగవంతం చేసేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా నిర్మాణాల్లో జాప్యం జరిగితే వాటి కారణాలు తెలుసుకుని, సమస్యలు పరిష్కరించి, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రగతిలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయాలని ఆదేశించారు. రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. రెండో దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీల పాల్గొన్నారు.

## నీట్ ఫలితాలలో కరీంనగర్ 'ట్రినిటీ'విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/కరీంనగర్:** నీట్ 2026 ఫలితాలలో కరీంనగర్ ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఘన విజయం సాధించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కులు వారి కఠోర శ్రమకు, క్రమశిక్షణకు నిదర్శనం. ఈ ఏడాది అత్యుత్తమ మార్కులతో ముందంజలో నిలిచిన విద్యారులు డి.అశ్విత–534మార్కులు, జె.శ్రీవైత్రి–512 మార్కులు, జె. అశ్విని'–491 మార్కులు. హనీఫా 486 మార్కులు, విష్ణువర్ధన్–480మార్కులు, ఎన్.కీర్తన–472 మార్కులు, ఎమ్.అక్షయ–460మార్కులు, ఫరీహా తెహరీమ్ –460 మార్కులు, ఎ. కావ్య 456 మార్కులు, ఎమ్. అజయ్–453 మార్కులు, యు. శ్రీనిధి 445 మార్కులు, పి. కీర్తన 445 మార్కులు, షైనీ 443 మార్కులు, డి. జ్యోస్న 441 మార్కులు, వీరితో పాటు షిఫా మహవీన్ (439), ఎన్. సాత్విక (434), వి. హర్షిత (433), ఎస్. నివేదిత (432), కె. అంజలి (426), జె. సౌమ్య (424), జి. అనుశ్రీ (424), ఎస్. అలేఖ్య (422), కే. వెన్నెల –420 మార్కులు, ఇ. అక్షయ (413), ఎ. శ్రుతి (409), ఎన్. దేవిక కృష్ణ (407), Ch.వంశీ (405), ఆర్. సాయికిరణ్ (401) అత్యుత్తమ మార్కులు సా ధించి ఈ పరీక్షలో విజయం సాధించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది నీట్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. 534 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిన డి. అశ్వితతో పాటు, 400 కంటే ఎక్కువ మార్కులు సాధించి సంస్థ కీర్తిని దశదిశలా చాటిన విద్యార్థులందరినీ చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. కఠోర శ్రమ, క్రమశిక్షణే మిమ్మల్ని ఈ స్థాయికి చేర్చాయని, భవిష్యత్తులో మీరు ల్యాప్రోస్కోపిక్ సర్జన్లుగా, పరిశోధకులుగా లేదా ఉత్తమ వైద్యులుగా సమాజానికి అమూల్యమైన సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని అన్నారు. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షలో ఘన విజయం సాధించిన విద్యార్థులందరికీ, అలాగే వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు ఎంతో సంతోషకరమైన రోజు అని, నీట్ 2026 ఫలితాల్లో ట్రినిటి విద్యార్థులు సాధించిన ర్యాంకులు వారి పట్టుదలకు నిదర్శనమన్నారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి, లక్ష్యం వైపు అడుగులు వేసిన మీ అందరిలో ఒక గొప్ప వైద్యుడిని నేను చూస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అన్ని క్యాంపస్‌ల ప్రిన్సిపాల్‌లు మరియు అధ్యాపక బృందం హాజరయ్యారు.

## విబిఎస్ఏ బిల్లును వ్యతిరేకించండి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఈనెల 20 నుండి జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం విద్యారంగ విధానానికి వ్యతిరేకంగా, సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్రాల హక్కులను కాలరాసే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్‌బిల్లు(2025)ను కరీంనగర్ ఎంపికేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పార్లమెంట్లో వ్యతిరేకించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎఐఎస్ఎఫ్ పక్షాన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బహిరంగ లేఖను మెయిల్ ద్వారా పంపించినట్లు మణికంఠరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు 2025ను ఎఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ బిల్లు రాజ్యాంగ పరిమితులను ఉల్లంఘిస్తూ, కేంద్ర , రాష్ట్రాల మధ్య ఫెడరల్ (సమాఖ్య) విధానాన్ని బలహీనపరుస్తుందన్నారు. దేశంలో ఉన్నత విద్యారంగ నియంత్రణ సంస్థలైన యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యూజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) స్థానంలో ఒకే ఒక సర్వోన్నత సంస్థగా విబిఎస్‌ఏ (విబిఎస్ఎ) ను ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తు విద్య రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రగా ఈ బిల్లు ఉండబోతుందని అన్నారు. ఇప్పటికే ఈ బిల్లును విపక్ష పార్టీలతోపాటు, బిజెపి కూటమి పార్టీలు సైతం వ్యతిరేకించాయని, ప్రతిపాదిత బిల్లులోని అంశాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ పరిశీలించి, ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కోసం ఆ బిల్లును వ్యతిరేకించి పార్లమెంట్ లో చర్చించాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రతీ ఒక్క ఓటు ఉండేలా శ్రద్ధ వహించాలి


### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రాం సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కు మార్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజగోపాల్ రా వు ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు గ్రామాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై అవగాహన చేపట్టాలి. అర్హులైన ప్రతి కుటుంబం సర్వేలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.100శాతం పూర్తి అయ్యే విధంగా చూడాలి.నాన్ లోకల్ ఓటర్ లను వీక్ ఎండ్ సందర్భంగా త్వరగా నమోదు చేసుకొనే విధంగా కృషి చేయాలి.నిర్దేశిత గడువు ముందే పూర్తి చేయడానికి బిఎల్ఏ, బిఎల్ఓలు కార్యాచరణ చేపట్టాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎలమట్ల హరిష్,బొడ సాగర్, శ్రీలత, రాజ్ కుమార్ ,పాక్స్ చైర్మెన్ నవీన్ రావు,మండల అధ్యక్షుడు నారపాక రమేష్,మండల నాయకులు,గ్రామ పంచాయతీ వార్డు స భ్యులు మండల నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

### బీర్పూర్ మండలం లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బారి పర్యటన

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని కమ్మునూరు గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయానికి 10లక్షల నిధులతో ప్రారంభించనున్న సిసి రోడ్డు పనులకు జగిత్యాల శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేసాడు .ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భీమేష్,ఎమ్మార్వో సుజాత, పాక్స్ చైర్మెన్ నవీన్ రావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపాక సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాజగోపాల్ రావు రమేష్,సర్పంచ్ లు తోట శ్రీనివాస్,రంగు లక్ష్మణ్,,మాజీ సర్పంచ్ బండెల మరియ రాజేశం,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నరేందర్,రామకిష్టు గంగాధర్,సర్పంచులు చిక్రంమారుతి, సాగర్,సతీష్,నర్సయ్య,సుశీన్,హరీష్,శ్రలత రాజకుమార్,మండల గ్రామ నాయకులు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో యుపిఎస్‌సి, ఐఎఎస్ అవగాహన సదస్సు



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అమిగోస్ ఐఎఎస్ అకాడమీ సహకారంతో విద్యార్థినీలకు యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్‌ఐఎఎస్ తదితర అఖిల భారతీయ సర్వీసులపై అవగాహన సదస్సు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి వ్యవహరించగా ముఖ్య అతిథిగా అమిగోస్ అకాడమిక్ డైరెక్టర్ మధుసూదన్, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి జిహెచ్‌పి రాజు, అతిథి అమిగోస్ అకాడమీ ట్రైనర్ వినీల్ రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందిస్తే వారు కూడా అత్యున్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు, క్యాట్, మ్యాట్, జిమ్యాట్ వంటి వివిధ రకాల పోటీ పరీక్షల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలతో పాటు ఈ సంవత్సరం నుంచి యుపిఎస్‌సి కోచింగ్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ అందిస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా తీర్చిదిద్దడమే ఆల్ఫోర్స్ లక్ష్యమని పేర్కొన్నారు. అమిగోస్ డైరెక్టర్ మాట్లాడుతూ వైఫల్యాలే విజయానికి మెట్లు అని ప్రతి అపజయం నుంచి పాఠాలు నేర్చుకొని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించాలనుకునే విద్యార్థులు డిగ్రీస్థాయి నుంచే బలమైన ఫౌండేషన్ ఏర్పరచుకొని ప్రణాళికబద్ధంగా సిద్ధమైతే విజయం సాధించవచ్చని తె లిపారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి మాట్లాడుతూ విద్యార్థినులకు సివిల్ సర్వీసెస్ పరీక్షా విధానం, సెలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, కరెంట్ అఫైర్స్, నెగటీవ్ మార్కింగ్ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సివిల్ సర్వీసెస్ ప్రయాణం సుదీర్ఘమైనదని అందుకు స్పష్టమైన భవిష్యత్ లక్ష్యం, తపన, స్వీయ క్రమశిక్షణ, శారీరక ధృఢత్వం, నిరంతర సాధన, స్థిరత్వం అత్యంత అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ పథకాల అమలులో అధికారుల ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎస్‌సి, ఎస్‌టివర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడిఓసి) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డిసిపిరాంరెడ్డి,అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు,జె. అరుణ శ్రీ లతో కలిసి జిల్లా అధికారులతో ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలపై సమీ క్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శా ఖల అధికారులు తమ శాఖల ద్వారా ఎస్‌సి, ఎస్‌టివర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు.అలాగే గురుకులాలు, సంక్షే మ, గిరిజన రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల పై సమీక్షించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టికమిషన్ సభ్యు లు,కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ,జిల్లా శంకర్,రేణికుంట ప్రవీణ్, ఆర్‌డిఒ లు,బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్, ఎసిపిరమేష్, వివిధశా ఖలజిల్లాఅధికారులు,పాల్గొన్నారు.

## 20న ప్రజావాణి రద్దు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కలికంగా రద్దు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కీలక అంశాలపై ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం ఉండటంతో ఈనెల 20న జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేశామన్నారు.27 నుండి తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

## 20న ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి జూపల్లి కీలక సమీక్ష



**ప్రజా పక్షం/నిర్మల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తలెత్తే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది.ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు, మద్యనిషేధం అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 20న ఉట్నూరులో ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు.ఈ నెల 20న ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉట్నూరులో జరిగే ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. వర్షాభావ పరిస్థితులు,ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలు, ముందస్తు చర్యలపై మంత్రి ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.ఈ కీలక సమావేశంలో ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసేందుకు వివిధ శాఖల సమన్వయం,అత్యవసర కార్యాచరణపై సమగ్రంగా చర్చించనున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన, మార్క్‌ఫెడ్, సాగునీటి శాఖల అధికారులు రైతులకు సంబంధించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై నివేదికలు సమర్పించనున్నారు.అలాగే తాగునీటి ఎద్దడి రాకుండా చూసేందుకు మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు తమ సన్నద్ధతను వివరించనున్నారు. వీటితో పాటు అటవీ,పౌర సరఫరాలు,వైద్య ఆరోగ్య, మహిళాశిశు సంక్షేమ శాఖల అధికారులు కూడా ఈ సమీక్షకు హాజరై, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కార్యాచరణను ఖరారు చేయనున్నారు.


## ప్రాణాల రక్షణే లక్ష్యం

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్:** పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అర్బన్ నియోజకవర్గంలోని అవసరమైన వారికి నిమ్స్‌లో చికిత్స పొందేందుకు ఎల్ఓసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని కార్యాలయంలో శనివారం ఎల్ఓసీ అందజేసి ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్ఓసీ ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని గాజులపేటకు చెందిన తోక శ్రావణ్‌కుమార్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్‌లో చికిత్స కోసం రూ.5లక్షల ఎల్ఓసి వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్‌కి వెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వెయ్యి కోట్లతో నిర్మించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. కావున నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు మల్కాయి మహేందర్, నాగోల్ల లక్ష్మీ నారాయణ, పసునూరి రాము, ప్రసూన శ్రీనివాస్ ఉన్నారు.

## 33 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** సిఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు.శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల 80 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే,పేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.అవసరమైన సమయంలో అర్హులైన బాధితులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ సోమ భీమ్ రెడ్డి,అబ్దుల్ హాది డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్,వైస్ చైర్మన్ శ్రీనివాస్,ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాథోడ్ సంతోష్,నరేష్ రెడ్డి,మొహిముద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

## భూ రికార్డుల ఖచ్చితత్వం కోసమే సమగ్ర సర్వే



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** భూ రికార్డుల ఖచ్చితత్వం కోసమే ప్రభుత్వం భూమి సమగ్ర సర్వే చేపడుతోందని తహసీల్దార్ మధుకర్ తెలిపారు. కాగజ్ నగర్ మండలంలోని మారపల్లి గ్రామంలో శనివారం భూమి సమగ్ర సర్వేపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సర్వే యొక్క ముఖ్య ఉద్దేశ్యం, ప్రయోజనాలను రైతులకు వివరించిన ఆయన, సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి రైతులందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు తమకున్న పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యతో..

# నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా





**ప్రజాపక్షం/ భైంసా నర్సాపూర్ జి :** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ నర్సాపూర్ (జి), భైంసా మండలాల్లో పర్యటించారు.నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, కల్పిస్తున్న వసతులు, విద్యా బోధన, మొత్తం విద్యార్థులు,ఉపాధ్యాయులు,సిబ్బంది సంఖ్య, నేటి హాజరు,తదితర విషయాలను ఆరా తీశారు.రిజిస్టర్లను తనిఖీ చేశారు.రిజిస్టర్లన్నింటిని పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. ప్రతి రోజు విద్యార్థులు,ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చూడాలన్నారు.విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల ప్రాంగణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని పరిశీలించారు.మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గడ్డెన్న వాగు ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించారు.ప్రాజెక్టు వివరాలు,ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు,తదితర వివరాలను అధికారులను అడిగారు. త్రాగు నీటి సరఫరా కు సంబంధించి అం శాలను సమీక్షించారు.భవిష్యత్ ప్రణాళికల ప్ర కారం నీటి నిర్వహణ ఉండాలని తెలిపారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు.సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఇఒ భోజన్న,డీఆర్డిఓ విజయలక్ష్మి,ఆర్డబ్ల్యుఎస్,నీటిపారుదల శాఖల ఇఇలు తహసిల్దార్‌లు శ్రీకాంత్,శశి భూషణ్, ఎంపి డిఒ ,ఎంపిఒ తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,ఉన్నారు.

## వరికి ప్రత్యామ్నాయం

# ఆయిల్ పామ్ సాగు

సంమృద్ధి లాభాలు : కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో రైతులు సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేస్తూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శంకరంపేట (ఆర్) మండలం సూరారం గ్రామంలో మూడు సంవత్సరాల వయస్సు గల ఆయిల్ పామ్ తోటను సందర్శించి తొలి కోతను ప్రారంభించారు.జిల్లాలో ఇప్పటివరకు 1,857 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగిందని, 202627 సంవత్సరానికి 2,500 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ పరికారాలు, తోట నిర్వహణకు రాయితీలు అందిస్తోందని చెప్పారు. ఆయిల్ పామ్ ద్వారా ఎకరానికి 1012 టన్నుల దిగుబడి లభించే అవకాశం ఉందని, ప్రస్తుతం టన్నుకు రూ. 23,852 ధర ఉండటంతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా కంపెనీలు నేరుగా కొనుగోలు చేయడం ఈ పంట ప్రత్యేకత అని తెలిపారు. రైతులు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు దృష్టి సారించి ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్, మండల వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

# 'ఎల్‌నినో' ప్రభావంపై రైతులకు సూచన


మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మెదక్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున్న రైతులు అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే మెట్ట (ఆరుతడి) పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల, పారిశ్రామిక, భూగర్భ వనరుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. శనివారం చేగుంట మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన ఎల్‌నినో అవగాహన సదస్సులో మంత్రి వివేక్ పాల్గొని మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పిస్తొందని, భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. రైతులు కోతుల బెడద, ఆరుతడి పంటలపై సబ్సిడీల వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.''వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంట లే ముద్దు'' అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ రైతులు మెట్ట పంటల సాగుకు ప్రధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. తూప్రాన్ ఆర్డీఓ బావయ్య డిడబ్ల్యుఓ హేమ భార్గవి, జిల్లా వ్యవసాయ అధికారి,ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/జైనూర్ :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేసి, పాత 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈనెల 26న ఆసిఫాబాద్‌లో జరిగే ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని, ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళలో రొమ్ము కేన్సర్ ప్రారంభ దశలోనే చికిత్స

కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జిల్లాలో మహిళల్లో రొమ్ము కేన్సర్ కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి అనుమానితులను సకాలంలో వైద్య పరీక్షలు చికిత్స కోసం రిఫర్ చేసే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎస్ఈఆర్‌పి శాఖ యునోట్రెస్ట్ పౌండేషన్ గ్రాన్యూల్స్ ఇండియా సంస్థల సమన్వయంతో రొమ్ము కేన్సర్ గుర్తింపు ముందస్తు నిర్ధారణ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసి వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

## బాసర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం

2,500 ఎకరాలకు సాగునీరు

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజా పక్షం/భైంసా :** బాసర మండలంలోని స్వల్ప వర్షాలతో సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న రైతులకు బాసర లిఫ్ట్ ఇరిగేషన్‌ను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు.లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బాసర పరిసర ప్రాంతాల్లో 2,500 ఎకరాలకు పైగా సాగుభూమికి నీరందుతుందని తెలిపారు.దీంతో రైతులు పంటల సాగును సకాలంలో చేపట్టే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాసర పాఠశాలలో అదనపు తరగతి గదుల తనిఖీ బాసర మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే, అదనపు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని,విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,మండల సీనియర్ నాయకులు,కార్యకర్తలు సంబంధిత అధికారులు,ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పరిరక్షణే ప్రధాన లక్ష్యం



**ప్రజా పక్షం/నిర్మల్ :** తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం అస్థిరంగా ఉండటం, భూగర్భ జలాల మట్టం క్రమంగా తగ్గిపోవడం, సాగు, తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జలశ్రీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, నీటి వినియోగంలో పొదుపు పాటించడం, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది. వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తెలంగాణ జలశ్రీ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు,పట్టణాల్లో వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి చేరేలా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు,ఆసుపత్రులు,ఇతర ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్లు నిర్మించడం,చెరువులు,కుంటలు, కాలువలను పునరుద్ధరించడం వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.వర్షపు నీటిని నిల్వ చేయడం కంటే భూగర్భంలోకి చేరేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రత్యేకతగా అధికారులు చెబుతున్నారు. వ్యవసాయంలో నీటి పొదుపుపై దృష్టి రాష్ట్రంలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.అలాగే బిందు సేద్యం,తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను విస్తృతంగా అమలు చేయడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, కుంటలను పరిశుభ్రంగా ఉంచడం, భూగర్భ జలాలను అవసరానికి మించి వినియోగించకుండా ఉండడం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చని అధికారులు సూచిస్తున్నారు.

## 'ఎల్‌నినో' ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికల రూపకల్పనకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల స్పెషల్ ఆఫీసర్లు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవల్సిన చర్యలపై దిశానిర్ధేశం చేశారు. ఈనెల 20 న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా సమావేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై చర్చించి ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో అవసరమైన చర్యలు తీసుకోవటానికి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఆర్ఓ గీత, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్ కుమార్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, అధికారులు పాల్గొన్నారు.

# క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

అండర్ ట్రయల్ ఖైదీల కేసులకు ప్రాధాన్యం, సమర్థంగా కోర్టు ప్రక్రియల అమలుపై సమీక్ష



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణహైకోర్టు మార్గదర్శకాల మేరకు క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారం, ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం,పోలీసు శాఖ–న్యాయస్థానాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం శనివారం నిర్మల్ జిల్లా ప్రధాన జిల్లా అండ్ సెషన్స్ కోర్టు ఆవరణలో నిర్వహించబడింది. జిల్లా & సెషన్స్ జడ్జి ఎస్. శ్రీవాణి,జిల్లా ఎస్పి డా. జి. జానకి షర్మిల,ఐపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెండింగ్ క్రిమినల్ కేసుల పురోగతి, అండర్ ట్రయల్ ఖైదీల కేసుల త్వరిత విచారణ, చార్జ్‌షీట్లను సకాలంలో దాఖలు చేయడం,సాక్షుల హాజరును నిర్ధారించడం, కోర్టు సమన్లు, వారెంట్లను వెంటనే అమలు చేయడం, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నేరస్థులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను సమర్పించడం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్,న్యాయస్థానాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, కోర్టు ఆదేశాల అమలులో ఎలాంటి జా ప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యత పెంపుపై ప్రత్యే క దృష్టి సారించి, నేరస్థులకు శిక్షలు పడేలా శాస్త్రీయ ఆధారాలతో కేసులను బలోపేతం చే యాలని అధికారులను ఆదేశించారు.జిల్లా అం డ్ సెషన్స్ జడ్జి ఎస్. శ్రీవాణి మాట్లాడుతూ, హై కోర్టు సూచనల మేరకు కోఆర్డినేషన్ కమిటీ సమావేశాల ద్వారా క్రిమినల్ కేసుల త్వరిత పరిష్కారానికి అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయస్థాన అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు.సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి రాధిక , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రవీందర్, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్యత్,2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నికిత, నిర్మల్ డిఎస్పి శ్రీనివాస్ , జిల్లా జైలర్ శ్రీ సూర్యప్రకాశ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు,ఎస్ఐలు, సీడీఓలు, న్యాయస్థాన అధికారులు,ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రెండు ఆర్‌టిసి బస్సుల ఢీ

తప్పిన ప్రమాదం.. పలువురికి గాయాలు



**ప్రజా పక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి గ్రామ సమీపంలోని గోదావరి బ్రిడ్జిపై శనివారం రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన పలువురిని వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఖానాపూర్ నుండి జగిత్యాల జిల్లా మెట్పల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు TS 21T0589, మెట్పల్లి నుండి ఖానాపూర్ కు వస్తున్న మరో ఆర్టీసీ బస్సు AP15Z 0101 నంబర్ గల ఆర్టీసీ వాహనాలు గోదావరి బ్రిడ్జిపై ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి.అదేవిధంగా ఢీకొన్న బస్సులను గమనించకుండా వెనకాల వస్తున్న కారు కూడా ఖానాపూర్ వైపు వెళ్లే బస్సు వెనుక భాగం లో ఢీకొనడంతో మూడు వాహనాలు ప్రమాదానికి గురైయ్యాయి అతివేగం,నిర్లక్ష్యం కారణంగా రెండు బస్సులు ఢీకొన్న దెబ్బకు ఒక బస్సు విండ్ స్క్రీన్ పూర్తిగా ధ్వంసమైంది.బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.కొందరి తలకు చేతులకు గాయాలయ్యాయి.హుటాహుటిన స్థానికులు,ఇతర వాహనదారులు వెంటనే స్పందించి గాయపడిన ప్రయాణికులను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అందుకున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బ్రిడ్జిపై ప్రమా దం జరగడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.తరువాత పోలీసులు వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

## శక్తి వంచన లేకుండా విధులు నిర్వహించాలి: ఎస్‌పి రోహిత్‌రాజ్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పోలీసులు శక్తి వంచన లేకుండా విధులు నిర్వహించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. ఈ మేరకు శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన ఆయన పోలీస్ సిబ్బంది నుండి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాలకు భక్తులు తరలివచ్చే మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలన్నారు. ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని, రిస్క్ ప్రాంతాలను ముందుగా గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి తెలిపారు. పుష్కరాల సమయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

## అంతర్రాష్ట నేరగాళ్ల అరెస్టు



ప్రజాపక్షం/ ఖమ్మం/ కామేపల్లి : తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని లక్షలాది రూపాయలు వసూలు చేయడంతో పాటు ఓ మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారంలోనూ ప్రమేయం ఉందని భావిస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల ఆశను సొమ్ము చేసుకునే ప్రయత్నంలో లక్షలు పోగేసి జల్సాలు చేసి అప్పులు తీర్చుకుని చివరకు పోలీసులకు చిక్కారు. కారేపల్లి సిఐ ఎన్. సాగర్ తెలిపిన వివరాల ప్రకారం... కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన నారాయణ గురప్ప పలు పేర్లతో పలు రాష్ట్రాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, భూములను తక్కువ ధరకు ఇప్పిస్తానని, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని ప్రజలను మోసగిస్తూ తిరుగుతుండేవాడు. ఆయన వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో ఈ మోసాలకు పాల్పడ్డాడు. హరిప్రసాద్‌గా, భోగా లక్ష్మి నారాయణగా తన పేర్లు ప్రచారం చేసుకుంటూ భక్తిడిగా ప్రజలను నమ్మిస్తుండేవాడు. గ్రామాల్లో పూజలు, పురస్కారాలకు దేవతా విగ్రహాల ఏర్పాటు, వివిధ జాతర్ల సందర్భంలో భక్తి సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తూ దాన ధర్మాలు చేసేవాడు. అలా ప్రజల్లో నమ్మకం కలిగిన తర్వాత తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తాని మోసాలకు పాల్పడటం ఆయనకు అలవాటుగా మారింది. మొదట కొద్ది మందికి బంగారం తక్కువ ధరకు ఇప్పించి పెద్ద మొత్తంలో వసూళ్లయిన తర్వాత పారిపోయే వాడు. కామేపల్లి మండలంతో పాటు ఖమ్మం పరిసర ప్రాంతాలకు చెందిన 18 మంది బాధితుల నుంచి సుమారు రూ. 85.70 లక్షలు వసూలు చేశాడు. ఇటీవల ఓ మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారంలోనూ వీరిపై కేసు నమోదైనట్లు సమాచారం. నారాయణ గురప్పతో పాటు కామేపల్లి మండలం బాసిత్ నగర్‌కు చెందిన బానోత్ సాయికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మారుతీ ఎకో కారు, రెండు మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

## అర్హుల పేర్లు ఓటరు జాబితాలో ఉండాలి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అర్హులైన ప్రతీ ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఎలు కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని టూటౌన్ ప్రాంతంలోని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, బిఎల్‌ఎలతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వారి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ గడువు పొడిగించిన నేపథ్యంలో ప్రతి కార్యకర్త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైందని, ప్రతి ఓటును కాపాడటం బిఆర్‌ఎస్ కార్యకర్తల బాధ్యత అన్నారు. బిఎల్‌ఓలతో కలిసి బిఎల్‌ఎలు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ అర్హుల ఓటు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, శీలంశెట్టి వీరభద్రం, బత్తుల మురళీ, తాజుద్దీన్, టూటౌన్ పరిధిలోని డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/చింతకాని : మాదకద్రవ్యాల నివారణపై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎస్‌ఐ నరేష్ కోరారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఆరోగ్యం, విద్య, కుటుంబం, సమాజంపై కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసీలు వేణుబాబు, గుంటి శ్రీనివాస్, సురేష్, కళాశాల అధ్యాపకులు జి మల్లయ్య, అయూబ్, కృష్ణార్జునరావు, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళలపై అటవీ అధికారుల దాష్టీకం

ఘటనపై సర్వత్రా నిరసన

ఒప్పందం ఉల్లంఘించారంటున్న అధికారులు





ప్రజాపక్షం/ ఖమ్మం/ అశ్వాపురం : పోడు సమస్య రగులుతూనే ఉంది. ప్రభుత్వాలు మారిన పోడు రైతుల పట్ల అటవీశాఖాధికారుల తీరు మాత్రం మారడం లేదు. ముఖ్యంగా ఆదివాసీ మహిళల పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తుంది. అశ్వాపురం మండలం మనుబోతుల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వేములూరుకు సమీపంలో ఆదివాసీ గిరిజనులు పోడు నరికి సాగు చేసుకుంటున్నారు. ఆదివాసీలు నివసించే ప్రాంతాన్ని నాగేశ్వరరావు గుంపు పేరుతో పిలుస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడి గిరిజనులు పోడు నరుకుతుండగా సాగు చేయడానికి వీలు లేదంటూ అటవీ శాఖాధికారులు శుక్రవారం సాయంత్రం పోడు రైతులను అడ్డుకున్నారు. యంత్రాలతో భూమిలో అటవీ అధికారులు పనిచేయిస్తుండగా గిరిజన మహిళలను అడ్డుకున్నారు. వారి పట్ల అటవీ అధికారులు అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా వారిపై చేయి చేసుకుని కిందపడేశారు. అటవీ శాఖాధికారుల తీరుతో గిరిజనులు బెంబేలెత్తారు. పోడు సాగు రైతులపై అధికారులు దౌర్జన్యం చేయడాన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

### హద్దు దాటారు : అటవీ అధికారి

మనుబోతులగూడెం గ్రామ పంచాయతీ నాగేశ్వరరావు గుంపు వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి అటవీశాఖాధికారి బి. బాబు మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి 10 మంది గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన సంబంధిత అధికారిపై విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు. అడవుల సంరక్షణకు ప్రజల సహకారం ముఖ్యమని ఆయన అన్నారు. గిరిజనులు గతంలో ఉన్న పోడు కాకుండా హద్దులు దాటారని శాంతియుతంగా మాట్లాడుకునే సమయంలో గిరిజనులు దాడి చేశారని ఆయన తెలిపారు.

# మెట్ట పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/కూసుమంచి: ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి పంటలకు బదులుగా మెట్ట పంటలు సాగు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించిన మంత్రి, రూ 4.61కోట్లతో బీటీ రోడ్లు, గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 66 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు, 111 మందికి రూ 35.16లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరు వెంకటరెడ్డి, సీడీసీ ఛైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కొండ కృష్ణవేణి, మేడిపల్లి విజయ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భట్టి పర్యటన



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి కామేపల్లి మండల కేంద్రానికి చేరుకుని అక్కడ జరిగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మద్దులపల్లిలో 33/11 కెవి సబ్ స్టేషన్, బిటి రోడ్లకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి తాళ్లగూడెం చేరుకుంటారు. ఇల్లందు మండలం రోంపెడులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. తిరిగి ఖమ్మంజిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి గ్రామంలో అనంత సాగర్ నుంచి చింతకాని జెడ్‌పి రోడ్డు వరకు బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. తిమ్మినేని పాలెం, ముదిగొండ మండలం చిన్నమండవ గ్రామాల్లో భట్టి విక్రమార్క పర్యటిస్తారు. సోమవారం కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద జరిగే పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొననున్నారు.

## శ్రీనివాసగిరి దేవాలయంలో హరితహారం



ప్రజాపక్షం/పాల్వంచ : పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని దీనికి ప్రతీ ఒక్కరం బాధ్యత తీసుకొని భావి తరాలకు భరోసా కల్పిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌లు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి శ్రీనివాసకాలనీలోని శ్రీనివాసగిరి దేవాలయంలో శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి, సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా హరితహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో చోటు చేసుకొంటున్న మార్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరు చెట్లను నాటి సంరక్షించాలని కోరారు. చెట్లు వాతావరణ సమతుల్యను పెంచుతాయన్నారు. ఆధ్యాత్మికతను పెంచే దేవాలయంలో వనమహోత్సవంలో భాగంగా చెట్లను నాటడం వలన ఒక వైపు ఆధ్యాత్మిక చింతన మరోవైపు ఆహ్లాదకరమైన వాతావరణం చోటు చేసుకొంటుందని తెలిపారు. భక్త సమాజ మండలి 5000 మొక్కలు నాటడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలకు మా సహాయ సహకారాలను ఎల్లపుడు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిఓ క్రిష్ణ ప్రసాద్, డిఎస్‌పి సతీష్ కుమార్, తహసీల్దార్ దారా ప్రసాద్, కార్పొరేషన్ డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి,శ్రీనివాసగిరి ట్రస్టు చైర్మన్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

పాల్గొన్న ఎంపి రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం, గ్రామాలకు నాణ్యమైన రహదారులు అందించడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరో ముందడుగు పడింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మె ల్యే ఆదినారాయణ శనివారం నియోజకవర్గంలోని దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించి రూ.3.14కోట్ల వ్యయంతో చే పట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పర్యటన దమ్మపేట మండలం నాచారం గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవంతో ప్రారంభమైంది. అనంతరం వడ్లగూడెం, మారప్పగూడెం, నారవారిగూడెం కాలనీ, అల్లిగూడెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రజలకు అం కితం చేశారు. ఈ రహదారులు గ్రామాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడమే కాకుండా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగిస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తదనంతరం అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రెటెడ్ స్కూల్, ఇకోపార్క్ పనులను ఎంపి, ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఊట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం గ్రామాల్లో సిసి రోడ్లను ప్రారంభించి గ్రామస్తులతో మాట్లాడారు. స్థానిక అవసరాలను తెలుసుకుని మరిన్ని అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎంపి రఘురాంరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, గ్రామాభివృద్ధి భవనాలు, పార్కులు వంటి అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు. ప్రతీ గ్రామం అభివృద్ధి చెందే వరకు తమ కృషి నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, వార్డు సభ్యులు, గ్రామశాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం యువతను విస్మరించింది

కాంగ్రెస్ కార్యాలయంలో నిరసన దీక్ష




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : యువతను విస్మరించి కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. యువత పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా లోక్‌సభ పక్షనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావులు సంఘీభావం తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ మొదటి సారి కాదని ఇంతకు ముందు కూడా జరిగిందని ఈ లీకేజీ కారణంగా ఎంతో మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు సందర్భాల్లో రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎ సభ్యులు గజ్జెల్లి వెంకన్న, కొత్తా సీతారాములు, సౌజన్య, వెజండ్ల సాయికుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ హుస్సేన్, విప్లవ్‌కుమార్, కిలారు అనిల్‌కుమార్, స్వరూప, ప్రభావతిరెడ్డి, గాదె ఝాన్సీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్

రైతులకు ఇబ్బంది కలగొద్దు: దివాకర్ టిఎస్



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని అంజనాపురం వద్ద నిర్మించిన గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ము ఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ప్రతీ ఏర్పాటును ముందస్తుగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సభాప్రాంగణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని విఐపిలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మ హిళలు, మీడియా ప్రతినిధులు, ప్రజలకోసం ప్ర త్యేకంగా కూర్చునే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ శాఖకు సూచించారు. రహదారుల మరమ్మతులు, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పూర్తి చేయాలని అన్నారు. ట్రాఫిక్ కు అంతరాయంలేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధంచేసి ప్రజలకు ముందస్తుగా సమాచారం అందజేయాలని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం పామాయిల్ సాగు అభివృద్ధికి ప్రోత్సాహకరంగానిలుస్తుందని తెలిపారు. రైతులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని స్పష్టం చేశారు. అందుకు తగిన విధంగా రై తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గోద్రెజ్‌సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిండిప్రోలులో వృద్ధురాలి హత్యపై వీడని మిస్టరీ

వరుస దొంగతనాలతో హడలిపోతున్న మండల ప్రజలు

హత్య ఘటనపై పోలీసుల ముమ్మర దర్యాప్తు



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో చోటుచేసుకున్న వృద్ధ మహిళ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చెన్న సుగుణమ్మ(60) అనే వృద్ధ మహిళను అగంతకుడు ఆమె నుదుటిపై కత్తితో బలంగా నరికి హత్యచేసిన ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హత్య బంగారు ఆభరణాల కోసం జరిగిందా, లేక మరేదైనా వ్యక్తిగత కారాణాలు ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటన జరిగిన తీరు గ్రామస్తులను భయాందోళనకు గురి చేసింది. స్థానికుల కథనం ప్రకారం... పిండిప్రోలు సంత సమీపంలో వరంగల్ –ఖమ్మం జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంటిలో చెన్న జనార్ధన్, భార్య సుగుణమ్మ నివాసం ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇంట్లోకి ప్రవేశించి వృద్ధ మహిళను అతి కిరాతకంగా హత్య చేశాడు. జనార్ధన్ పక్కనే ఉన్నప్పటికీ ఆయనకి పక్షవాతం ఉండటంతో ఆయన కదల్లేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో మెడలో బంగారు ఆభరణాలు కోసమే హత్య చేసి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఆమె మెడలో అప్పటికి నల్లపూసలు తాడు, చెవి దుద్దులు, పట్టీలు కాళ్లకు ఉండగా వాటిని వదిలేసి మెడలోని రెండు తులాల బంగారాన్ని తీసుకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. సుగుణమ్మ హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఊరును జల్లెడ పట్టారు. పోలీస్ జాగిలం మొదట సుగణమ్మ ఇంటి వద్ద నుండి వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరికి ఎస్సీకాలనీలో ఆగి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. గడిచిన రెండు సంవత్సరాల్లో వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. అంతకుముందు మూడు నెలల క్రితం గ్రామంలో మల్లెబోయిన యాదగిరి కిరాణాషాప్‌లో 12తులాల బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. అదే గ్రామంలో వృద్ధ మహిళ ఆరెంపల వెంకమ్మను కూడా ఇదే రీతిలో చిత్ర హింసలకు గురి చేసి బంగారం తీసుకెళ్లారు. ఇటీవల తిరుమలాయపాలెంలో మండలంలో వరుసగా దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొందరు యువకులు పేకాట, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, వాటిపై కూడా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పిండిప్రోలు హత్య కేసులో నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, పోలీస్ శాఖను కోరుతున్నారు. సుగణమ్మ హత్యకు కారకులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై పిండిప్రోలు గ్రామ ప్రజలు ఆందోళన నిర్వహించారు. సుగణమ్మ హత్య జరిగిన స్థలాన్ని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, కూసుమంచి సిఐ సంజీవ్, తిరుమలాయపాలెం ఎస్సై జగదీష్, రూరల్ సిఐ సంతోష్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వైద్య సాంకేతిక నిపుణులు సుగుణమ్మ బాడీని క్షుణ్ణంగా పరిశీలించారు. సుగణమ్మ చిన్న కుమారుడు చెన్న తిరుమలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఖమ్మం రోడ్లకు మహర్దశ

మంత్రి తుమ్మల చొరవతో పరిపాలన అనుమతులు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లాలో రోడ్లకు మహర్దశ రానుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మంలోని ఆరు కీలక రహదారుల అభివృద్ధికి పరిపాలన అనుమతులతో పాటు రూ.94.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ రోడ్లు భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం నియోజక వర్గ ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఆర్థిక శాఖ అంగీకారంతో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారులను ఆర్ అండ్ బి శాఖకు బదిలీ చేయడంతో పాటు నిధులు కేటాయించింది. రోడ్ల అభివృద్ధికి సహకరించిన ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆరు రహదారులు ఖమ్మం జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక పట్టణ ప్రాంతాలను అనుసంధానించే అత్యంత కీలకమైన మార్గాలు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్ల వల్ల ప్రజలు, రైతులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ రహదారుల అభివృద్ధితో ప్రయాణ సౌకర్యం మెరుగుపడటమే కాకుండా రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌కు సులభంగా తరలించేందుకు వీలు కలుగుతుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా రహదారులకు నిధులు మంజూరు చేసినందుకు ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## టిఎంసి రెబల్స్‌కు ప్రత్యేక సీట్లు

### షిండే వర్గంలో యుబిటి ఎంపిల విలీనానికి స్పీకర్ బిర్లా ఆమోదం

**న్యూఢిల్లీ :** శివసేన(యుబిటి) ఆరుగురు ఎంపీలు శివసేనలో (షిండే వర్గం) విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం ఆమోదం తెలిపారు. దీంతో థాక్రే వర్గానికి చెందిన ఎంపిలు ఇప్పుడు మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనమైనట్లు అధికారికంగా గుర్తించారు. దీంతో లోక్‌సభలో షిండే శివసేన బలం 13 మంది ఎంపిలకు పెరగ్గా, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేనకు (యుబిటి ఉద్ధవ్ బాల్ థాక్రే) ముగ్గురు ఎంపిలే మిగిలారు. అదే సమయంలో స్పీకర్ మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నుంచి విడిపోయి 'నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)'లో విలీనమైనట్లు ప్రకటించిన 20 మంది రెబల్ ఎంపిలకు లోక్‌సభలో ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేసేందుకు కూడా స్పీకర్ అనుమతి ఇచ్చారు. అయితే వారి పార్టీ విలీనాన్ని మాత్రం ఇంకా అధికారికంగా గుర్తించలేదు. కానీ లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌తో కాకుండా వేరుగా కూర్చునేందుకు అనుమతిని ఇచ్చారు. గత నెలలో టిఎంసి రెబల్ ఎంపి కాకోలి ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపిలు టిఎంసిని వీడి ఎన్‌సిపిఐలో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. అలాగే శివసేనలోనూ (యుబిటి) చీలిక ఏర్పడి, ఆరుగురు లోక్‌సభ సభ్యులు శివసేనలో (షిండే వర్గం) చేరగా వీటికి సంబంధించి తాజాగా స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయాలు ప్రకటించారు. లోక్‌సభ సెక్రటేరియట్ ఆఫీస్ ఇప్పటికే సవరించిన పార్టీ బలాబలాల జాబితాను శనివారం విడుదల చేసింది. షిండే నేతృత్వంలోని శివసేన బలం లోక్‌సభలో 13 మంది ఎంపిలకు చేరగా, దీంతో ఎన్‌డిఎలో బిజెపి తర్వాత అత్యధిక మంది ఎంపిలు కలిగిన రెండో మిత్రపక్షంగా నిలిచింది. ప్రస్తుతం తెలుగు దేశం పార్టీ (టిడిపి) 16 మంది ఎంపిలు ఉండగా ఎన్‌డిఎలో ఎక్కువ మంది ఎంపిలు ఉన్న మొదటి మిత్రపక్షంగా ఉంది. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు కూడా బిజెపిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం స్పీకర్ సహా లోక్‌సభలో ఎన్‌డిఎ బలం 298కి చేరింది. టిఎంసి రెబల్ ఎంపిల విలీనానికి కూడా స్పీకర్ ఆమోదం లభిస్తే ఎన్‌డిఎ బలం ఏకంగా 318 కి చేరుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులు ఉండగా, 3 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మూడింట రెండొంతుల మెజార్టీకి అవసరమైన సంఖ్యకు ఎన్‌డిఎ మరింత చేరువయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## పార్లమెంటులో 'తుఫాన్'కు

# అధికార, ప్రతిపక్షాలు సిద్ధం

రాముడి విరాళాలు, ప్రధాన్ రాజీనామా కీలకం
రేపటి నుండి వర్షాకాల సమావేశాలు ప్రారంభం
ధరలు, విదేశాంగ విధాన వైఫల్యం, అవినీతిసహా
కీలకబిల్లులపై కాంగ్రెస్ ఎదురుదాడి వ్యూహం



**న్యూఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. బయట ఎలినినో వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ఈసారి పార్లమెంటు సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు తుఫాన్ తరహా వాగ్యుద్ధానికి ప్రతిపక్షాలు సన్నద్ధమవుతుండగా, అధికారపక్షం కూడా అదేతరహాలో ప్రతిఘటించేందుకు సిద్ధమవుతున్నది. అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల దుర్వినియోగం–అవినీతిపై కేంద్ర,రాష్ట్ర (యుపి)పాలకుల అలసత్వం,నీట్ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం,కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్,పార్లమెంటుకు కేవలం రెండు మూడు కి.మీ దూరంలో ఉండే జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి)బైఠాయింపు,,సమావేశాల ప్రారంభం మొదటిరోజు పార్లమెంటుకు సిజెపి తలపెట్టిన నిరసన ప్రదర్శన వంటి తీవ్ర ఉద్రిక్తత మధ్య సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం,కుంభకోణాలు,అవినీతి, ధరల పెరుగుదల, నీట్ పరీక్షల్లో వైఫల్యం, విదేశాంగ విధానంలో వైఫల్యాలు వంటి అంశాలు ప్రధానంగా సభలో ప్రస్తావిస్తామని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఇప్పటికే ప్రకటించారు. కాగా ఆదివారం (జులై 19)న ప్రభుత్వం సంప్రదాయబద్ధంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తోంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్,అయోధ్యలో రామాలయానికి భక్తులు ఇచ్చిన విరాళాల అవినీతి అంశాలపై ప్రతిపక్షాలు ఎక్కువ దృష్టి కేంద్రీకరించనున్నాయి. దాదాపు ప్రతిపక్షాలతో సమానంగా ప్రభుత్వం కూడా పోరాట ధోరణినే అనుసరిస్తూ, తమకు అవసరమైన బిల్లులన్నింటినీ ఆమోదింపజేసుకునే విషయాలపై దృష్టి పెట్టేందుకు సిద్ధపడింది.ప్రస్తుతం ఆసుపత్రికి తరలించిన కాక్రోచ్ జనతాపార్టీ నాయకుడు సోనమ్ వాంగ్‌ఛుక్ 21 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభం దినం సోమవారం వరకూ తాను ఖచ్చితంగా ఉంటానని, ఒకవేళ అప్పటిలోగా సిజెపి ఆశయాలు నెరవేరకపోతే ఆ తర్వాత తాను ఆత్మరూపంలో వచ్చి డిమాండ్ చేస్తానని సోనంవాంగ్‌ఛుక్ వాఖ్యలు చేశారు.

ఎలాంటి పరిస్థితులు ఎదురైనాగానీ గత సమావేశాల కాలంలో పెడింగ్‌లో పడిన వాటితోసహా కీలకమైన అన్ని బిల్లులను ఈసారి ఆమోదించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇందులో ఆర్బిట్రేషన్ కౌన్సిల్ బిల్లును ఆమోదించే విషయంలో కూడా సర్వోన్నత న్యాయస్థానం నుండి పరోక్ష ఒత్తిడి వస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు,వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లు,వందేమాతరం క్రిమినల్ అఫెన్స్ బిల్లు వంటివి కూడా ఉన్నాయి. రెండు ముఖ్యమైన బిల్లుల విషయంలో ఎన్‌డిఎ ఎంపీలు వ్యతిరేకతతోనే ఉంటారని కాంగ్రెస్‌పార్టీ విశ్వాసంతో ఉన్నప్పటికీ రాష్ట్రాలకు తగిన రక్షణలు ఉంటే నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజ్వర్వేషన్ బిల్లు ముసాయిదాలలో మార్పులు పరిశీలించాక స్పందిస్తామని ఎన్‌సిపి–ఎస్‌పి,శివసేన(యుబిటి) సంకేతాలు ఇచ్చాయి. డిఎంకె కూడా 131వ రాజ్యాంగ సవరణను తీవ్రంగా వ్యతిరేకించి గడచిన ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో దీనిని ఓడించినప్పటికీ,కొత్త ముసాయిదా బిల్లు ఎలా ఉంటుందో చూశాక స్పందిస్తామని పర్కొంది. కానీ ఈ విషయంలో మిత్రులంతా తమతోనే ఉంటారని కాంగ్రెస్‌పార్టీ పూర్తి విశ్వాసంతో ఉంది.

కొన్ని అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాల తర్వాత ఈసారి పార్లమెంటులో ఫిరాయింపులు కారణంగా సమీకరణలు మారిపోయాయి. శత్రు శిబిరాల నుండి ఫిరాయింపులతో ఎంపీలు స్థానాలు మారడంతో పరిస్థితులు మారాయి. దీంతో ఈసారి అధికారపక్షం నిర్వాకాలపై ప్రతిపక్షాలు పదునైన పదజాలంతో ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమైంది. 20 మంది టిఎంసి ఎంపీలు ఎన్‌డిఎకు అనుకూలంగా మారారు.మరో ఆరుగురు ఎస్‌ఎస్‌ఎస్–యుబిటి ఎంపీలు వారివారి సొంత పార్టీలకు దూరమై లోక్‌సభలో ఎన్‌డిఎకు మద్దతుగా ఉన్నారు. స్పీకర్ గనుక తిరుగుబాటు ఎంపీలపట్ల సానుకూలంగా వ్యవహరిస్తే లోక్‌సభలో ఎన్‌డిఎ బలం కొంత పెరుగుతుంది. పార్లమెంటు ఎజెండాలో చేర్చకపోయినప్పటికీ కొత్త వాతావరణం మధ్య గత సమావేశాల్లో వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణతోపాటు మహిళా బిల్లు మరోసారి చర్చకు వచ్చే అవకాశం ఉంది. కానీ రాజ్యాంగ సవరణ ఆమోదానికి ఈ బలం చాలదు. ప్రస్తుతం 540 మంది ఎంపీలు ఉంటే సభలో 360 మంది ఎంపీల బలం కావాలి. కానీ మూడుస్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. రాజ్యాంగ సవరణను ఆమోదించాలంటే మూడింట రెండు వంతుల మెజార్టీ ఉండాలి. రాజ్యసభలో ఎన్‌డిఎకు కొన్ని సీట్ల మెజార్టీ తక్కువగా ఉంది. ఎవరైనా గైరుహాజరైతే వారికి సహాయపడవచ్చు కూడా. వీటిని ఆమోదింపజేసుకునేందుకు అధికారపక్షం మరోసారి గట్టి ప్రయత్నం చేసే అవకాశం ఉంది. బిజెపి,ఎన్‌డిఎ వ్యూహకర్తలు చురుగ్గా వీటిపై ఆలోచనలు చేస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీ ఎదురుదాడి వ్యూహానికి సన్నద్ధమైంది. మరోవైపు జమ్మూ కశ్మీరు స్వయంప్రతిపతి అంశం కూడా మరో అంశంగా అక్కడి ఎంపీలు చాలా గట్టిగా ప్రస్తావించేందుకు సిద్ధమయ్యారు.

## రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన

# నిందితులను తక్షణమే అరెస్ట్‌చేయాలి

### సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా




**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లోని రాణిగంజ్‌లో మహాపండిట్ రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది. భారతదేశపు గొప్ప పండితులు, స్వాతంత్ర్య సమరయోధులు, మార్క్సిస్ట్ ఆలోచనాపరులు, ప్రజా మేధావులలో ఒకరైన ఆయన విషయంలో జరిగిన ఈ చర్య హేయమైన, రాజకీయ, సైద్ధాంతిక, విధ్వంసక చర్య అని శనివారం సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆక్షేపించారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్‌చేసి, వారిని కఠినంగా శిక్షించాలని, ఆలస్యం చేయకుండా రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహాన్ని పునరుద్ధరించాలని రాజా డిమాండ్ చేశారు. రాహుల్ సాంకృత్యాయన్ ఒక గొప్ప సాహిత్యవేత్త మాత్రమే కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఒక విశిష్ఠ నాయకుడు అని పేర్కొన్నారు. 1940లో ఆల్ ఇండియా కిసాన్ సభకు జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన సాంకృత్యాయన్ తన జీవితాన్ని, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల పోరాటాలకు అంకితం చేసిన నాయకుడన్నారు. బిజెపి పాలనలో పెరుగుతోన్న అరాచకత్వం, శిక్షల నుంచి తప్పించుకోగలమనే ధీమా, దేశంలోని ప్రగతిశీల. ప్రజాస్వామ్య వారసత్వంపై దాడులకు ఊతమిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ చర్యలు దేశవ్యాప్తంగా హేతువాద, లౌకిక, వామపక్ష సంప్రదాయాల వారసత్వాన్ని తుడిచిపెట్టి భారతదేశపు సుసంపన్నమైన, బహుళత్వ, ప్రగతిశీల చరిత్ర స్థానంలో సంకుచిత మతతత్వ ధోరణిని ప్రవేశపెట్టడానికి ఒక వ్యవస్థీకృత ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహంపై దాడి ఈ ప్రమాదకరమైన భావజాలాన్ని ప్రదర్శించడంలో భాగమేనని, దానిని ఆ నేపథ్యంలోనే చూడాలన్నారు. స్వేచ్ఛ, శాస్త్రీయ దృక్పథం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి వారసత్వాన్ని చెరిపివేసే ఇలాంటి కుటిల ఆలోచనలు, ప్రయత్నాలను ఐక్యంగా ప్రతిఘటించాలని ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల శక్తులు, రచయితలు, మేధావులు, భారతీయ ప్రజలకు డి.రాజా పిలుపునిచ్చారు.

## ఈ నెల 20 నుంచి సాట్‌జీ క్రీడా అకాడమీల ప్రవేశ ఎంపికలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఎటిజి) ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ క్రీడా అకాడమీలు, ప్రాంతీయ క్రీడా వసతి గృహాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 20 నుంచి 28 వరకు ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన బాలురు, బాలికలకు వివిధ క్రీడా విభాగాల్లో ప్రవేశ అవకాశాలు కల్పించేందుకు ఈ ఎంపికలు చేపడుతున్నట్లు వెల్లడించింది. సైక్లింగ్, రెజ్లింగ్, వాలీబాల్, హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ తదితర విభాగాలకు హైదరాబాద్, ఖమ్మం, సిద్ధిపేట, మహబూబ్‌నగర్, హనుమకొండ కేంద్రాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎంపికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఉప సంచాలకులు, జిల్లా యువజన క్రీడాధికారులు, కోచ్‌లు, సంబంధిత క్రీడా సంఘాల ప్రతినిధులు, అంతర్జాతీయ క్రీడాకారులతో ప్రత్యేక ఎంపిక కమిటీలను ఏర్పాటు చేసినట్లు సాట్‌జీ వెల్లడించింది. అర్హులైన యువ క్రీడాకారులు నిర్ణీత తేదీల్లో సంబంధిత వేదికలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ విజ్ఞప్తి చేసింది.

## లాలూకు అనారోగ్యం.. ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలింపు



**పాట్నా :** రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. దాంతో ఆయనను పాట్నాలోని ఇందిరాగాంధీ వైద్య విజ్ఞానసంస్థలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించనున్నారు. శుక్రవారం సాయంత్రం రక్తపోటు హెచ్చుతగ్గులకు గురికావడంతో ఆయనను పాట్నాలోని ఇందిరా గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ లో చేర్పించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించి అత్యవసర చికిత్స చేశారు. అనంతరం ఆరోగ్యం కుదుటపడటంతో డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం తదుపరి వైద్య పరీక్షల కోసం లాలూని ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకెళ్తామని ఆయన పెద్ద కుమార్తె, ఆర్‌జెడి ఎంపి మిసా భారతి తెలిపారు. కాగా, లాలూ చాలాకాలంగా పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 2022 డిసెంబర్‌లో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

## ఉగ్రవాదం పట్ల 'జీరో సహనం' ఒక ప్రకటన మాత్రమే కాదు...

# భారతదేశానికి ఒక కార్యాచరణ విధానం

### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** స్వదేశీ రక్షణ ఉత్పత్తికి లభించిన భారీ ప్రోత్సాహంతో, భారతదేశం హిందూ మహా సముద్రం నుండి ఇండో–పసిఫిక్ వరకు తన వ్యూహాత్మక ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, వేగంగా ఒక విశ్వసనీయమైన ప్రపంచ భద్రతా భాగస్వామిగా ఎదుగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ పాకిస్థాన్‌కు ఒక గట్టి సందేశం పంపారు. ఉగ్రవాదంపై న్యూఢిల్లీ తన వైఖరిని యావత్ ప్రపంచం ముందు స్పష్టంగా వెల్లడించిందని సింగ్ తెలిపారు. 'ఉగ్రవాదం పట్ల 'జీరో సహనం' అనేది మాకు కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు.అది ఒక కార్యాచరణ విధానం' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. 'మేం ఉగ్రవాదంపై కేవలం దాడులు వారి ఇంటి వద్దనే కాకుండా, వారి ఇంటికి వెళ్ళి దాడులు చేస్తాం. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం అంతా దీనిని చూసింది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. స్వదేశీ రక్షణ తయారీ రంగంలో భారతదేశం సాధించిన విజయాన్ని రక్షణ శాఖ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశంలో తయారైన రక్షణ ఉత్పత్తులు 100దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, దేశం మొత్తం రక్షణ ఉత్పత్తి విలువ వార్షికంగా 1.78లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరుకుందని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. 'నేడు భారతదేశం కేవలం రక్షణ పరికరాలను తయారుచేయడం మాత్రమే కాదు, ప్రపంచానికి ఒక విశ్వసనీయమైన భద్రతా భాగస్వామిగా ఎదుగుతోంది. హిందూ మహా సముద్రం నుండి ఇండో పసిఫిక్ వరకు భారతదేశ పాత్ర నిరంతరం బలపడుతోంది' అని ఆయన హిందీలో అన్నారు. 2029నాటికి దేశం రూ.3లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తి మైలురాయిని చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రక్షణ మంత్రి వివరించారు.'ఒక దేశం ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నావిగేషన్ వ్యవస్థలు, క్షిపణులు, ర్యాడార్లు, డ్రోన్‌లపై ఇతర దేశాలపై ఆధారపడితే, దాని వ్యూహాత్మక , సైనిక సంపత్తి కూడా పరిమితం అవుతుంది. దీనిని పూర్తిగా మార్చాలనే పూర్తి ఉద్దేశంతో మేము ఉన్నాం' అని ఆయన అన్నారు. 'ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత భారత పరిశ్రమలపై ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని బలోపేతం చేసే దిశగా 'మోదీ'ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద అడుగు ఇదే' అని సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ అనేది సాంకేతిక యుద్ధానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అన్నారు. ఈ ఆపరేషన్‌లో ఆకస్తీర్, ఆకాష్, క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్ వంటి అధునాతన క్షిపణి వ్యవస్థలతో పాటు అనేక తాజా పరికరాలు కూడా ఉపయోగించబడినాయని, భారతదేశ సాయుధ బలగాలు మార్పును అర్థం చేసుకోవడమే కాకుండా, విశ్వాసంతో కూడా పనిచేస్తున్నాయన్నది ఆపరేషన్ సిందూర్ రుజువు చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

## రామ మందిరం విరాళాల చోరీ పిటిషన్లపై...

# 20న 'సుప్రీం' విచారణ

### యుపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'సిట్' ఒక స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరానికి సంబంధించిన విరాళాల దుర్వినియోగంపై నిష్పాక్షికమైన, నిర్ణీత కాల పరిమితితో కూడిన దర్యాప్తును కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు జులై 20న విచారణ చేపట్టనుంది. జులై 20నాటి సుప్రీంకోర్టు కేసుల జాబితా ప్రకారం ఈ అంశానికి సంబంధించిన నాలుగు వేర్వేరు పిటిషన్లు ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానున్నాయి. జులై 13న ఈ పిటిషన్లను విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తమకు ఒక స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. 'కొన్ని రిట్ పిటిషన్‌లపై ఎఫ్‌ఐఆర్‌లు ఇప్పటికే నమోదు అయ్యాయని, ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఒక సిట్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నందున ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేసిన సిట్ ఈ కోర్టుకు స్పెషల్ స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని మేం ఆదేశిస్తున్నాం'అని సుప్రీంకోర్టు పేర్కొంది.ఈ కేసు పిటిషనర్లలో ఒకరైన నరేంద్ర కుమార్ గోస్వామి ఈ కేసులో సిబిఐ విచారణను కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రామ మందిరం వ్యవహారాలను నిర్వహించే శ్రీ రామ్ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆడిట్ చేయాలని కూడా ఆయన కోరారు. సుప్రీంకోర్టులో పిటిషన్లలో ఒక దానిని దాఖలు చేసిన అజయ్ కుమార్ రాయ్, దినేష్ కుమార్ యాదవ్, ఆలయ ట్రస్ట్ వ్యవహారాలు, పరిపాలనకు సంబంధించిన ఆరోపిత ఆర్థిక అవకతవకలు, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సిబిఐ నేతృత్వంలోని బహుళ విభాగాల కమిటీ దర్యాప్తు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ కోరడంతోపాటు ట్రస్ట్ మొత్తం ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని కూడా ఆర్‌జెడి ఎంపి సుధాకర్ సింగ్ తన మూడవ పిటిషన్‌లో కోరారు. హిందూ ధర్మ పరిషత్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌లో ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని కోరారు. రామ మందిరానికి అందిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్య ంలో ఆలయ ట్రస్ట్ చేసిన అభ్యర్థన మేరకు జూన్ 13న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసింది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) కిరణ్ ఎస్, స్పెషల్ సెక్రటరీ (ఫైనాన్స్) నీల్ రతన్ 'సిట్'కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

## విద్యావ్యవస్థను పునర్నిర్మించాలి

### ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** దేశంలో కొనసాగుతున్న విద్యావ్యవస్థపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. పిల్లలకు ఒత్తిడి లేని సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేలా, అలాగే తల్లిదండ్రులు తమ త్యాగాలకు తగిన ఫలితాన్ని పొందేలా విద్యా వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డెహ్రాడూన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) ర్యాలీకి సంబంధించిన వీడియో క్లిప్‌ను రాహుల్‌గాంధీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. మే నెలలో పేపర్ లీక్ ఆరోపణల కారణంగా నీట్‌యుజి పరీక్ష రద్దయిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న రియా కుమారి తండ్రి రాజేష్ కుమార్‌ను రాహుల్‌గాంధీ వేదికపైకి పిలిచారు. 'తన కుమార్తెను కోల్పోయిన బాధలో రియా తండ్రి రాజేష్ జీ ఎంతగా కుంగిపోయారంటే, ఆయనను చూసిన ప్రతి ఒక్కరి కళ్లలోనూ నీళ్లు తిరిగాయి. ఇది కేవలం ఒక కుటుంబం పడుతున్న బాధ మాత్రమే కాదు; పేపర్ లీక్ కారణంగా ఇలాంటి అనేక కుటుంబాల నుంచి పిల్లలు దూరమయ్యారు. ప్రతి పేరు వెనుక ఒక తల్లి, ఒక తండ్రి ఉంటారని, వారికి ఇకపై ఎటువంటి భవిష్యత్తు లేదు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ఈ విద్యా వ్యవస్థను మొదటి నుంచీ పునర్నిర్మించాలి. పిల్లలకు ఒత్తిడికి బదులుగా భద్రత లభించేలా, తల్లిదండ్రులు కన్నీళ్లకు బదులుగా తమ త్యాగాలకు తగిన ఫలితాన్ని పొందేలా ఒక వాతావరణాన్ని సృష్టించాలి' అని రాహుల్‌గాంధీ అన్నారు. విద్యా సంస్థలపై ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థకూ ఆధిపత్యం ఉండకూడదని శుక్రవారం నాడు గాంధీ పేర్కొన్నారు. అలాగే, పేపర్ లీక్ సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించాలని, ఇది అందరి బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. శుక్రవారం సాయంత్రం డెహ్రాడూన్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ, మొత్తం విద్యా వ్యవస్థ— పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు— పేపర్ లీక్‌లలో భాగమైందని, దీనివల్ల ఇప్పటివరకు 7.5 కోట్ల మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని ఆయన ఆరోపించారు.

## అభిషేక్ బెనర్జీ ఆఫీసు కూల్చివేత



**కోల్‌కతా :** బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బుల్డోజర్ చర్యలకు పాల్పడుతున్నాయి. తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గళం ఎత్తితే అణచివేతకు చర్యలకు పాల్పడుతున్నాయి. తాజాగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన బిజెపి కూడా బల్డోజర్ చర్యలను ప్రారంభించింది. ఆమోదిత భవన ప్రణాళిక లేకుండా, నిబంధనలను ఉల్లంఘించి అమ్తాలలోని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసేందుకు దక్షిణ 24 పరగణాల జిల్లా యంత్రాంగం శనివారం నాడు చర్యలు ప్రారంభించిందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. పోలీసులు, కేంద్ర బలగాలు కార్యాలయ ప్రాంగణాన్ని గార్డ్ రెయిల్స్‌తో దిగ్బంధించడంతో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. మధ్యాహ్నం సమయంలో మూడు బుల్డోజర్లను తీసుకువచ్చి, యంత్రాంగం కార్యాలయం ముందు ఉన్న షెడ్డును తొలగించడం ప్రారంభించింది. ఆ తర్వాత భవనం ముందు భాగాన్ని కూల్చివేసింది. ముందుజాగ్రత్త చర్యగా అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. తప్పనిసరిగా పాటించాల్సిన పరిపాలనా ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే ఈ చర్య చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కూల్చివేత ప్రక్రియ సందర్భంగా, పోలీసులు భవనం నుంచి అనేక కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, పెద్ద సంఖ్యలో ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కూల్చివేతతో ఆ ప్రాంతంలో గుమిగూడిన బిజెపి కార్యకర్తలు, మద్దతుదారులు సంబరాలు చేసుకుని పైశాచిక ఆనందం పొందారు. వారు తమ పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు. అభిషేక్ బెనర్జీ పార్టీ కార్యాలయాన్ని భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించారని బిజెపి అమ్తాలా ఎమ్మెల్యే అగ్నిశ్వర్ నస్కర్ ఆరోపించారు.

## రాయ్‌పూర్‌లో ఐదుగురు మృతి

**ఛత్తీస్‌గఢ్:** రాయ్‌పూర్‌లోని ఓ ఇంట్లో ఐదుగురి మృతి కలకలం రేపింది. ఇంట్లో దంపతులతో పాటు కుమారుడు, ఇద్దరు మైనర్ కూతుర్లు మృతిచెంది ఉన్నట్లు శనివారం పోలీసులు తెలిపారు. సంజయ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో మరణాల విషయం శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చిందని వారన్నారు. ఒక వ్యక్తి కుటుంబసభ్యులకు విషమిచ్చి అనంతరం ఉరివేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

**పత్రిక ప్రకటన**

నేను, **గుండ్ల జగన్, తండ్రి చంద్రయ్య,** మారుతి నగర్, బిసైడ్ ఫ్రూట్ మార్కెట్, కొత్తపేట. యాచారం మండల్ & విలేజ్‌లో సర్వే నెంబర్ 9/p,10/p, 11/p లో గల వెంచర్‌లో ప్లాట్ నెంబర్ 23, 22. మొత్తం 400 గజాలు, డాక్యుమెంట్ నెంబర్స్ **29681/2019, 29682/2019** డాక్యుమెంట్స్ సాగర్ రింగ్ రోడ్డు నుండి ఇబ్రహీంపట్నం వెళ్లే బస్సులో ప్రయాణించేటప్పుడు మార్గం మధ్యలో పోయినవి. దయచేసి ఎవరికైనా దొరికితే పై చిరునామాలో ఇవ్వగలరు. మొబైల్ నెంబర్: 7997777341

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మూసాపేట సర్కిల్-53.**

Lr No. 13/CMC/MPT-53/EE/2026-27 Date: 17.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 13/CMC/MPT53/ EE/2026-27 Dated: 17.07.2026 | సిఎంసి, మూసాపేట సర్కిల్-53లో బోనాల పండుగ పనులు | రూ. 7.30 లక్షలు | 24.07.2026 01:00 PM 27.07.2026 02:00 PM | శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మూసాపేట సర్కిల్-53, సెల్: 8897507674 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట సర్కిల్-53, సిఎంసి.
DIPR R.O. No. : 6312-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-23 & సర్కిల్-24
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

**Nit No.** 20/EE-23&24/RJNRZ/GHMC/2026-27, **పని పేరు:** (07) నెంబర్ల పనులు, **అంచనా విలువ:** రూ.67.25 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 21.07.2026 సా.5:00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ: 24.07.2026 సా.5:00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ బి.నాగేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23 & సర్కిల్-24, ఆర్‌జెఎన్‌ఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చంద్రాయణగుట్ట & సర్కిల్-24, జంగంమెట్/ ఆర్‌జెఎన్‌ఆర్‌జెడ్/జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 6284-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12**

Date: 18.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 10/EE12/ SRNR/MMC/2026-27, Dated: 18-07-2026 | ఒకరు (01) "కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం" పనికి సంబంధించి | రూ. 12.20 లక్షలు | 20.07.2026 @03:10 PM | శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి.
DIPR R.O. No. : 6299-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు & భవనాల శాఖ**
(ఆర్&బి) విభాగం : కామారెడ్డి

NIT No. 11-12/DB/T3/EE/R&B/KMR/2026-27 తేదీ : 13.07.2026

| క్ర. సం. | N.I.T No. & Dated. | పని పేరు | అంచనా మొత్తం |
|---|---|---|---|
| 1 | 11/2026-27 తేదీ: 13.07.2026 | కామారెడ్డి జిల్లాలోని బాన్స్‌వాడ బిచుకుంద రోడ్‌లో కి.మీ. 4/0-6 వద్ద ఉన్న బ్రిడ్జికి దెబ్బతిన్న విస్తరణ జాయింట్లకు అత్యవసర మరమ్మతులు. | రూ.3.50లక్షలు |
| 2 | 12/2026-27 తేదీ: 13.07.2026 | నిజామాబాద్ జిల్లాలో (కొత్తగా ఏర్పడిన కామారెడ్డి జిల్లా) ధర్మారెడ్డి నుండి ముద్దాపూర్ వయా వెంకంపల్లి రోడ్డు, పి.ఆర్.రోడ్డు వరకు మంజీరా నదిపై హెచ్‌ఎల్‌బి నిర్మాణం (ఉపపని : పైలాన్ నిర్మాణం) | రూ.4.00లక్షలు |

1. టెండర్ల స్వీకరణ ప్రారంభం: 21.07.2026 సాయంత్రం 4.00 గంటలలోపు టెండర్‌దారులు 14.07.2026 సాయంత్రం 4గంటల నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అనగా, https//tenders.telangan.gov.in నుండి టెండర్ షెడ్యూళ్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
2. సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరు మరియు చిరునామా: "శ్రీ పి.మోహన్ , బి.టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి) డివిజన్ : కామారెడ్డి మొబైల్ నెం. 09247890376"
3. మరిన్ని వివరాల కోసం @ e-procurement market place : https//tenders.telangana.gov.in ను సందర్శించండి.
4. సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్&బి) నిజామాబాద్ సర్కిల్ వారికి సమాచారం నిమిత్తం ప్రతి సమర్పించడమైనది.
5. సమాచారం కోసం DEE (R&B) సబ్ డివిజన్ : కామారెడ్డి , యెల్లారెడ్డి, బాన్స్‌వాడ & బిచుకుండకు కాపీ చేయండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : కామారెడ్డి
DIPR R.O. No. : 6283-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

# ఎర్రసముద్రంలో రాకపోకలు ఆపేస్తాం

• భవిష్యత్తులో భీకర యుద్ధం • అమెరికాకు ఇరాన్ హెచ్చరిక • 12 రోజుల్లో 50 మంది ఇరానీయులు మృతి:500మందికి గాయాలు • 10 ఇరాన్ క్షిపణులు కూల్చేసిన జోర్డాన్



**టెహ్రాన్/వాషింగ్టన్:** ఎంయు ఒప్పందానికి కాలం చెల్లిందని,ఎదురుచూపుల సమయం ముగిసిందన్న ప్రకటనలమధ్య అమెరికా–ఇరాన్ దేశాల సైన్యాల పరస్పర దాడులు ఆగకుండా కొనసాగాయి.శనివారం తెల్లవారకముందే ఏడోరోజు రాత్రి కూడా ఇరాన్‌పై భారీ దాడులు పూర్తిచేసినట్లు అమెరికాసైన్యం సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలు, జాతీయ రహదారులు, నీటిశుద్ధి కేంద్రాలు, నిఘా కేంద్రాలు, భూగర్భ ఆయుధ నిల్వలు,సముద్రతల ఆయుధ సంపద, ఇతర పౌర మౌలిక సదుపాయాలపై సెంట్‌కామ్ దాడులు చేయగా, అమెరికా మిత్రదేశాలు బహ్రైన్, జోర్డాన్, కువైట్‌లలో అమెరికా స్థావరాలపై ఐఆర్‌జిసి ప్రతిదాడులు కొనసాగించింది. ఇరాన్ నగరం యజ్ద్,జలసంధిని ఆనుకుని ఉన్న ఖేష్మ్‌ద్వీపం,బందర్‌అబ్బాస్ ఓడరేవులు పేలుళ్ళతో దద్దరిల్లాయి. ఉత్తర హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో 100కు పైగా టెలికమ్యూనికేషన్స్ టవర్స్‌ను ధ్వంసం చేయడంతో మొబైల్‌ఫోన్లు,ఇంటర్‌నెట్ సేవలు స్తంభించచాయి. మరోవైపు బహ్రైన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, కువైట్‌లోని అల్ అహ్మది పోర్టుపై ఐఆర్‌జిసి క్షిపణి దాడులు చేసింది.ఒక విద్యుత్‌ప్లాంటు,చమురు కేంద్రం, నీటిశుద్ధి కర్మాగారం తీవ్రంగా దెబ్బతిన్నట్లు కువైట్ ప్రకటించింది.కువైట్‌దేశం 90 శాతం త్రాగునీటి అవసరాలకోసం సముద్రనీటిశుద్ధిపైనే ఆధారపడుతోంది. ఇరాన్ దాడులవల్ల తీవ్రంగా మంటలు చెలరేగడంతో మంటలు ఆర్పే ప్రయత్నంలో అనేకమంది అగ్నిమాపకదళ కార్మికులు గాయపడ్డారు. ఇరాన్ కూడా ఒక ప్రకటన చేస్తూ ఇర్బిల్ నగరంపై ఇరాన్ ప్రయోగించిన క్షిపణు కూల్చివేశామని పేర్కొంది. తమ గగనతలంపైకి ఇరాన్ ప్రయోగించిన 10 క్షిపణులను కూల్చివేశామని, ఎలాంటి ప్రాణనష్టం,ఆస్తినష్టం లేకుండా వాటి శిథిలాలను కూడా మెరైన్ ఇంజనీర్లు శుభ్రం చేసేశారని జోర్డాన్ రక్షణ బలగాలు ప్రకటించాయి.ఇరాన్‌లోని దక్షిణ హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో అమెరికా గగనదాడులతో ముగ్గురు ఇరానీయులు మరణించారు. మరో ఎనిమిదిమంది గాయపడ్డారు. జాస్క్ సమీపంలో సముద్రనీటిని శుద్ధిచేసి త్రాగునీరుగా మార్చే ప్లాంట్లను యుద్ధ విమానాలు ధ్వంసం చేయడంతో 20 గ్రామాలలో ఉన్న వేలాదిమంది ప్రజలకు పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయిందని ఇరాన్ నేషనల్ వాటర్ కంపెనీ ప్రకటించింది. అదేవిధంగా జులై ఆరో తేదీ నుడి ఈనాటి వరకూ అమెరికా చేసిన దాడుల్లో 50 మంది ఇరానీయులు మరణించగా, మరో 500 మంది గాయపడ్డారని ఇరాన్ ప్రకటించినట్లు అల్‌జజీరా పేర్కొంది.గడచిన సోమవారం నుండి 26 మంది అమెరికా సైనికులు గాయపడగా, యుద్ధం మొదలైనప్పటినుండీ 14 మంది సైనికులు మరణించగా,427 మంది గాయపడినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. హోర్ముజ్ దక్షిణమార్గంలో వెళుతున్న రెండు చమురు ట్యాంకర్లు సముద్రంలో ఇరాన్ పెట్టిన మందుపాతరలను ఢీకొని ధ్వంసమయ్యాయి. మరో నాలుగు నౌకలను కదలకుండా స్తంభింపజేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది.దేశంలో పౌర మౌలిక విద్యుత్ కేంద్రాలపై అమెరికా దాడులను ఇరాన్ ధృవీకరించింది.విద్యుత్ కొరత ఏర్పడిందని, పౌరులు పొదుపుగా కరంటు వాడుకోవాలని కోరింది. భవిష్యత్తులో పెను యుద్ధం జరుగుతుందని ఇరాన్ ప్రకటించింది. ఈ భారీ యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిందేనని తన మిత్రసైన్యాలకు పిలుపు ఇచ్చింది. ఇరాన్‌కు ఈ యుద్ధంలో హౌతీలు,హెజ్బొల్లాలు,హమాస్ సైన్యాలు ప్రధాన అండదండలుగా వస్తాయి. రాబోయే పెను యుద్ధానికి హెజ్బొల్లాలే నాయకత్వ పాత్ర వహించనున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు తెలియజేశాయి. మరోవైపు ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకలను నిలిపివేసేందుకు ఏ క్షణంలోనైనా సిద్ధంగా ఉండాలని హౌతీలకు జులై 16వ తేదీన ఇచ్చిన పిలుపును ఇరాన్ పునరుద్ఘాటించింది. ఇరాన్‌ను నాశనం చేసే వ్యూహాన్ని ట్రంప్ అమలు చేస్తే ఈసారి తమ దాడులు విస్తారంగా,విధ్వంసకరంగా ఉంటాయని ఐఆర్‌జిసి ఖతమ్–అన్బియా కేంద్ర కార్యాలయం ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫఘారీ రెండు రోజులక్రితమే ట్రంప్‌కు హెచ్చరిక చేశారు. హోర్ముజ్ జలసంధిని ఒక అభేద్యమైన "రెడ్‌లైన్"గా ఆయన అభివర్ణించారు. జలసంధి వ్యవహారాల్లో అమెరికా దురాక్రమణ జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు. ఇదిలాఉండగా, పశ్చిమాసియా యుద్ధం వల్ల ఈసారి చమురు సరఫరాలకు పెద్ద ప్రమాదం పొంచి ఉందన్న సందేహాలు వ్యక్తమవుతున్న తరుణంలో శనివారం చమురు ధర 1.2 శాతానికి పెరిగింది. బ్రెంట్‌క్రూడాయిల్ బ్యారెల్ ధర 86 డాలర్లకు చేరింది.

## 'రేపు' బ్రిటన్ ప్రధానిగా బర్న్‌హామ్ ప్రమాణ స్వీకారం



**లండన్:** బ్రిటన్ లేబర్‌పార్టీ అధినేతగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్ జులై 20వ తేదీన దేశ ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు కూడా చేపట్టనున్నారు. భారీ ప్రణాళికతో ఆయన బరిలోకి దిగుతున్నారు. పదవి చేపట్టాక ఉత్తర సముద్రంలో కొత్తగా గ్యాస్–చమురు తవ్వకాలకు సంబంధించిన ఒక ప్రణాళికను ప్రకటించనున్నారు. బ్రిటన్ మీడియా సమాచారం ప్రకారం,దేశంలో కొత్త లైసెన్సులు జారీ చేయకుండా, ఉన్న లైసెన్సులను గౌరవించి ఉత్తర సముద్రంలో చమురు–గ్యాస్ తవ్వకాలపై స్టార్మర్ కాలంలో చెలరేగిన వివాదాన్ని ముగించాలని ఆయన కోరుకుంటున్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో సొంత వనరులను సద్వినియోగం చేసుకోలేకపోవడం అవివేకమని ఆయన వ్యాఖ్యానించారు. గడచిన పది సంవత్సరాలుగా దేశం ఎదుర్కొంటున్న అస్థిరత,రాజకీయ సంక్షోభానికి తెరదించి, వర్తమాన ఆశ్రిత ప్రపంచ రాజకీయాల్లో దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా తీసుకువెళ్ళి 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి లేబర్‌పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కృతనిశ్చయంతో ఉన్నారు. దానికి తగ్గట్టుగా ఒక ముందస్తు ప్రణాళికలో ఆయన రంగ ప్రవేశం చేస్తున్నారు. లేబర్‌పార్టీని సంస్కరించడానికి, దేశంలో పరివర్తన తీసుకురావడానికి ఐదు మార్గదర్శకాంశాలను బర్న్‌హామ్ ప్రకటించారు. ప్రజల జీవన వ్యయాల భారాలు తగ్గిస్తామని, ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. గడచిన నాలుగు దశాబ్దాల బ్రిటన్ రాజకీయాలలో రాబోయే పరివర్తనకాలాన్ని అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఆయన అభివర్ణించారు. దేశంలో,లేబర్‌పార్టీలో మార్పులు తెచ్చేందుకు సిద్ధమయ్యారు.ఎలాంటి పోటీ లేకుండా లేబర్‌పార్టీ నాయకుడుగా శుక్రవారం విజయం సాధించిన తర్వాత జరిగిన ప్రత్యేక సదస్సులో బర్న్‌హామ్ తన భవిష్యత్ ప్రణాళిక గురించి చెప్పారు. 2024లో పార్టీ అధికారంలోకి రావడానికి ప్రకటించిన ప్రణాళిక అంశాలను, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తామని చెప్పారు. పార్టీలో అంతర్గత కలహాలను అంతం చేస్తానని, భిన్నాభిప్రాయాలకు విలువ ఇస్తానని చెప్పారు. బ్రిటన్‌లో సరికొత్త రాజకీయ వ్యవస్థ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రధాన మంత్రి నివాసం,కార్యాలయమైన టెన్ డౌనింగ్ స్ట్రీట్ అధికారుల నుండి అత్యంత ప్రమాదకరమైన,పొంతనలేని ప్రకటనల సంస్కృతికి కూడా అంతం పలుకుతానని చెప్పారు. గడచిన పది సంవత్సరాలుగా బ్రిటన్ రాజకీయాలు ఎదుర్కొంటున్న అస్థిరత,గందరగోళానికి అంతం పలకాలని కోరుకుంటున్నానని, వీలైనంత ఏకాభిప్రాయాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. గడచిన పది సంవత్సరాలలో బ్రిటన్ ఇప్పటికి ఏడుగురు ప్రధానమంత్రులను (కాబోయే బర్న్‌హామ్ సహా)చూసింది.

## చైనాలో కొండచరియలు పడి 8మంది మృతి

**10 భవనాలు నేలమట్టం: 34 మంది గల్లంతు**
**మెక్సికో,గౌతమాలా,చైనాలో భారీ భూకంపం**

**ఛోంగ్‌కింగ్:** చైనాలోని ఛాంగ్‌క్వింగ్ నగరంలో కొండచరియలు విరిగిపడ్డాయి. పది నివాసిత భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో ఎనిమిది మంది సజీవసమాధి అయ్యారు. మరో 34 మంది జాడ తెలియడంలేదు. వారు సజీవంగా ఉండి ఉంటారన్న ఆశతో సహాయబృందాలు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. పెంగ్‌షూయి కౌంటీలో శుక్రవారం ఉదయం ఘటన జరిగాక ఈ ప్రాంతం నుండి 1100 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సిసిటీవీలలో చూసిన సమాచారం ప్రకారం కొండ చరియల నుండి కింద భవంతులపైన పడిన పెద్ద పెద్ద రాళ్ళు బహుళ అంతస్తుల భవనాల సైజు కంటే చాలా పెద్దవిగా ఉండి దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో చాలారోజులుగా ఆగకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కొండ చరియల నుండి 18,000 క్యుబిక్ మీటర్ల రాళ్ళు,మట్టి ఈ జారి ఈ భవంతులపై పడింది. వీటిల్లో అతిపెద్దదైన ఒకేఒక్క కొండరాయి 3000 క్యూబిక్ మీటర్లు ఉంటుందని అంచనావేసినట్లు పెంగ్‌షూయి కౌంటీ ప్రణాళిక,ప్రకృతి వనరుల విభాగాధిపతి వాంగ్ ఛౌన్‌జున్ పత్రికాగోష్టిలో చెప్పారు. ఇదిలా ఉండగా దక్షిణ మెక్సికోలో,గౌతమాలా,ఎల్‌సాల్వడార్‌లలో దీంతో పసిఫిక్‌లోని కొన్ని ప్రాంతాలలో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఎల్‌సాల్వడార్‌లో కూడా తీవ్ర ప్రకంపనలు సంభవించాయి.

## రాజకీయాల్లోంచి తప్పుకుంటా

(3వ పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో శక్తి వంచన లేకుండా పనిచేశామన్నారు. ఉద్యోగాల విషయంలో 95 శాతం రిజర్వేషన్ల కోసం రెండేళ్ల పాటు ఫైలు పెండింగ్‌లో పెట్టారని, ఈ విషయంపై ప్రధాని మోదీని కలిసిన కెసిఆర్‌ను రాష్ట్రం దేశంలో ఉందనుకుంటున్నారా, లేక మీది సపరేటు దేశం అనుకుంటున్నారని ప్రశ్నించారని, తమ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నదే నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పి సాధించుకోవడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కొన్ని పొరపాట్లు జరిగాయన్నారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ అయింది. లీక్ వీరులను కాంగ్రెస్, బిజెపి పట్టుకోలేదు, మీడియా కూడా పట్టుకోలేదు, బిఆర్‌ఎస్ ప్రభుత్వమే పట్టుకుందని, వాళ్ళని కూడా ప్రభుత్వం శిక్షించిందని కెటిఆర్ చెప్పుకొచ్చారు. బిఆర్‌ఎస్ పాలనలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇచ్చామని, 24 లక్షల ప్రైవేటు ఉద్యోగాలు వచ్చాయని వెల్లడించారు. శనివారం రాకెట్ ప్రయోగించిన స్కైరూట్ టిహబ్‌లోనే పురుడుపోసుకుందని కెటిఆర్ అన్నారు. ఖాళీగా ఉన్న 20వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయాలని దిల్‌సుఖ్‌నగర్ నిరుద్యోగలు ఉద్యమిస్తే... ఏ డ్రిన్ తాగి సచ్చినా, బావిలోపడి సచ్చినా ఇవ్వనుగాక ఇవ్వనని రేవంత్ రెడ్డి అంటున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. కెసిఆర్ 48 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చినప్పుడు, మీరు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. 'రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డికి డెత్ డిక్లరేషన్ రాయాలి. యూత్ డిక్లరేషన్ పేరిట మోసం చేసిన కాంగ్రెస్ నేతలకు డెత్ డిక్లరేషన్ ఇవ్వాలి. యువతరంతో పెట్టుకుంటే తరాలపాటు పుట్టగతులు లేకుండా పోతారు. రాహుల్‌కు మన భాష రాదు, మన బాధ తెలవదు. యూత్ డిక్లరేషన్‌లో రాహుల్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? తెలంగాణలో నోటిఫికేషన్లు లేవు, లూటిఫికేషన్లే ఉన్నాయి. యువతకు జాబులు లేవు. రాహుల్‌గాంధీ జేబులే నిండుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాహుల్‌గాంధీ జేబు నింపుతున్నారు' అని కెటిఆర్ మండిపడ్డారు.

## అనుమానాలు

(3వ పేజీ తరువాయి)

ప్రదేశం నుండి బలవంతంగా తరలించాలని ఆదేశించలేదన్నారు. అయితే తాజా పరిణామాలు ప్రభుత్వ ఉద్దేశాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆకస్మికంగా మార్చడం, ఆ తర్వాత శాంతియుత ఉద్యమంపై ఈ అణచివేత చర్యలు చేపట్టడం, పెరుగుతున్న విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసి, 20న పార్లమెంటుకు ప్రతిపాదిత యాత్రను అడ్డుకోవడమే లక్ష్యమనే అనుమానాలను మరింత బలపరిచాయని డి. రాజా తెలిపారు. శాంతియుత ప్రజాస్వామ్య నిరసనలపై ఇటువంటి పెత్తందారీతనానికి రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో చోటు లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే తన అణచివేత విధానాన్ని విడనాడి, శాంతియుత నిరసనకారులందరి ప్రజాస్వామ్య హక్కులు, భద్రతను కల్పించి, విద్యార్థి ఉద్యమంతో అర్థవంతమైన సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు. పదేపదే పరీక్షలు విఫలమవడానికి ప్రభుత్వం వహించాల్సిన బాధ్యతను ఎలాంటి బలప్రయోగం చెరిపివేయలేదన్నారు. న్యాయం కోసం చేస్తున్న డిమాండ్‌ను లాఠీఛార్జ్ చేసి అణచివేయలేరని, దేశ పరీక్షా వ్యవస్థ కుప్పకూలడానికి నైతిక, రాజకీయ బాధ్యతను అంగీకరిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ తన డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తోందని డి. రాజా పేర్కొన్నారు.

## 'కమిటీ కుర్రోళ్లు'

(3వ పేజీ తరువాయి)

విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వాళ్లకు అవార్డులు ప్రదానం చేస్తారు.

అవార్డుల జాబితా

ఉత్తమ తెలుగు చిత్రం : కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ పాపులర్ చిత్రం : కల్కి 2798 ఏడీ
ఉత్తమ బాలల చిత్రం : 35 చిన్న కథ కాదు
ఉత్తమ మేకప్ : పి.రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)
బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ (ఒరిజనల్): సుకుమార్ (పుష్ప2)
బెస్ట్ డైలాగ్ రైటర్ : వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ : దీపాలి నూర్, శీతల్ శర్మ (పుష్ప2)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ : నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2798 ఏడీ)
ఉత్తమ చిత్రం : ఆర్టికల్ 370
ఉత్తమ నటుడు : మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్ (ఇద్దరికీ)
ఉత్తమ నటి : యామీ గౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకుడు : రాజ్‌కుమార్ పెరియస్వామి (అమరన్)
ఉత్తమ నేపథ్య గాయని : వైకోం విజయలక్ష్మి (ఎఆర్‌ఎం)
ఉత్తమ నేపథ్య గాయకుడు : అభయ్ జోధ్ పుర్కర్
బెస్ట్ సినిమాటోగ్రఫర్ : జలాల్ (భ్రమయుగం)
ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం : కెప్టెన్ మిల్లర్ (తమిళం)
బెస్ట్ ఎడిటర్ : కలైవన్నన్ (అమరన్)
బెస్ట్ సౌండ్ డిజైనర్ : మానస్ చౌదరి (భూల్ బులియా)
బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ : యోగేశ్ దేశ్‌పాండే
ఉత్తమ పాటల రచయిత : మనోజ్ ముంతాసిర్ (మైదాన్)
ఉత్తమ నేపథ్య సంగీతం : జివి ప్రకాశ్ కుమార్ (అమరన్)
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు) : శశ్వంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ తమిళ చిత్రం : రాయన్
ఉత్తమ మలయాళ చిత్రం : ఫెమినిస్ట్ ఫాతిమా
ఉత్తమ కన్నడ చిత్రం : మిథ్య (ఇల్యూజన్)
ఉత్తమ హిందీ చిత్రం : శ్రీకాంత్
ఉత్తమ గుజరాతీ చిత్రం : మారన్ (ద హంట్)
ఉత్తమ బెంగాలీ చిత్రం : చల్‌చిత్ర ఎఖో
బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ : సంజీవ్ శ్రీవాస్తవ (హిందీ)
సినిమాలపై ఉత్తమ పుస్తక రచయిత : ప్రదీప్‌కుమార్ శెట్టి (కన్నడ)
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ ద చోలా డోరా ఔర్ సూయి
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ భద్రకాళి నాటకం
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ స్క్రిప్ట్ ఓబుర్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ సినిమాటోగ్రఫీ లైవ్ ఇన్ లూమ్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డైరెక్షన్ ఆనంద్ రాయ్ (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డాక్యుమెంటరీ రామ్ నమీ
స్పెషల్ మెన్షన్ మేయళగన్ (తమిళం)
స్పెషల్ మెన్షన్ తమిళ చిత్రం కెప్టెన్ మిల్లర్ (ధనుష్)




## నిర్బంధాలు ఆపాలి

(3వ పేజీ తరువాయి)

సాంప్రదాయ హక్కులను కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ పేరుతో ఆదివాసీలను వారి పురిటిగడ్డ నుండి దూరంచేసే ఏ ఒక్క చర్యను కూడా సహించేది లేదని హెచ్చరించారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే హక్కుల సాధన కోసం యువత పెద్ద ఎత్తున కదలాలన్నారు. భవిష్యత్‌లో గిరిజన ఐఖ్యతను చాటే విధంగా మరిన్ని ఉమ్మడి ఉద్యమాలను ఉధృతం చేస్తామని చేశారు.

**అణిచివేతలపై ఉద్యమించక తప్పదు : కూనంనేని**

అడవిపై ఆధారపడి బతుకుతున్న గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని, ఇలాంటి అణిచివేతలపై ఉద్యమించక తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. తరాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. పాలకుల అణిచవైత వైఖరిపై ఐఖ్య ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ మహాసభల ద్వారా గిరిజన సమస్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించి రాబోయే రోజుల్లో బలమైన పోరాటాలు నిర్మిస్తామన్నారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులను ఇతర రంగాలకు మళ్లించడాన్ని తక్షణమే ఆపాలని, జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసారు. అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తాము ఎల్లవేళలా ముందుంటామని శాసన సభ లోపల వెలుపల వారి గొంతుకగా నిలబడతానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కొండంత అండగా ఉన్న ఉపాధి హామీ పథకం పేరు మార్చి దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికల్పనను దెబ్బతీసే ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలునిచ్చారు. ఉపాధిహామీ నిధులను తగ్గించడం వల్ల వలసలు పెరిగిపోయే ప్రమాదం ఉందని, స్థానికంగానే పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఐటిడిఏల పనితీరును మెరుగు పరచాలని స్థానిక సంస్థలకు నిధులు విధులను బదిలీ చేయాలని కోరారు. అటవీహక్కుల చట్టం2006ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పోడుభూముల సమస్యను శాశ్వత పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలందరినీ ఏకం చేసి హక్కుల సాధన కోసం అతిపెద్ద జాతీయ ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం అనీ రాజా, కూనంనేని బంజార సంప్రదాయ బిందెలను నెత్తిన ఎత్తుకున్నారు. ఇందులో భాగంగా అనీరాజా బంజారా మహిళా వస్త్రధారణకు చెందిన చెంగును నెత్తిన వేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రమావత్ అంజయ్య నాయ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మునిస్పల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాధం కల్లూరి వెంకటేశ్వరు నరాటి ప్రసాద్ సరెడ్డి పుల్లారెడ్డి ఎస్‌డి సలీం సలిగంటి శ్రీనివాస్ మున్నా లక్ష్మీ కుమారి జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు వాసిరెడ్డి మురళీ ఉప్పుశెట్టి రాహూల్ ముప్వా వెంకటేశ్వర్లు రేసు ఎల్లయ్య గిరిజన సమాఖ్య నాయకులు జువారి రమేష్ నాయక్ స్వరూప సొందు కుటుంబ రావు భూక్య శ్రీనివాస్ బి వెంకట్ బానోత్ రాంబాబు గణేష్ వివిధ జిల్లాల ప్రతినిధులు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులురులు పాల్గొన్నారు.

## 70వేల ఉద్యోగాలు

(3వ పేజీ తరువాయి)

ఏడాది కాలంలోనే ఎల్‌బి స్టేడియం, శిల్పారామంలో తల్లిదండ్రుల సాక్షిగా 70 వేల మందికి ఉద్యోగాలచ్చామన్నారు. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని వరస నోటిఫికేషన్లతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో అందెశ్రీ జయంతి సందర్భంగా రూ 3.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతివనానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. బిఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకివ్వలేదని సింఎం రేవంత్ ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు మాత్రం కోట్లు దోచుకునేందుకు రాజకీయ పదవులతో కూడిన ఉద్యోగాలిచ్చారన్నారు. ఒక పక్క గ్రూప్ పరీక్షలు నిర్వహించి ప్రశ్నాపత్రాలను జిరాక్స్ సెంటర్లలో పల్లి, బఠానీల్లా దొడ్డిదారిలో అమ్మి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని దుయ్యబట్టారు.

**అందెశ్రీ స్ఫూర్తే తమ ప్రభుత్వానికి శ్రీ రామరక్ష :** ప్రజా కవి అందెశ్రీ గానాలు తనలో స్ఫూర్తి నింపాయని, అవే తమ ప్రభుత్వానికి శ్రీ రామరక్ష అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నాటి బిఆర్‌ఎస్ పాలనలో నిర్బంధానికి గురైన అందెశ్రీ జయజయహే గీతం తెలంగాణా రాష్ట్ర గీతంగా చేర్చామన్నారు. పెన్నుల మీద మన్ను కప్పితే అవి గన్నులై మొలకెత్తినట్లు ఆ నిర్బంధం నుండి తెంచుకుని ప్రతి గుడిలో, ప్రతి బడిలో అందెశ్రీ పాట వినిపిస్తుందన్నారు. కేవలం దళితుడన్న భావంతోనే కెసిఆర్ అందెశ్రీ పాట, మాటను నిర్బంధించారన్నారు. అయినప్పటికీ ఆయన ఆత్మగౌరవంతో దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పారన్నారు. ప్రజాగాయకుడు గద్దర్‌ను ప్రగతి భవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టి కెసిఆర్ అవమానించారన్నారు.

**కుటుంబం మొత్తానికి ఫామ్‌హౌస్‌లే :** తెలంగాణ సెంటిమెంట్‌తో పదేళ్ల పాటు అధికారం చెలాయించిన కెసిఆర్ కుటుంబమంతా లక్షల కోట్లు గడించటానికే ఆలోచించారే తప్ప ఏనాడూ ఏ కోణంలోనూ ప్రజల గురించి పట్టించుకున్న పాపానికి పోలేదని సిఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కెసిఆర్ 100 ఎకరాల్లో , కెటిఆర్ 100 ఎకరాల్లో, హరీష్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారన్నారు. పాస్‌పోర్టు బ్రోకర్ కెసిఆర్ సిఎంగా, అమెరికాలో దొడ్లు కడిగే కెటిఆర్‌కు మంత్రి పదవులు అనుభవించారన్నారు. తెలంగాణాకు రూ. 8 లక్షల కోట్లు అప్పు మిగిల్చిన కెసిఆర్ కుటుంబం మాత్రం నిజాంల కంటే ఆస్తిపరులు ఎలా అయ్యారని సిఎం ప్రశ్నించారు. కెసిఆర్‌ను ఆయన ఫామ్‌హౌస్‌లోనే సమాధి చేస్తామన్నారు. ఇకపై దోచుకుంటామంటే రానివ్వమని, రాష్ట్రం తులసి వనమని, గంజాయి మొక్క ల్లాంటి కెసిఆర్ కుటుంబాన్ని మరో సారి కెసిఆర్ మొలకెత్తకుండా చూస్తానన్నారు.

## సోనమ్ తరలింపు

(3వ పేజీ తరువాయి)

నిరాహారదీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త ఆరోగ్యం క్షీణించడంపై ఆయనను అక్కడి నుంచి తరలించే క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించాడన్ని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి), ఆప్ ఇతర ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ చర్య ప్రజాస్వామ్యానికి మాయమచ్చ అని అభివర్ణించాయి. కాగా, అభిజీత్ దీప్కే ప్రసంగిస్తున్న సమయంలో ఆయనపై ఓ మహిళ సిరా లాంటి ద్రవాన్ని విసిరింది. దీంతో మరో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనతో మద్దతుదారులు వేదిక వైపు దూసుకురావడంతో కార్యక్రమానికి కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది, దీంతో గందరగోళం చెలరేగింది. దీక్షను అడ్డుకోవడంపై వామపక్ష విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. ముంబాయిలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, నిపుణులైన వైద్యుల సలహా, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అవసరమైన వైద్య సంరక్షణ కోసం వాంగ్‌చుక్‌ను తరలించినట్లు ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ దీక్ష వల్ల ఆయన బలహీనపడ్డారని, ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, శరీరంలోని కీలక ఆరోగ్య సూచికలను సాధారణ స్థితికి తీసుకురావడానికి నిరంతర పర్యవేక్షణ, చికిత్స అవసరమని ఒక అధికారి తెలిపారు. కాగా, పోలీసుల చర్య తర్వాత, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్పందిస్తూ, నిరసనకారులపై పోలీసులు కఠిన చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు తనపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారని దీప్కే ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను ఫ్రెష్ అయ్యేందుకు ఒక స్నేహితుడి ఇంటికి వెళ్లినప్పుడు పోలీసులు తనను కొట్టారని, కొంతసేపు అదుపులో ఉంచారని దీప్కే ఆరోపించారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, ఎఐఎస్‌ఎ సభ్యులైన నేహా, అమీన్, మనీష్ 21వ రోజున కూడా నిరసన స్థలంలో తమ నిరాహార దీక్షను కొనసాగించారు.

**నా అనుమతి లేకుండా ఏ చికత్సా చేయవద్దు : వాంగ్‌చుక్ సతీమణి**

పోలీసుల తీరుపై సోనమ్ సతీమణి గీతాంజలి జె ఆంగ్మో తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్స చేయకూడదని హెచ్చరించారు. 'ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతి లేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతి ఒక్కరిని బాధ్యులను చేస్తా. ఆయన శుక్రవారం బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీల్లేదు. అది మా హక్కు' అని సోనమ్ సతీమణి గీతాంజలి మీడియాకు స్పష్టంచేశారు.

**ఉద్యమం ఆగదు : అభిజీత్ దీప్కే**

జంతరమంతర్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకుని సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం నాడు నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. తమ ఉద్యమం ఆగదన్నారు. పోలీసుల చర్య అనంతరం, యువత నేతృత్వంలోని ఈ సంస్థ తమ ఆందోళనను తీవ్రతరం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 20న తాము తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేసింది. వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన తర్వాత, తాను నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభిస్తున్నానని దీప్కే ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో, 'మోదీ రాజీనామా చేయాలి!' అంటూ సిజెపి తమ నిరసన తీవ్రతను పెంచింది. ఢిల్లీ పోలీసులు వాంగ్‌చుక్ పట్ల దురుసుగా ప్రవర్తించి, బలవంతంగా తొలగించారని, ఈ ఆపరేషన్ సమయంలో కొందరు నిరసనకారులపై దాడి జరిగిందని సిజెపి ప్రతినిధి అశుతోష్ రాంకా ఆరోపించారు. ఉదయం, నిరసనకారులు స్నానం చేసి, సేదతీరడానికి 10–15 నిమిషాల విరామం తీసుకుంటారని, ఆ సమయంలో ఢిల్లీ పోలీసులు ఈ పిరికిపంద చర్యకు పాల్పడ్డారన్నారు. ఇప్పుడు అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష ప్రారంభించారని, ఇక తాము ఇక్కడి నుండి కదలమని తేల్చి చెప్పారు. 20న, పార్లమెంట్ వరకు జరిగే యాత్రలో తమతో చేరాలని, ఇది దేశాన్ని కాపాడే పోరాటమని, మనం వెనక్కి వెళ్లకూడదని రాంకా పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సాగుతున్న శాంతియుత నిరసనలపై ఢిల్లీ పోలీసు చర్యపై విపక్షాలు భగ్గుమన్నాయి. నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త ఆరోగ్యం క్షీణించడంపై ఆయనను అక్కడి నుంచి తరలించే క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించాడన్ని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి), ఆప్ ఇతర ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ చర్య ప్రజాస్వామ్యానికి మాయమచ్చ అని అభివర్ణించాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వ మూల సూత్రాలు అసత్యం, హింస అని ఎక్స్ వేదికగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. పరీక్షా పత్రాల లీకేజీలు, పెరుగుతున్న విద్యా వ్యయం, విద్యార్థుల ఆత్మహత్యలు భారతదేశ భవిష్యత్తుకు సంబంధించిన కీలక సమస్యలని రాహుల్ పేర్కొన్నారు. బిజెపిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని, అత్యంత ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజాస్వామ్య విరుద్ధమైన రాజకీయ పార్టీ పాలించడం సిగ్గుచేటన్నారు. కోటా, డెహ్రాడూన్ నుండి 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గొంతుక) వినిపించడం మొదలైందని, అది కచ్చితంగా ఢిల్లీ గడప వరకు చేరుతుందని ఆయన అన్నారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా, శాంతియుత నిరసనలను కేంద్రం అణచివేస్తోందని ఆరోపిస్తూ, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేలపై పోలీసుల చర్యను సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఖండించారు. ఆరోపిత పేపర్ లీక్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని బేబీ ఎక్స్‌లో తీవ్రంగా విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విమర్శించింది. బలప్రయోగానికి బదులుగా కేంద్రం ఆయనతో చర్చలు జరిపి ఉండాల్సిందని పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు ఆసుపత్రికి తరలించడాన్ని ఎన్‌సిపి (ఎస్‌పి) విమర్శించింది. ఈ చర్య ప్రజాస్వామ్య అసమ్మతిని అణచివేయడమేనని, ఇది ప్రభుత్వ నిరంకుశ మనస్తత్వాన్ని చూపిస్తోందని పేర్కొంది. సోనమ్ డిమాండ్లను సరిగా పరిగణనలోకి తీసుకోకుండా ఆసుపత్రికి తరలించడం 'తీవ్ర ఆందోళనకరం' అని అన్నారు. ప్రభుత్వానికి పౌరుల ప్రాణాలపై విలువ లేదని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న యువతతో చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరారు.

# కామన్వెల్త్ క్రీడలకు 126 మంది

### భారత పతాకధారులుగా లొవ్లీనా, మీరాబాయి..!



ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడలకు మరో ఐదు రోజుల్లో తెరలేవనుంది. గ్లాస్గో వేదికగా జరుగనున్న ఈ విశ్వక్రీడలల్లో భారత బృందాన్ని ఒలింపిక్ విజేతలు మీరాబాయి చాను, లొవ్లీనా బొర్గొహైన్‌లు నడిపించనున్నారు. జూలై 23, గురువారం మొదలయ్యే ఆరంభ వేడుకలో మీరాబాయి, లొవ్లీనాలు 126 మందితో కూడిన భారత బృందానికి నాయకత్వం వహించనున్నారు. అంటే.. వీరు పతకధారులుగా వ్యవహరించనున్నారు. భారత ఒలింపిక్ సంఘం ఈ విషయాన్ని శనివారం అధికారికంగా వెల్లడించింది. కామన్వెల్త్ క్రీడలకు భారత బృందం సిద్ధమవుతోంది. స్కాట్లాండ్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి 126 మంది ఎంపికవ్వగా.. ఈ బృందానికి ఒలింపిక్ విజేతలు మీరాబాయి చాను, లొవ్లీనా బొర్గొహైన్‌లు సారథ్యం వహించనున్నారు. జూలై 23, గురువారం జరిగే ఆరంభ వేడుకల్లో.. వీరిలో ఒకరు మువ్వన్నెల జెండాను చేతబూని.. మరొకరు కామన్వెల్త్ క్రీడా జ్యోతిని పట్టుకొని సగర్వంగా నడుస్తారని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష పేర్కొంది. 'గ్లాస్గోలోని ఓవో హైడ్రో స్టోర్స్ అరీనాలో జరుగనున్న ఆరంభ వేడుకల్లో మీరాబాయి, లొవ్లీనాలు భారత ప్రతినిధులుగా వ్యవహరించనుండడం ఎంతో గర్వపడాల్సిన విషయం. వీరితో పాటు భారత బృందానికి ఆల్ ది బెస్ట్' అని ఉష వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన మీరాబాయి.. ఈసారి కామన్వెల్త్ క్రీడల్లో మహిళల 48 కిలోల విభాగంలో పోటీపడనుంది. టోక్యో విశ్వక్రీడల్లోనే కంచు మోత మోగించిన లొవ్లీనా.. గ్లాస్గోలో మాత్రం 75 కిలోల విభాగంలో తలపడనుంది. గ్లాస్గోలో మొత్తంగా.. బాస్కెట్ బాల్(3స3) వీల్ ఛెయిర్ విభాగంలో.. నలుగురు, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో ఎనిమిది మంది పాల్గొననున్నారు. అథ్లెటిక్స్ విషయాని కొస్తే.. ట్రాక్ ఈవెంట్లలో 14 మంది. ఫీల్ విభాగంలో.. 18 మంది బరిలో ఉన్నారు. పారా అథ్లెట్లలో.. ట్రాక్ అండ ఫీల్డ్ 11 మంది పోటీ పడుతున్నారు.

**లాన్ బౌల్స్** – ఆరుగురు
**బాక్సింగ్** – 14 మంది
**జూడో** – 14 మంది
**పారా పవర్‌లిఫ్టింగ్** – ఏడుగురు
**స్విమ్మింగ్** – ఐదుగురు
**పారా స్విమ్మింగ్** – ఐదుగురు
**ట్రాక్ సైక్లింగ్** – ఆరుగరు
**పారా ట్రాక్ సైక్లింగ్** – లిషా దాస్ (మహిళల విభాగం)
**వెయిట్‌లిఫ్టింగ్** – 12 మంది.

## తొలి ఫైనల్‌కు సింధు



### రెండేళ్ల టైటిల్ కరువు తీరేనా !

ఒలింపిక్ విజేత పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణ ఫలించింది. వరసగా నిరాశ పరుస్తున్న తెలుగుతేజం జపాన్ ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టింది. లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టిలు తేలిపోయిన చోట భారత పతకం ఆశలు మోస్తున్న సింధు సెమీఫైనల్లో అదిరే విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. సెమీస్‌లో చెన్ యూఫీని చిత్తు చేసి ఈ మెగా టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. అంతేకాదు ఈ మధ్య కాలంలో పరాజయాలతో విసిగిపోయిన భారత షట్లర్ 2024 తర్వాత తొలి ఫైనల్ ఆడబోతోంది. మహిళల సింగిల్స్‌లో ఒకప్పటిలా టైటిళ్లు గెలవలేకపోతున్న పీవీ సింధు ఎట్టకేలకు ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ రెండేళ్ల కాలంలో అయితే.. క్వార్టర్స్ లేదంటే తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సింధు జపాన్ ఓపెన్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. శనివారం జరిగిన సెమీస్‌లో చెన్ ఫీ(చైనా)పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించింది. మొదటి సెట్‌ను 21–19తో గెలుచుకున్న సింధు.. రెండో సెట్‌లోనూ జోరు చూపించింది. 15–10తో భారత షట్లర్ ఆధిక్యంలో ఉండగా చెన్ కండరాల గాయంతో ఇబ్బంది పడింది. తాను ఆట కొనసాగించలేకపోవడంతో తెలుగు తేజం ఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైంది సింధు. 'ఫైనల్‌కు చేరడం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో ప్రతి మ్యాచ్‌ను చాలా ముఖ్యమైనదిగా భావించాడు. ఈరోజు మ్యాచ్ మరింత కీలకం కాబట్టి.. మొదటి నుంచి ఫోకస్‌గా ఆడాను. ఎందుకంటే.. టాప్ ర్యాంకర్లను ఓడించాలంటే ప్రతి పాయింట్ చాలా ముఖ్యం' అని ఆమె పేర్కొంది. రెండో సెమీఫైనల్ ఆడనున్న అకనే యమగుచి(జపాన్), పుత్రి కుసుమ వర్ధానీ(ఇండోనేషియా)లలో ఒకరిని ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో సింధు ఢీకొట్టనుంది.

## హసికాకు రజతం

భారత యువ రెజ్లర్ హసికా లాంబా బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో రజతంతో మెరిసింది. 19 ఏండ్ల ఈ హర్యానా అమ్మాయి.. శుక్రవారం జరిగిన మహిళల 55 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్లోతడబడి స్వర్ణాన్ని కోల్పోయింది. ఫైనల్‌లో ఆమె.. 05తో ఉక్రెయిన్‌కు చెందిన నటాలియా క్లివ్చుస్క చేతిలో ఓడి రెండోస్థానంలో నిలిచింది. అంతకుముందు సెమీస్‌లో హసికా.. 107తో అనస్టేసియా బ్లావెస్ (జర్మనీ)పై గెలిచి పతక పోరుకు అర్హత సాధించింది.



## బిజినెస్


### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 77,569.39 పాయింట్లు. ముగింపు 78,151.54 పాయింట్లు. లాభం 582.15 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,206.90 పాయింట్లు. ముగింపు 24,334.30 పాయింట్లు. లాభం 127.40 పాయింట్లు.

## కొనుగోళ్లకు ఊతం!

ఈ వారం భారతీయ స్టాక్ మార్కెట్ సానుకూల ధోరణితో ముగిసింది. వారాంతంలో కొనుగోలు ఆసక్తి పెరగడం, ఐటి, బ్యాంకింగ్ రంగాల్లో బలమైన కొనుగోళ్లు నమోదవడం, ప్రముఖ కంపెనీల త్రైమాసిక ఫలితాలపై పెట్టుబడిదారుల్లో ఆశావహ భావన నెలకొనడం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా ఐటి కంపెనీలు ప్రకటించిన మెరుగైన ఆర్థిక ఫలితాలు, ఆర్థిక రంగ షేర్లలో కనిపించిన కొనుగోళ్లతో సూచీలు వారాంతంలో ఉత్సాహాన్ని ప్రదర్శించాయి. అదే సమయంలో విదేశీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల కదలికల కారణంగా పెట్టుబడిదారులు పూర్తిగా దూకుడుగా వ్యవహరించకుండా అప్రమత్తతను కూడా కొనసాగించారు. ఈనెల 20 నుంచి 24 వరకు కొనసాగే వచ్చే వారంలో మార్కెట్ దిశను ప్రధానంగా



త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రభావితం చేసే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రిలయన్స్ వంటి భారీ కంపెనీల ఫలితాలు మార్కెట్‌కు కీలక సంకేతాలుగా మారనున్నాయి. ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేదా అంతకంటే మెరుగ్గా వస్తే కొనుగోళ్లకు మరింత ఊతం లభించే అవకాశం ఉంది. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ మార్కెట్ల ధోరణి, అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు, ముడి చమురు ధరల కదలికలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయి. మొత్తంగా చూస్తే సమీప కాలంలో మార్కెట్ సానుకూల పక్షపాతంతోనే కొనసాగినా, మధ్య మధ్యలో లాభాల స్వీకరణ కారణంగా స్వల్ప హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ



భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) దేశంలో తొలిసారిగా రూ. 10, రూ. 20 విలువ కలిగిన పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న కాగితపు నోట్లకు ప్రత్యామ్నాయంగా ఈ నోట్లను పైలట్ ప్రాజెక్టు రూపంలో ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో విడుదల చేయనున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, భవిష్యత్తులో ఇతర విలువల నోట్లకూ విస్తరించే అవకాశాన్ని పరిశీలిస్తారు. పాలిమర్ నోట్లు ప్రత్యేకమైన ప్లాస్టిక్ పదార్థంతో తయారవుతాయి. ఇవి సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. నీరు, తేమ, దుమ్ము, మురికి వంటి ప్రభావాలు వాటిపై తక్కువగా ఉంటాయి. ఫలితంగా, నోట్లు త్వరగా చిరిగిపోవడం లేదా పాడవడం తగ్గుతుంది. అలాగే ప్రత్యేక భద్రతా లక్షణాలు ఉండటంతో నకిలీ నోట్ల తయారీని అరికట్టడంలో కూడా ఇవి ఉపయోగపడతాయని ఆర్‌బిఐ భావిస్తోంది. మన దేశంలో కరెన్సీ నోట్ల ముద్రణ, వాటి నిర్వహణపై ప్రతి ఏడాది భారీ వ్యయం అవుతోంది. పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం చలామణిలో ఉండటం వల్ల కొత్త నోట్ల ముద్రణ అవసరం తగ్గి, దీర్ఘకాలంలో ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్, సింగపూర్ సహా అనేక దేశాలు పాలిమర్ కరెన్సీని విజయవంతంగా ఉపయోగిస్తున్నాయి. భారతదేశంలో కూడా ఈ ప్రయోగం విజయవంతమైతే, కరెన్సీ వ్యవస్థ మరింత మన్నికైనది, సురక్షితమైనది మరియు సమర్థవంతమైనదిగా మారే అవకాశాలు ఉన్నాయి.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
**24 క్యారెట్లు:** రూ. 1,43,280
**22 క్యారెట్లు:** రూ. 1,31,340
**18 క్యారెట్లు:** రూ. 1,06,900.
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## పెరుగుతున్న ముడి చమురు ధరలు



అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు నిరంతరంగా పెరుగుతున్నాయి. అమెరికా సైన్యం ఇరాన్‌కు చెందిన వ్యూహాత్మక లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తుండగా, హోర్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో భద్రతా ఆందోళనలు పెరిగాయి. ఈ పరిస్థితుల కారణంగా ఆ ప్రాంతంలో వాణిజ్య నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. హోర్ముజ్ జలసంధి ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలక మార్గం. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గంలో రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు ఐదో వంతు ఈ మార్గం ద్వారానే వెళ్తుంది. ఇక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో చమురు సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందన్న భయంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరుగుతున్నాయి. చమురు ధరల పెరుగుదల ప్రభావం భారత్ వంటి దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలపై కూడా పడే అవకాశం ఉంది. ముడి చమురు ఖరీదు పెరిగితే పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలపై ఒత్తిడి పెరగవచ్చు. అలాగే రవాణా వ్యయం పెరగడం వల్ల ద్రవ్యోల్బణం కూడా అధికమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లు అమెరికా–ఇరాన్ పరిణామాలను అత్యంత నిశితంగా గమనిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు మరింత తీవ్రమైతే చమురు ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, దౌత్యపరమైన చర్చలు ప్రారంభమై ఉద్రిక్తతలు తగ్గితే మార్కెట్లలో స్థిరత్వం తిరిగి నెలకొనే అవకాశముంది.

## మోదీ పాలనలో కుప్పకూలుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ




### 2040 వరకు దేశం అభివృద్ధి చెందకపోతే ఇక అన్ని రంగాల్లో అంధకారమే

### ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు డాక్టర్ పరకాల ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, తలసరి ఆదాయంలో ఆఫ్రికా దేశాలకంటే వెనుకబడి ఉన్నామని, దీనితోపాటు నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల భారీ పెరుగుదల వలన సామాన్యుల నడ్డివిరుగుతుందని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్ 2040 సంవత్సరం వరకు దేశం అభివృద్ధి చెందకపోతే, ఇక ఎప్పటికీ అభివృద్ధి చెందే అవకాశమే లేదన్నారు. 57వ బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) ఆధ్వర్యంలో 'భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లుప్రాధాన్యత' అనే అంశంపై రాష్ట్ర సదస్సు హైదరాబాద్ గన్ ఫౌండ్రిలోని పర్వాన హాల్‌లో శనివారం జరిగింది. సదస్సుకు ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు బి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. తొలుత ఎఐబిఇఎ జాతీయ అధ్యక్షుడు బి.ఎస్.రాంబాబు స్వాగతం పలుకగా డాక్టర్ పరకాల ప్రభాకర్ ప్రసంగించారు. బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు సహా అన్ని రంగాల కార్మికులు పరస్పర సంఘీభావంతో పనిచేస్తేనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు, సామాజిక భద్రత, ట్రేడ్ యూనియన్ రక్షణ వంటి హక్కులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకుల జాతీయకరణ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు కార్మిక సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎపిటిబిఇఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ భాస్కర్, సమద్ ఖాన్,జె. జానకిరామ్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం / కౌటాల/ కాగజ్ నగర్ :** ప్రజలకు, రైతాంగానికి పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యమైన తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ, జలసాధన సమితి తదితర వామపక్షాల ముఖ్య నాయకుల బృందం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి అత్యంత తక్కువ ఖర్చుతో సాగునీరు అందించాలనే గొప్ప లక్ష్యంతో ఈ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత బిఆర్ఎస్) అధినేత కెసిఆర్ సైతం తానే స్వయంగా ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని అయినా ప్రాజెక్టును పూర్తి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ సెంటిమెంట్ తో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పటికీ, ఆహామీని పక్కనబెట్టి ఈ ప్రాజెక్టును ఎందుకు నిలిపివేశారో ప్రజలకు సమాధానం చెప్పలేకపోయారని మండిపడ్డారు. కేవలం వ్యయం, ఖర్చులు పెంచుకోవడం కోసం రీడిజైనింగ్ పేరుతో కొత్త తరహాలో ప్రాజెక్టును వేగతరం చేసి మూడేళ్లలో నిర్మించారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం ఎంత వేగంగా పూర్తి చేశారో, అంతే వేగంగా నష్టం జరిగిందని, ప్రజాధనం పూర్తిగా దుర్వినియోగం అయిందని ఆరోపించారు. దీనివల్ల ఇప్పుడు రైతాంగానికి నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని




ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కట్టిన ప్రాజెక్టు కూడా భారీ ఖర్చుతో కూడుకున్నదని, ప్రతి ఏటా దానికోసం ప్రభుత్వం అప్పులు తెచ్చి ఖర్చులు పెట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అనేది పూర్తిగా గ్రావిటీ లైన్ అని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి బాధ్యత ఉందని స్పష్టం చేశారు. స్వతంత్రం వచ్చిన అనంతరం ఎక్కువ సార్లు పరిపాలించిన బాధ్యత ఆపార్టీకి ఉందని, తెలంగాణకు గుండెకాయ లాంటి ఈ ప్రాజెక్టు ద్వారా తక్కువ ఖర్చుతో రైతాంగానికి సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా గత ప్రభుత్వం అక్కడ నిర్మాణం చేపడితే, ఇప్పుడున్న ప్రజా ప్రభుత్వం దానికి పట్టిన ఇబ్బందులను, లోపాలను రిపేర్ చేయడానికి కూడా సాహసం చేయడం లేదని విమర్శించారు. యుద్ధప్రాతిపదికన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి రైతాంగాన్ని ఆదుకుంటే ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న చెడ్డ పేరు పోయే అవకాశం ఉంటుందని హితవు పలికారు. లేనిపక్షంలో ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించి గత ప్రభుత్వం ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొని ఓడిపోయిందో, ఇప్పుడు కూడా అదే స్థితి పునరావృతమవుతుందని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు లేకపోయి నా నీటి లభ్యత ఉందని, తక్కువ వ్యయంతో ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే ఈ ప్రాజెక్టుపై ప్ర భుత్వం తక్షణమే స్పందించి వేగంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీల న కార్యక్రమంలో సిపిఐ జి ల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, మేకల దాసు, చిరంజీవి, సిపిఎం నాయకులు గోమాస ప్రకాష్, కోట శ్రీనివాస్, ఆనం ద్ కుమార్, న్యూ డెమోక్రసీ ప్రతినిధులు టి శ్రీనివాస్, లాల్ కుమార్, చాంద్ పాషా, శ్రీనివాస్, అందే మంగ, జలసాధన సమితి నాయకులు నైనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

### ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారే శివశంకర్




**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ వెంటనే రాజీనామా చేయాలని ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండు చేశారు. శనివారం చారగొండ మండల కేంద్రంలోని హమాలీ కార్మికుల, సిరసనగండ్ల గ్రామంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొని భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు పొట్టగొడుతున్నారని కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు అసంఘటిత రంగ కార్మికులకు చాలా రకాలుగా బెనిఫిట్స్‌ను రద్దు చేసే విధంగా ఉన్నాయన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చడం కోసం ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి తప్ప కార్మిక వర్గానికి ఎలాంటి ఉపయోగం లేదన్నారు. 1886 మే 1న ఆవిర్భవించిన ఎఐటియుసి కార్మిక సంఘం దేశంలోని మొట్ట మొదటి కార్మిక సంఘంగా అవతరించి భారతదేశంలో అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి 44 చట్టాలను సాధిస్తే ఇప్పుడు ఉన్న కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇంతవరకు పర్మినెంట్ చేయాలేదన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామాజిక వేత్త సోనం వాంగ్ చుక్ నేటికీ 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాజీనామా చేయకుండా నీట్ విద్యార్థుల జీవితాలలో చెలగాటమాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఎన్‌డిఏ బిజెపి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు కార్పొరేట్ విద్యను, కార్మికులు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

తాడూరు మండల కేంద్రంలో ఈనెల 26న జరిగే నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపున్చిరు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, ఎఐటియుసి చారగొండ మండల కా ర్యదర్శి మొగిల్లా శ్రీనివాసులు, సిరసనగండ్ల గ్రామ భవన నిర్మాణ కార్మికులు కొండల్, నరేష్, ఏం. జంగయ్య, రమేష్, చారగొండ ఎఐటియుసి మండ ల కార్యదర్శి మొగిలి శ్రీనివాసులు, చారగొండ గ్రా మ హామాలీ కార్మికులు గోరేటి రాములు , కీసరి వెంకటయ్య, బి.రామకృష్ణ, ఎరుకల సైదులు, గోరటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కెయుని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలి

### కెయు విద్యార్థి ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

### కెయు విద్యార్థి ఉద్యమకారుల జెఎసి డిమాండ్

**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** స్వరాష్ట్ర సాధన కోసం మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన కాకతీయ యూనివర్సిటీ (కెయు) విద్యార్థి ఉద్యమకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల జెఎసి డిమాండ్ చేసింది. శనివారం విలేఖరుల సమావేశంలో జెఎసి నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు (కెకె) ఆధ్వర్యంలో ఏర్పాటైన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తక్షణమే కాకతీయ యూనివర్సిటీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరింది. అలాగే రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, సంస్థల్లో కెయు విద్యార్థి ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది.గత 12 సంవత్సరాలుగా ముఖ్యంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపాయని జెఎసి ఆవేదన వ్యక్తం చేసింది. తెలంగాణ ఉద్యమంలో తమ విలువైన సమయాన్ని, విద్యను, భవిష్యత్తును త్యాగం చేసిన విద్యార్థి ఉద్యమకారుల సంక్షేమా న్ని రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని పేర్కొంది. గత ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులకే అధిక ప్రాధాన్యత ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కెయుపై అదే నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని విమర్శించింది. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా కాకతీయ యూనివర్సిటీని సందర్శించిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేసి, కెయు విద్యార్థి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరింది. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి (ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు), డాక్టర్ ఫిరోజ్ పాషా, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ ఎస్. అనిల్, డాక్టర్ ప్రేమ్, డాక్టర్ కుమారయ్య (టిఆర్ఎస్‌వి), డా.మహాలీష్, కె.చిరంజీవి, డా.క్రాంతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.



# కల్తీల నిరోధానికి కఠిన చట్టం



- సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు అన్ని కల్తీల బారిన పడుతుండడంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యాల బారిన పడుతున్నారని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (టిజిఎఫ్‌డిసిఎ)పై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని శనివారం హైదరాబాద్ ఎంసిహెచ్ ఆర్‌డిలో నిర్వహించారు. కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని సిఎం అధికారులకు సూచించారు. వివిధ అధ్యయనాల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను తయారు చేయాలన్నారు. దానిపై బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రమైన చర్చ చేపడతామని సిఎం తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలని సిఎం తెలిపారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణకు విజిల్ బ్లోయర్లను నియమించాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సిఎం తెలిపారు. ఎరువులు, పురుగు మందుల భారీ వాడకంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని సిఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలు రకాల ఉత్పత్తులు అమ్ముతున్నారని, అధిక ధరలకు ప్రజలు వాటిని కొంటున్నప్పటికీ అవి సేంద్రియ ఉత్పత్తులే అని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు.

**క్యూర్ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టు**

కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక్కడ నిబంధనలు అమలు చేసి వాటి అమలులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు కొనసాగాలని సిఎం సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, ఎన్. శ్రీధర్, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది

- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్‌కు స్థలాల కేటాయింపు
- ఫిక్కీ లేడీస్ తరహాలో మహిళల కోసం మరో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు
- సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారతే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది అని, మహిళల ఆర్థిక, రాజకీయ పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న ఇండస్ట్రియల్ పార్క్ తరహాలో మహిళల కోసం మరో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సిఎం చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడిన దేశాల్లో అభివృద్ధి, జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్ ఆర్‌డిలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌ఓ) ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో సిఎం పాల్గొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు 22 జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని తెలిపారు. శిక్షణ, మార్కెటింగ్, వ్యాపార కార్యకలాపాలకు కేంద్రాలుగా కార్పొరేట్ స్థాయిలో ఈ భవనాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హైటెక్ సిటీలో శిల్పారామం సమీపంలో సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూమిని ఇందిరా మహిళా శక్తి బజార్ కోసం కేటాయించినట్లు సిఎం వెల్లడించారు. గ్రామీణ హస్తకళలు, సాంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మహిళా స్వయం సహాయక సంఘాల కోసం ఏర్పాటు చేసిన 150కిపైగా దుకాణాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ అభ్యర్థన మేరకు శిల్పారామం సమీపంలో ఫిక్కీ కార్యాలయ నిర్మాణానికి వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీకి ఒక ఎకరం భూమి కేటాయించి, రాష్ట్ర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ సంస్థ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించిన సిఎం, ప్రపంచ అగ్రగామి ఫార్చ్యూన్500 కంపెనీలను అక్కడకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ఎఫ్‌ఎల్‌ఓ జాతీయ అధ్యక్షురాలు పూజా గర్గ్, ఎఫ్‌ఎల్‌ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతా రెడ్డి గడ్డం, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేలా విద్యుత్ ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం

- నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా కార్యాచరణ
- కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనలో గత ప్రభుత్వానిది ఘోర వైఫల్యం
- విద్యుత్తు శాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున, భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రాకుండా, ప్రజలకు నాణ్యమైన కరెంటును అందించేందుకు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విద్యుత్ శాఖ సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. ప్రధానంగా ప్రజల తాగునీటి అవసరాలకు, రైతుల వ్యవసాయ సాగుకు ఎటువంటి ఆటంకం కలగకుండా అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ రంగానికి ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా అధికారులు ముందుచూపుతో అడుగులు వేయాలని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి విద్యుత్ వినియోగదారుడికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. 108 తరహాలో ప్రారంభించిన 'పవర్ అంబులెన్స్' సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత 30 నెలలుగా చేపట్టిన పురోగతి కార్యక్రమాలు తీసుకొచ్చిన సంస్కరణలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకు డిప్యూటీ సిఎం స్పందిస్తూ డీటీఆర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఏఐ ఆధారిత సాంకేతికతను విద్యుత్ శాఖలో విస్తృతంగా అమలు చేయాలని, ఈ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఎనర్జీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు.

**అంగన్‌వాడీలకు సోలార్ వెలుగులు**

రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో అభివృద్ధి చేసిన మోడల్ సబ్‌స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకుని, టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లను దశలవారీగా ఆధునికరించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో భూమి కొరత దృష్ట్యా ఫ్లైఓవర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**రాష్ట్ర ఇంధన అవసరాలకు అనుగుణంగా సింగరేణి కొత్త బ్లాక్‌లను సాధించాలి**

తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సింగరేణి సంస్థ కొత్త బొగ్గు బ్లాక్లను సాధించి, తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల మైనింగ్ లీజు లభించిన తాడిచర్ల–2 బ్లాక్‌కు సంబంధించి నిర్ణీత కాల పరిమితిలో అన్ని అనుమతులు సాధించి, యుద్ధ ప్రాతిపదికన ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులను ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో అవసరమైన కొత్త బొగ్గు బ్లాక్‌లను సాధించేందుకు ప్రయత్నించకపోవడం వల్ల ప్రస్తుతం అదనపు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ ప్రభావం సింగరేణిపై పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ మరింత పెరుగుతున్నందున బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, డిస్పాచ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, సింగరేణి, జెన్‌కో, డిస్కమ్‌ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల కోసం ఏకతాటిపైకి దక్షిణాది రాష్ట్రాలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల పరిరక్షణతో పాటు దేశంలో వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు దక్షిణాది రాష్ట్రాలు సంఘటితంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ శనివారం కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు లేఖలు రాస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సంయుక్తంగా కలిసి ఆయిల్ పామ్ పంటకు కనీస హామీ ధర కల్పించాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. దేశంలో జాతీయ వంటనూనెల మిషన్–ఆయిల్ పామ్ (ఎన్‌ఎంఇఓఒపి)కింద 6.50 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 2.73 లక్షల హెక్టార్లలో సాగు విస్తరించిందని మంత్రి తెలిపారు. ఇందులో దక్షిణాది రాష్ట్రాల వాటా 2.05 లక్షల హెక్టార్లు, అంటే మొత్తం సాగులో 75 శాతం ఉందని పేర్కొన్నారు. దేశంలో వంటనూనెల స్వయం సమృద్ధి సాధనలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.ఆయిల్ పామ్ పంట దిగుబడులు రావడానికి 3 నుంచి 4 ఏళ్లు పడుతుందని, రైతులు దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల (ఎఫ్‌ఎఫ్‌బి) ధరలు అంతర్జాతీయ క్రూడ్ పామ్ ఆయిల్ (సిపిఒ) ధరలు, దిగుమతి సుంకాలపై ఆధారపడటంతో రైతులు తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2018లో 44 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 2022 నాటికి పూర్తిగా తగ్గించడం, అనంతరం 2024లో 27.5 శాతానికి పెంచడం, 2025 మే 31 నుంచి మళ్లీ 16.5 శాతానికి తగ్గించడంతో దేశీయ మార్కెట్ ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పరిస్థితుల్లో క్రూడ్‌పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని మళ్లీ 44 శాతానికి పునరుద్ధరించడం గాని, ఆయిల్ పామ్ గెలల మెట్రిక్ టన్నుకు కనీస హామీ ధర (ఎంజిపి)ను రూ.25 వేలుగా నిర్ణయించి, సాగు వ్యయం, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని కాలానుగుణంగా సవరించే విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దక్షిణాది రాష్ట్రాలు సంయుక్తంగా ప్రధానమంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తే ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలు పరిరక్షించబడటంతో పాటు దేశం లో వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్య సాధనకు మరింత ఊతమిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వాంగ్ చుక్ తరలింపు నిరంకుశ చర్య

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న ఉద్యమకారుడు సోనమ్ చుక్ శనివారం పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్ళటాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చేయడాన్ని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహించాలని శాంతియుతంగా దీక్ష చేస్తున్నప్పటికీ స్పందించకుండా, బెదిరింపు ధోరణితో దీక్షను భగ్నం చేయటానికి ప్రయత్నించటం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని నిదర్శమని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీకేజీ కారణంగా 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు లేవనెత్తే అంశాలపై స్పందించటం ప్రభుత్వాల కనీస బాధ్యత అని, పలువురు విద్యార్థులతో సహా సోనమ్ వాంగ్ 20 రోజులకు పైగా దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించకపోవడం అహంకారానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. ఆయన ప్రాణాలను కాపాడడం చాలా అవసరమని, అదే సమయంలో కోర్టును అడ్డం పెట్టుకొని సమస్య పరిష్కరించకపోవడం నిరంకుశత్వమని అన్నారు. పోలీసులు ఆసుపత్రికి తరలించిన వాంగ్ చుక్ అనుమతి లేకుండా దీక్షను భగ్నం చేయవద్దని కూనంనేని డిమాండ్ చేశారు.

# వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధం

- ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'సూపర్ ఎల్ నినో' ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సంసిద్ధంగా ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 'సింపోజియం' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాతావరణ మార్పులపై సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి అనుకూల వర్షపాతం నమోదై రిజర్వాయర్లు సమృద్ధిగా నిండడంతో సాగు, తాగునీటి అవసరాలు సాఫీగా నెరవేరాయని తెలిపారు. అయితే ప్రస్తుత వర్షాకాలంలో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవని చెప్పారు. ఈ నేపథ్యంలో 'సూపర్ ఎల్ నినో' ప్రభావాన్ని ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తోందని, ప్రజలు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. నీటిపారుదల, వ్యవసాయం, తాగునీరు, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నాయని, రిజర్వాయర్ల నిర్వహణలో రియల్‌టైమ్ డేటా, శాస్త్రీయ విధానాలను వినియోగిస్తున్నామని చెప్పారు. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల నుంచి రైతులను రక్షించగలగడమే ప్రభుత్వాలకు అసలైన పరీక్ష అని మంత్రి పేర్కొన్నారు. పట్టణాల్లో పెరుగుతున్న కాంక్రీటీకరణ కారణంగా భూగర్భ జలాల పునరుద్ధరణ తగ్గిపోతుండటంతో వర్షపు నీటి సంరక్షణ అత్యవసరమైందన్నారు. హైదరాబాద్‌లో చెరువులు, నీటి వనరులు, సహజ కాలువల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి హైడ్రాతో గతంలో జరిగిన ఆక్రమణల వల్ల పెరిగిన వరద ముప్పును తగ్గించేందుకు చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, సహజ డ్రైనేజీ వ్యవస్థల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## నీట్- 2026 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థుల సత్తా

- రికార్డు స్థాయిలో ర్యాంకులు.. జాతీయ స్థాయిలో మరోసారి ఆధిపత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ 2026 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మరో సారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో తొలి ర్యాంకుతో పాటు టాప్12లో 9 ర్యాంకులు సాధించి దేశవ్యాప్తంగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో ఆర్యన్ గుప్తా తొలి ర్యాంకు సాధించగా, గౌరవ్ సింగ్ 9వ ర్యాంకు, క్రిష్ గుప్తా 15వ ర్యాంకు, కార్తిక్ చౌదరి 16వ ర్యాంకు సాధించారు. అలాగే టాప్100లో 18 మంది, టాప్1000లో 49 మంది విద్యార్థులు నారాయణ విద్యాసంస్థలకు చెందినవారే కావడం విశేషం. ఆల్ ఇండియా కేటగిరీలో టాప్12లో 9 ర్యాంకులు, టాప్100లో 45 ర్యాంకులు, టాప్1000లో 163 ర్యాంకులు సాధించడం నారాయణ విద్యాసంస్థల శిక్షణా విధానానికి నిదర్శనమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులకు కాన్సెప్ట్ ఆధారిత బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, వ్యక్తిగత శ్రద్ధ, సాంకేతికత ఆధారిత శిక్షణ, నిరంతర పరీక్షల నిర్వహణ వంటి అంశాలే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. సిబిటి విధానంలో ప్రత్యేక శిక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత విశ్లేషణ, వ్యక్తిగత పనితీరు అంచనా వంటి ఆధునిక విధానాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం అభినందించింది. భవిష్యత్తులోనూ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా మరింత నాణ్యమైన శిక్షణ అందిస్తామని వెల్లడించింది.

## టిపిసిసి సంస్థాగత కార్యక్రమాలు భేష్




- ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీని గ్రామ, బూత్ స్థాయిల వరకు మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి బిఎల్ఏకు సూపర్వైజర్‌ను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. టిపిసిసి అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ కార్యక్రమాల అమలు తీరు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆమె ప్రశంసించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ, బిఎల్ఏ శిక్షణా కార్యక్రమాలు, జనహిత పాదయాత్ర తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంస్థాగత విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలు తీరును అధ్యయనం చేసేందుకు 11 రాష్ట్రాల నుంచి ఎఐసిసి నాయకులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు తెలంగాణ టిపిసిసిని అభినందించినట్లు తెలిపారు. సోషల్ మీడియా, కనెక్టింగ్ సెంటర్, సంస్థాగత కార్యక్రమాలను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంథిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు పి. ప్రసన్న కుమార్ శర్మ, కొప్పుల ప్రవీణ్ కుమార్, గంప వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు!

- వార్షిక పాలనా నివేదికలు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు
- పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆడిట్ స్టేట్‌మెంట్‌లతో కూడిన వార్షిక పాలనా నివేదికను సమర్పించని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలపై విద్యా శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రాంతీయ విద్యాధికారులు (ఆర్‌జెడిలు), జిల్లా విద్యాధికారులను (జెడిఈఓలను) పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాల 2023–24, 2024–25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పూర్తి స్థాయి వార్షిక నివేదికలను, ఆడిట్ స్టేట్‌మెంట్‌లను విధిగా సమర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ నివేదికలను సమర్పించని స్కూళ్లను గుర్తించి, వాటికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రాబోయే 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు స్పష్టతనిచ్చేలా పాఠశాలలు కీలక చర్యలు చేపట్టాలని సంచాలకులు ఆదేశించారు. ప్రతి స్కూల్ తమ నోటీస్ బోర్డులో లేదా అధికారిక వెబ్‌సైట్‌లో తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఫీజుల విషయంలో పారదర్శకత లోపిస్తే సహించేది లేదని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించాలి

- 20న ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సమావేశాలు
- కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 20న ఉమ్మడి పది జిల్లాల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి అవగాహన సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లు, ప్రత్యేక అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమావేశాల ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించడం, రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత వర్గాలతో సమావేశమై వర్షాభావ పరిస్థితులపై చర్చించి తగిన చర్యలను సూచించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 20న నిర్వహించే జిల్లా స్థాయి సమావేశాలకు నియమితులైన ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సిఎస్ ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అధికశాతం జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్న ఆయన, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయంపై ఏర్పడే సవాళ్లను రైతులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలు (కంటింజెన్సీ చర్యలు), పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు శాస్త్రీయ, సాంకేతిక సమాచారాన్ని అందించేలా ఈ కార్యక్రమాన్ని రోజంతా నిర్వహించే విధంగా రూపొందించినట్లు సంజయ్ జాజు తెలిపారు. ఈ సమావేశాల ద్వారా రైతులు నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులతో నేరుగా చర్చించి వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, సాగు విధానాలపై సందేహాలను నివృత్తి చేసుకుని సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అన్ని జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశాల్లో పాల్గొనాలని సిఎస్ ఆదేశించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, మీడియా ప్రతినిధులు, ఇతర భాగస్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లు, ప్రత్యేక అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, దానకిషోర్, నవీన్ మిట్టల్, బెన్హర్ ఎక్కా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తమ్ముడిని హత్య చేసిన అక్కలు, తండ్రి

### కుటుంబ కలహాలే హత్యకు కారణమన్న పోలీసు



**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడెం గ్రామంలో కుటుంబ సభ్యుల మధ్య చోటుచేసుకున్న దారుణ హత్య కలకలం రేపింది. అదే గ్రామానికి చెందిన మడే వలపతి (35) అనే వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లో నిద్రిస్తుండగా గొంతు కోసి హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వెంకటాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు వెల్లడైంది. మృతుడు తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవలు సృష్టిస్తూ కుటుంబ సభ్యులను వేధించేవాడని, దీంతో అతని ఇద్దరు అక్కలు ఆదిలక్ష్మి, అనసూర్య, తండ్రి మదనయ్యతో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితులను అదుపులోకి తీసుకోవడం పోలీసుల దర్యాప్తు నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కృష్ణాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి కుర్సం నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## పారదర్శకంగా ప్రీ ప్రైమరీ పోస్టుల పరీక్షలు




**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలోని 39 నూతన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 269 మందిలో 254 మంది, ఆయా పోస్టులకు 152 మందిలో 139 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ పరిశీలించడం జరిగింది. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పరీక్షల నిర్వహణ విజయవంతంగా పూర్తైంది.

## నీట్ -2026 ఫలితాలలో 'శివాని' ప్రభంజనం



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** ప్రతిభావంతులైన విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం అందరికి సాధ్యమే. కానీ సాధారణ విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం శివానికే సాధ్యం అనికళాశాల కరస్పాండెంట్ టి . స్వామి తెలిపారు. శుక్రవారం ప్రకటించిన నీట్ 2026 ఫలితాలలో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయ దుందుభి మోగించారని, విద్యార్థులు పి. శ్రీ వాణి 472/720 ర్యాంకు, బి. స్వాతి465/720 ర్యాంకు, జి.హనిష్క 454/720 ర్యాంకు, బి.వంశీకృష్ణ437/720 ర్యాంకు వచ్చిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలను సాధిస్తూ శుక్రవారం ప్రకటించిన నీట్2026 ఫలితాలలో వీరితో పాటుగా సుమారు 12 మంది ఎక్కువ మార్కులు సాధించిన శివాని విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ టి . స్వామి. ప్రిన్సిపల్స్ జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు.ఎన్. రమేష్.ఎ. మురళీధర్,వి. సురేష్,ఎస్. సంతోష్ రెడ్డి, అభినందనలు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లితండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## పాఠశాల వంట పనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** సెంట్రలైజేషన్ విదానంపేరుతో పాఠశాలలో వంటశాల పనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని ,అలాగే నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి ధర్మల రామ్మూర్తి ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.ఊమేరకు హసన్ పర్తి మండల విద్యాభివృద్ధి వనరుల అధికారి ఎ. శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వపాఠశాలలోమధ్యాహ్నం భోజన నిర్వాహకులు54,200 మంది 24సంవత్సరములనుండి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. పాఠశాల విద్యార్థులకు వారంలో మూడు రోజులు కోడిగుడ్లు పెట్టాలని కోరారు. ప్రభుత్వం కోడిగుడ్డు దరను మార్కెట్ రేటు మేరకు ఎనిమిది రూపాయలను చెల్లించాలని తెలిపారు.నిత్యావసర సరుకులు ప్రభుత్వ మే సరఫరా చేయాలనిడిమాండ్ చేశారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు, విద్యార్థికి ఒక్కంటికి రూ.25 ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు జె .లక్ష్మి , అనిత ,కవిత, మమత నాగమణి, సరస్వతి ఆర్ అలేంద్ర స్వరూప రమ పాల్గొన్నారు.

## తక్కువ నీటితో అధిక లాభం

**ప్రజాపక్షం/నెక్కొండ:** వాతావరణ మార్పులు, ఎన్‌నిలో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా తక్కువ నీటి వినియోగంతో అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి నాగరాజు సూచించారు. నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరికి బదులుగా మంచి మార్కెట్ డిమాండ్ ఉన్న బంతి పూలు, కూరగాయల పంటలు, పొద్దు తిరుగుడు, జొన్నలు, కందులు, ఆముదం, బొబ్బర్లు వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పున్నం రంగారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) కె నవీన్, రైతులు జక్కుల ఏకాంబరం, ఎండి అంకూస్, దామోదర్ రెడ్డి, పాల్గొన్నారు.

## 'సర్' విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం కీలకం

### రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ఎన్నికల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, శక్తి శాఖ కార్యదర్శి హరి చందన దాసరి పేర్కొన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అభిప్రాయాలు, సూచనలు, సందేహాలను తెలుసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వాటిపై సమగ్ర వివరణ ఇచ్చి సందేహాలను నివృత్తి చేశారు.హరి చందన దాసరి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజల్లో అపోహలు తొలగిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలను విస్తృతంగా తెలియజేయాలని సూచించారు.బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు నిరంతరం శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తూ వారి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని పేర్కొన్నారు. అలాగే అపార్ట్‌మెంట్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యూఏలు), గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి అర్హుడైన ఓటరు ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పురోగతిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, వాటిని తిరిగి సేకరించి సకాలంలో డిజిటలైజేషన్ పూర్తి చేసేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రతి అర్హుడైన ఓటరు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 55.60 శాతం ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయిందని తెలిపారు. పురోగతి వేగవంతం కావాలంటే ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, వాటిని తిరిగి సేకరించి సకాలంలో డిజిటలైజేషన్ పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కుడా ఛైర్మన్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, గ్రేటర్ పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా సెలవు దినాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని సేకరించి వెంటనే డిజిటలైజేషన్ చేసేలా చర్యలు తీసుకుంటే నిర్దేశించిన లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో బీఎల్ఏల ద్వారా ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిపై వివరణలు పొందారు.ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ. వి. శ్రీనివాస్ రావు,బీజేపీ తరఫున నిశాంత్, బీఆర్ఎస్ తరఫున ప్రవీణ్ కుమార్, కుసుమ శ్యామ్ , నిషాంత్ ,పుప్పాల రజనీకాంత్, రాజిరెడ్డి, జైపాల్ రెడ్డి, ఎంఐఎం, సీపీఐ, సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 24, 25 తేదీలలో సిపిఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** జులై 24 25 తేదీలలో రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగే సిపిఐ పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కార్యకర్తలకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పిలుపునిచ్చారు. శనివారం మండలంలో పార్టీ శ్రేణులతో కలిసి పలు గ్రామా లలో ఆయన పర్యటించి సిపిఐ పార్టీ జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న మాట్లాడుతూ, ఈ నెల 24, 25 తేదీలలో సిపిఐ పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కావటి యాదగిరి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కందుకూరు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు తోట రమేష్, ఆటో యూనియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తున్న ప్రజాప్రభుత్వం: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు యూనిఫాంలు, విద్యకు అవసరమైన పలు వస్తువులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పోతుగంటి నర్సయ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి ప్రశాంతి, ఏఎంసీ చైర్మన్ మంజుల భాస్కర్, సర్పంచ్ శ్రీనివాస్, లక్ష్మి , రమ్య, బాలాజీ నాయక్, కుమారస్వామి, మల్లారెడ్డి, విమల, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, హెచ్ఎం శోభారాణి, పాల్గొన్నారు.

**ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం**

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కెటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి వల్మిడిలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాలలో కళ్యాణ మండపాల నిర్మాణాల కోసం స్థల పరిశీలన చేశారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులున్నారు.

## ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు






**ప్రజాపక్షం/భూపాలపల్లి:** అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులకు అంతం లేదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరు నగర్ లోని ఇల్లందు క్లబ్ లో మోట పలుకుల రమేష్ అధ్యక్షతన భూపాలపల్లి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తొలుత శిక్షణా తరగతుల ప్రాంగణంలో సిపిఐ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం శిక్షణా తరగతులను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై అనునిత్యం పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మతతత్వ శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, ప్రజాసమస్యలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం దేశ సంపదను దోచి పెడుతున్నదని అన్నారు. దేశంలో బిజెపిని అడ్డుకునేందుకు వామపక్షాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొన వద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ వ్యవహారించిన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సిపిఐ జిల్లా నాయకులు ఫైళ్ళ శాంతి కుమార్, మామిడాల సమ్మిరెడ్డి, క్యాథరాజు సతీష్, పరమండ్ల రాజయ్య, కొరిమి సుగుణ, పెంట రవి, సోతుకు ప్రవీణ్ కుమార్, నాయకులు నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, వెంకటేష్, తాళ్ల పోశం, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, ఏఐటీయూసీ నాయకులు కరీముల్లా,ఎల్ శంకర్ పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### 'రైజ్ హర్- 2026' మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఎంపి కావ్య డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ:** మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్ రెడ్ హిల్స్ లో తెలంగాణ ఎస్సీ,ఎస్టీ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ హర్–26 మహిళా సాధికారత సదస్సు కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు ఎల్లప్పుడూ పాజిటివ్ ఎనర్జీతో ముందుకు సాగాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పే బ్యాక్ టూ సొసైటీని ప్రతి ఒక్కరిని అలవర్చుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ జాతీయ గౌరవాన్ని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను మరింత బలోపేతం చేస్తూ మహిళల్లో పొదుపు, స్వయం ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు జీవితాంతం నిత్య విద్యార్థులుగా నేర్చుకుంటూ ముందుకు సాగాలని, ముఖ్యంగా ఎస్సీ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వ రంగాల్లో మరింత ముందుకు వచ్చి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను చాటుకుని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబం, సమాజం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఇండస్ట్రియల్ కామర్స్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పిఎంఈజిపి రవి,ఎస్ బీఐ లీడ్ డిస్టిక్ మేనేజర్ మూర్తి,వి హబ్ డైరెక్టర్ జావేద్ అక్తర్ షేక్ ,టిఎస్ఐసీసీ ప్రెసిడెంట్ నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/గార్ల:** రాష్టంలో నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్తితుల నేపధ్యంలో రైతులు అధిక నీటి వనరులు అవసరమయ్యే వరి పంట సాగుకు బదులుప్రత్యామ్నయ పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు రైతులకు సూచించారు. శనివారం మండల పరిదిలోని పోచారం పంచియతీలో స్థానిక రైతు వేదికలో సర్పంచ్ బాదావత్ రమ్య అధ్యక్షతన నిర్వహించన ఎల్‌నినో పై అవగాహణ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వున్న వాతావరణ పరిస్తితులలో రైతులు పప్పు ధాన్యాలు కూరగాయలు చిరు ధాన్యాల సాగు చేసే దిశలో రైతులు ఆలోచించాలని సూచించారు.ప్రస్తుతం రైతు వేదికలో పెసర రకం ఎమ్‌జిజి 385 విత్తనాలు రాయితీ పై అందుబాటులో ఉన్నాయని, ఈ విత్తనాలు పల్లాకు తెగులును తట్టుకుని అధిక దిగుబడిని ఇస్తుందని, 80 రోజుల్లో కోతకు వస్తుందని అన్ని కాలలో సాగు చేయుటకు ఇది అనువైన రకం అని, మంచి కాపునిస్తూ రైతుకు లాభం చేకురుస్తుందని భూసారం పెరుగుతుందని వరి మాగాణులలో నీటి పరిమాణులలో నీటి పరిమానం తక్కువగా ఉండడం వలనపెసర సాగు చేసుకోవాలని సూచించారు. స్వల్పకాలిక పంటలను తక్కువ నీటి వినియోగం తో చేయాలని, రసాయన ఎరువుకు బదులు జీవన ఎరువులు,సేంద్రియ ఎరువులను విరివిగా వాడడం వలన భూసారం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నటి డాక్టర్ సురేష్ కుమార్, ఏఈఓ పూజిత,గ్రామ కార్యదర్శి,రైతులు పాల్గోన్నారు.

## చిన్న వర్షానికే జలమయం... దహన సంస్కారాలకు ఇబ్బందులు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గ్రేటర్ వరంగల్ ఉర్సు ప్రాంతం, 40వ డివిజన్ లోని హిందూ స్మశానవాటిక చిన్నపాటి వర్షానికే నీట మునిగిపోతోంది. దీనితో మృతదేహాలకు కనీసం దహన సంస్కారాలు నిర్వహించడం కూడా కష్టసాధ్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతులు అందించినప్పటికీ ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదని వారు ఆరోపిస్తున్నారు. ఉర్సు ప్రాంతానికి చెందిన మూడు డివిజన్ల ప్రజలు ఈ ఒక్క స్మశానవాటికపైనే ఆధారపడాల్సి వస్తుండడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు స్మశానవాటికలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

## ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు పొందడమే లక్ష్యం

### ఎస్ఆర్ కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహం మరువలేను
### నీట్ జనరల్ కేటగిరీలో 9వ ర్యాంకర్ వీరయ్యగారి సహ్యా

**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్:** ఢిల్లీలోని ఎయిమ్స్ లో సీటు పొందడమే లక్ష్యంగా నీట్ పరీక్షకు ప్రిపేర్ అయ్యానని, తనకు కార్డియాక్ సర్జన్ కావాలని లక్ష్యంగా ఉందని నీట్ యూజి 2026లో జాతీయ స్థాయిలో 9వ ర్యాంకర్ వీరయ్యగారి సహ్యా అన్నారు.నీట్ లో జాతీయ స్థాయిలో మెరిసిన వరంగల్ నగరానికి చెందిన వీరయ్యగారి సహ్యా ప్రజాపక్షంతో మాట్లాడుతూ మొదటిసారి నిర్వహించిన నీట్ పేపర్ లీక్ వల్ల రద్దయినప్పటికీ మనోధైర్యం కోల్పోకుండా మరింత పట్టుదలతో చదివానని కష్టానికి తగిన ఫలితం లభిం చిందని అన్నారు. రోజూ పది గంటల పాటు కష్టపడి చదవడం ద్వారానే జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించినట్లు నీట్‌యూజీ 2026 ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 9వ ర్యాంక్ సాధించడం గర్వంగా ఉందని వీరయ్యగారి సహ్యా తెలిపారు. వరంగల్ కు చెందిన డాక్టర్ వీరయ్యగారి రమా కాంత్, డాక్టర్ శ్రీదేవి దంపతుల కుమారుడైన సహ్యా తన నీట్ ప్రిపరేషన్ గురించి మాట్లాడుతూ మొదటిసారి నీట్ పరీక్ష సులువుగా ఉంది. రెండోసారి మాత్రం కఠినం గా ఉందని, అయినా సబ్జెక్ట్ పై ఉన్న పట్టుతో సునాయాసంగా పరీక్ష రాసినట్లు తెలిపారు. నీట్ పరీక్షకు ముందు 108 సార్లు గ్రాండ్ టెస్ట్ లు రాశానని, దీంతోపాటు వీక్లీ పరీక్షలు 500కుపైగా రాశానని, ఈ పరీక్షల ద్వారా తన ప్రతిభకు పదును పెట్టడంతోపాటు సమయపాలన అలవర్చుకున్నానని తెలిపారు.తన తండ్రి రమాకాంత్ తన గురువైన ప్రముఖ సర్జన్ వేదుల సత్యనారాయణ మూర్తి సేవలను పదేపదే గుర్తుచేసేవారని, ఆయన గురిం చి గొప్పగా చెప్పేవారని, అది విన్నప్పుడల్లా తాను డాక్టర్ కావాలని లక్ష్యం నిర్దేశించుకున్నానని తెలిపారు. దీంతో పాటు వైద్యులైన తన తల్లిదండ్రుల స్ఫూర్తితో తాను కూడా డాక్టర్ కావాలను కున్నానని,తాను ప్రత్యేకంగా ఎలాంటి కోచింగ్ తీసుకోలేదని, ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతూనే నీట్ పరీక్షకు సిద్ధమయ్యానని,కాలేజీలో అధ్యాపకుల నుంచి మంచి సహకారం లభించిందన్నారు. ఈ ర్యాంకు సాధించడంలో తల్లిదండ్రులు, ఎస్ఆర్ కాలేజ్ అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతో ఉందని సహ్యా తెలిపారు.వైద్య రంగంలో రాణిస్తున్న



తమ అమ్మానాన్నలే తనకు స్ఫూర్తి అని తెలిపారు. రోజుకు 10 గంటలు చదవడంతో పాటు, అధ్యాపకుల ప్రోత్సాహంతో తనకు ఈ ర్యాంకు వచ్చిందన్నారు.

ప్రముఖ నిర్మాత గణేష్ బండ్ల కుమార్తె జనని బండ్ల వివాహం ఆగస్టు 16న జరగనున్న నేపథ్యంలో కుమార్తె వివాహానికి మెగాస్టార్ చిరంజీవి దంపతులను ఆహ్వానించారు. మెగాస్టార్ నివాసానికి వెళ్లిన బండ్ల గణేష్ దంపతులు చిరంజీవి-సురేఖను ఆహ్వానించి పెళ్లి పత్రికను అందజేశారు.



# 'కొరియన్ కనకరాజు'తో దక్షా నాగర్కర్ స్పెషల్ సాంగ్



వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కొరియన్ కనకరాజు'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే భారీ అంచనాలను సృష్టించింది. టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'కంసంనిద', టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'రాసగుమ్మడి' ఫుల్ లిరికల్ సాంగ్‌ను 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వరుణ్ తేజ్, హీరోయిన్ దక్షా నాగర్కర్ కలర్ ఫుల్ లుక్‌తో విడుదలైన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ మాస్‌ఫెస్టివ్ సాంగ్ వైబ్ ని క్రియేట్ చేస్తోంది.కొరియన్ కనకరాజు లో దక్షా నాగర్కర్ స్పెషల్ సాంగ్ చేస్తోంది. వరుణ్ తేజ్, దక్షా నాగర్కర్‌పై చిత్రీకరించిన రాసగుమ్మడి సాంగ్ కలర్‌ఫుల్ రాయలసీమ జాతర నేపథ్యంలో తెరకెక్కిన మాస్ డ్యాన్స్ నంబర్‌గా ఉండబోతోంది. థమన్ సంగీతం అందించిన ఈ పాట మరో చార్ట్ బస్టర్‌గా కానుంది.ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్. థమన్ సంగీతం అందించగా, మనోజ్ రెడ్డి కటసాని డిఓపిగా పని చేస్తున్నారు.



# ఆగస్టు 7న కింగ్ జాకీ క్వీన్ రిలీజ్

విభిన్న కథాంశాలతో విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాలను అందుకుంటున్న నిర్మాత సుధాకర్ చెరుకూరికి తన ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ నుంచి మరో ఆసక్తికరమైన చిత్రం కింగ్ జాకీ క్వీన్ ప్రేక్షకుల ముందుకు రానుంది. 1990 కాలం నేపథ్యంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం లో 'దసరా', 'ది గర్ల్ ఫ్రెండ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. ఆయనకు జోడీగా నూతన నటి శశి ఓదెల పరిచయం అవుతుండగా, యుక్తి తరేజా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన కెకె గత ఏడాది కన్నుమూశారు. ఆయన సినిమాపై ఉన్న పాషన్, విజన్ కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు. ఇప్పటికే వినూత్నమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్, పవర్‌ఫుల్ టీజర్‌తో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. 'కేజేక్యూ కింగ్ జాకీ క్వీన్' ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ముగ్గురు ప్రధాన పాత్రలను స్టిల్ ఫ్రేమ్‌లో చూపించారు. మధ్యలో శశి ఓదెల ఇంటెన్స్ లుక్ లో ఆకట్టుకోగా, తుపాకీ గురిపెట్టి కనిపిస్తున్న దీక్షిత్ శెట్టి పాత్ర ఆకట్టుకుంది. కుడివైపు చేతిలో సిగరెట్‌తో యుక్తి తరేజా కనిపిస్తూ తన పాత్రలోని మిస్టరీని సూచిస్తున్నారు.ఈ చిత్రానికి నాగేశ్ బనెల్ సినిమాటోగ్రఫీ అందించగా, పూర్ణచంద్ర తేజస్వి సంగీతం సమకూరుస్తున్నారు. శ్రవణ్ కటికనేని ఎడిటర్‌గా, శ్రీకాంత్ రామిశెట్టి ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ నగేష్ బానెల్, సంగీతం పూర్ణచంద్ర తేజస్వి, ఎడిటర్ శ్రవణ్ కటికనేని, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీకాంత్ రామిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శేఖర్ యలమంచిలి.

# 'ఇల్లీగల్ యాక్టివిటీస్' జరగడం లేదు

- కొంతమంది ఇంచార్జిలు డాన్సర్ల డబ్బులు దోచుకుంటున్నారు
- డాన్సర్లకు అన్యాయం జరిగితే ఊరుకోను
- 'ప్రజాపక్షం'తో డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత

ఒక సినిమా నిర్మాణం జరగాలంటే తెర మీద కనిపించే హీరో హీరోయిన్‌లే కాకుండా తెరవెనుక ఇరవై నాలుగు విభాగాలు పని చెయ్యాల్సి ఉంటుంది. ఈ ఇరవై నాలుగు విభగాల్లో డ్యాన్సర్‌లు ఎంతో కీలకం. అందుకే డ్యాన్సర్‌లకు సినిమా రంగంలో మంచి మర్యాదకు ఉంటాయి. అంతే స్థాయిలో పేరు ప్రఖ్యాతలు కూడా ఉంటాయి. ఈ రోజుల్లో డ్యాన్సర్‌లకు, డ్యాన్స్ డైరెక్టర్లకు కేవలం సినిమాలే కాకుండా బుల్లి తెర షోలు కూడా భారీ ఎత్తున స్వాగతం పలుకుతున్నాయి. అయితే వీరంతా తెలుగు ఫిలిం డాన్సర్స్ అండ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ లో సభ్యులుగా ఉండాలి. ఈ అసోసియేషన్ కు సుమలతా దేవి అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య అయిన సుమలత దేవి డాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా పోటీ చేసి మరీ గెలిచారు. అధ్యక్షురాలు ఏకపక్ష ధోరణితో పని చేస్తున్నారనే కారణం చేస్తా పదిమంది సభ్యులు తమ పదవికి రాజీనామా చేశారు. ఈ వివాదం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన తరుణంలో 'ప్రజాపక్షం' సుమలతతో ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది.

**ప్రశ్న : డాన్సర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా ఉన్నారు ఎందుకు వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్నారు ?**

**సుమలత :** డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ముప్పై అయిదేళ్ల క్రితం ఏర్పడింది. ముప్పై అయిదేళ్ల చరిత్ర ఉన్న ఈ అసోసియేషన్‌కు నేను అధ్యక్షురాలిగా గెలవడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్న. వివాదాలు ఇప్పుడే కాదు గతంలో చిన్న చిన్న తప్పులు, పెద్ద పెద్ద తప్పులు కూడా జరిగాయి. అసోసియేషన్ లో ప్రెసిడెంట్‌గా భాద్యత తీసుకుని ముందుకు నడిపించాలి అంటే చిన్న మాట కాదు. ఎవరు తప్పు చేసిన సరే అది ప్రెసిడెంట్ మీదకే వస్తుంది. ప్రెసిడెంట్‌గా మీరు ఎం చేశారు ? తప్పు జరిగితే ప్రెసిడెంట్‌గా ఎందుకు ప్రశ్నించలేదు ? అనే మాట నాకు రాకుండా ఉండటం కోసమే నా ప్రయత్నం . తప్పులు జరుగకుండా చూడటమే కదా నా బాధ్యత. అందుకే ఏ చిన్న తప్పు జరిగిన అడుగుతూనే ఉన్న. నేను సభ్యులను ప్రశ్నించడం వాళ్లకు నచ్చడం లేదు . అందుకే ఈ వివాదం మొదలెట్టారు.

**ప్రశ్న : తప్పులు జరిగాయి అంటున్నారు కదా ఎలాంటి తప్పులు జరిగాయి ? ఎవరు తప్పు చేశారు ?**



**సుమలత :** గత బాడీలో ప్రెసిడెంట్, సెక్రెటరీ, కోశాధికారి వల్ల ఫండ్స్ మిస్ యూజ్ జరిగాయి. దీని ప్రశ్నించడం వల్లే అసోసియేషన్ ప్రాబ్లమ్స్ స్టార్ట్ అయ్యాయి. గతేడాది మేము పోటీ చేసినప్పుడు జోసెఫ్ మాస్టర్ మాకు పోటీగా నిలబడ్డారు. జోసెఫ్ ఓడిపోయాడు. అప్పటి నుంచి మామీద వ్యతిరేకత. మేము ఇంతమంచి పని చేసిన సరే ఎదో ఒకటి వేలెత్తి చూపాలి అనే వాయిస్‌లోనే ఉన్నారు. దానివల్లే ఈ ప్రాబ్లమ్ తప్ప లేకపోతే మేమంతా ఒక్కడే. డాన్సర్స్ అయినా, కొరియోగ్రాఫర్స్ అయినా అందరం కలిసి మెలిసి ఉన్నాము.

**ప్రశ్న : మీరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు అనేది మీ మీద ఉన్న ప్రధాన అభియోగం? దీనికి ఏమంటారు?**

**సుమలత :** ఇవన్నీ అబద్దాలు. నేను అందరి అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకుంటా తప్ప. ఏకపక్ష నిర్ణయాలు ఉండవు. ఇప్పుడైతే ఏకంగా ఫెడరేషన్ కు వ్యతిరేకంగా కూడా నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు. వాళ్ళు చెప్పేవన్నీ అవాస్తవాలు. అసోసియేషన్ ఏ నిర్ణయం తీసుకున్న లీగల్ ఒపీనియన్ తీసుకుని మాత్రమే ముందుకెళ్తున్నాము. ఎక్కడ కూడా ఇల్లీగల్ యాక్టివిటీస్ జరగలేదు

**ప్రశ్న : మీరు వచ్చిన తరువాత ఇంతవరకు ఏమి చేశారు ? ఎలాంటి కార్యక్రమాలు తీసుకున్నారు ?**

**సుమలత :** డాన్సర్స్ సంక్షేమం కోసం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాము. సభ్యులందరికి హెల్త్ ఇన్సూరెన్స్ కూడా కడుతున్నాము. గత బడిలో జరిగిన తప్పులన్నీ ఒక ఫైల్ చేసి పెట్టాము. కొంతంనుండి ఇంచార్జిలు నిర్మాతల దగ్గరి నుంచి అంటే మా జనరల్ సెక్రెటరీ తో పాటు ఇంకొంతమంది ఇంచార్జ్ లు కావొచ్చు నిర్మాత దగ్గర ఒక అమౌంట్ రాస్తారు. యూనియన్ లో ఇంకొక అమౌంట్ ఇస్తారు. దీనివల్ల డాన్సర్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. నేను వచ్చాక ఫస్ట్ ఇది ఐడెంటిఫై చేశాను. డ్యాన్సర్లకు రావలసిన పూర్తి స్థాయి డబ్బులు రావడం లేదు. అందరు కాదు ... కొంతమంది ఇంచార్జి లు డ్యాన్సర్స్ డబ్బులను అన్యాయంగా దోచుకుంటున్నారు ఇది నిజం, నేను ఇది బయట పెట్టినప్పటి నుంచి నా మీద వ్యక్తిరేకత వచ్చింది . అసోసియేషన్ ను తప్పు దారి లో తీసుకుపోవడం కానీ, ప్రెసిడెంట్ గా నేను అన్యాయం చెయయడం కానీ జరగలేదు. అవినీతి బయటపడినందుకే జెనరల్ సెక్రెటరిని సస్పెండ చేశాము ఆయన కూడా రాజీనామా చేశారు. కమిషన్ రూపంలో డ్యాన్సర్స్ డబ్బులను తీసుకున్నారు. అవినీతిని ప్రశ్నించినందుకు వాళ్ళు రాజీనామాలు చేశారు తప్ప మేము చేసే పనులు నచ్చక కాదు.

**ప్రశ్న : సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌ను వ్యతిరేకిస్తున్నారా? ఫెడరేషన్ నుంచి బయటికి వచ్చారా ?**

**సుమలత :** రాజీనామా చేసింది కేవలం పదిమంది అయితే మమ్ములను కూడా దిగిపొమ్మని అంటున్నారు. మా బైలలో ఎక్కడా లేదు. ఫెడరేషన్ బైలలో కూడా ఎక్కడ లేదు. మా అంతర్గత సమస్యలో ఫెడరేషన్ జోక్యం ఎందుకు అని మాత్రమే అన్నాము. ఉన్న ఏడుగురు మేము ఏమి తప్పు చెయ్యలేదు. మమ్ముల్ని కూడా దిగిపోండి అంటే మేమెలా దిగిపోతాం. మీటింగ్ ఈ ఎజెండా పెట్టలేదు అని ఫెడరేషన్ వాళ్ళు వెళ్లిపోయారు తప్ప ఫెడరేషన్ కు వ్యతిరేకంగా మేము ఉప ఎన్నిక జరుపుతున్నామని మాట అవాస్తవం. ఫెడరేషన్ ప్రకారమే పని చేస్తున్నాము. వాళ్లకు వ్యతిరేకంగా మేము ఏ పని చెయయలేదు. మేము ఫెడరేషన్ తోనే ఉన్నాము.

**ప్రశ్న : అసోసియేషన్‌లో ఏం జరుగుతుందో అసలు చాలా మంది డాన్సర్లకు తెలియడం లేదు అంటున్నారు?**

**సుమలత :** అలాంటిదేమి లేదు సార్.. అన్ని విషయాలు అందరికీ తెలుస్తున్నాయి. గతంలో అంటే తెలియకపోయేది . కానీ ఇప్పుడు అందరూ చదువుకున్నవారున్నారు. అందరికి నాలెడ్జ్ ఉంది. అందరూ యాక్టివ్ గా పని చేస్తున్నారు.

**ప్రశ్న : కమీషన్ డబ్బులు మరి ఇంచార్జి నుంచి అసోసియేషన్ వాసూల్ చేస్తుందా ?**


**సుమలత :** తప్పకుండ వాసులు చేయడానికీ ప్రయత్నిస్తున్నాము. డాన్సర్స్ దగ్గర కమీషన్ తీసుకుని అన్యాయం చేస్తే మేమెలా ఊరుకుంటాం సార్. ఖచ్చితంగా వసులు చేస్తాం. తప్పుడు బిల్స్ పెట్టారు అవన్నీ కూడా వారి దగ్గరి నుంచి వసూలు చేస్తాం. అసోసియేషన్ కు నష్టం కలగకుండా, డాన్సర్లకు అన్యాయం జరగకుండా చూస్తాం.

## విజయవంతం

(3వ పేజీ తరువాయి)

అభినందనలు తెలియజేశారు. దేశ అంతరిక్ష ప్రయాణంలో విక్రమ్–1 రాకెట్ ప్రయోగాన్ని ఒక కీలక ఘట్టంగా అభివర్ణించారు. రాబోయేకాలంలో ప్రైవేటురంగంలో భారతదేశం ప్రపంచ అగ్రదేశాలతో పోటీపడి ముందుకు దూసుకువెళ్ళడానికి, లెక్కలేనంతమంది భారతదేశ యువతీయువకుల మేలైన కలలను సాకారం చేసేందుకు, వారందరూ ముందుకు పురోగమించేలా ప్రోత్సహించేందుకు ఈ ప్రయోగం గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఎక్స్‌వేదికగా మోదీ రాశారు. ఈ ప్రయోగ విజయం దేశ స్వావలంబన సాధనకు చిహ్నమని పేర్కొన్నారు. భూమి వాతావరణానికి ఆవల బాహ్య అంతరిక్షాన్ని తాకి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన ఈ రాకెట్ ప్రయోగం ద్వారా వచ్చే ఫలితాలను తదుపరి వాణిజ్య రాకెట్లను మరింత మెరుగైన పద్ధతిలో ప్రయోగించేందుకు, వాటి మార్గాలను మరింత ఖచ్చితంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగిస్తారు. నిర్ణీత ప్రకారం శనివారం ఉదయం 11.30 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ థావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుండి ఈ రాకెట్ బయలుదేరాల్సి ఉన్నప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాలవల్ల బయలుదేరే సమయాన్ని సవరించి 35 నిమిషాలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.05 గంటలకు ప్రయోగించారు. ఏడు అంతస్తులు ఎత్తైన ఈ రాకెట్ నాలుగు దశల్లో ప్రయాణించి భూవాతావరణాన్ని దాటి బాహ్య అంతరిక్షాన్ని తాకింది. అక్కడకు 450 కి.మీ ఎత్తులోకి (లో ఎర్త్ ఆర్బిట్) చేరుకున్న తర్వాత ముందుగానే అందులో సిద్ధం చేసి ఉంచిన గ్రాహాస్పేస్,కాస్మోసెర్వ్,డీక్యూబ్,స్కైరూట్ స్కోప్ వంటి సాంకేతిక ప్రయోగాలకు సంబంధించిన అనేక ప్రాథమిక పేలోడ్‌లను వరుసగా లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టారు.

నారింజరంగు వర్ణాలను చిమ్ముకుంటూ ఈ రాకెట్ భారతదేశ శాస్త్ర,సాంకేతిక అంతరిక్ష వ్యవస్థకు దార్శనికులుగా నిలిచిన క్రమ్ సారాభాయ్,సర్ సి.వి.రామన్,ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ వంటి ప్రముఖుల సూక్ష్మ శిల్పాలతోపాటు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతిరాతతో ఉన్న "వందే మాతరం' పోస్టుకార్డుసహా అనేక వస్తువులను ఈ రాకెట్ బాహ్య భూవాతావరణాన్ని దాటిన బాహ్య అంతరిక్ష కక్ష్యలోకి విజయవంతంగా మోసనుకు వెళ్ళింది. భారత అంతరిక్ష దార్శనికుల స్ఫూర్తికి నివాళిగా ఈ రాకెట్‌లోని ఇంజన్లకు విక్రమ్ సారాభాయ్,సి.వి.రామన్,కలామ్ పేర్లు పెట్టినట్లు ఈ రాకెట్ తీసుకువెళ్ళిన వస్తువులలో ఇంజనీర్లు,శాస్త్రవేత్తలు,భారత వ్యోమగాముల పోస్టుకార్డులతో పాటు వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి తన చేతిరాతతో రాసిన సందేశంగల పోస్టుకార్డును,18 క్యారెట్ల బంగారంతో చేసిన సూక్ష్మ విక్రమ్–1 రాకెట్‌ను కూడా ఇది ఎఐఓలోకి ప్రవేశపెట్టింది. పలువురు ప్రముఖులు ఈ ప్రయోగ కార్యక్రమం సందర్భంగా హాజరయ్యారు. అనేకమంది ఆ తర్వాత స్కైరూట్ సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.అమెరికా,చైనా తర్వాత ప్రైవేటురంగంలో ఈ విధంగా రాకెట్లు ప్రయోగించగల సామర్థ్యాన్ని ప్రపంచ మూడవదేశంగా భారత్ సంతరించుకుంది.



## అధ్యయనం

(3వ పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. వ్యవసాయం, నీటి పారుదల, అటవీ, విద్యుత్, పశుసంవర్ధక, మత్స్య, విద్యాశాఖల ఉన్నతాధికారులతో పాటు ఇక్రిశాట్, ఐఎండి, క్రిడా, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, మార్క్‌ఫెడ్ టిజిఆయిల్ ఫెడ్, నాబార్డ్ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేయడం, వ్యవసాయం, అనుబంధ రంగాలకు నష్టం తగ్గించే నివారణ, అనుసరణ చర్యలను ప్రభుత్వానికి సూచించడం, రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు అమలు చేయాల్సిన అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం కమిటీ ప్రధాన బాధ్యతలుగా ప్రభుత్వం పేర్కొంది. కమిటీ సంబంధిత వర్గాలతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు, సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయనుంది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com